


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 68 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ సోమవారం 19 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 68 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD MON 19 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## భారత్‌లో ఏఐ సేవలకు అమెరికన్లు ఎందుకు చెల్లిస్తున్నారు?

**హైదరాబాద్ పెన్ పవర్::** భారత్ వంటి ఇతర దేశాల్లో కృత్రిమ మేధ సేవల కోసం అమెరికన్ వనరులను ఉపయోగిం చడాన్ని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో విమర్శించారు. చాట్‌జీపీటీ వంటి ప్లాట్‌ఫామ్‌లు అమెరికా భూభాగంపై ఇక్కడి విద్యుత్తును ఉపయోగించి పనిచేస్తున్నాయని.. కానీ, భారత్ వంటి దేశాల్లో పెద్ద సంఖ్యలో వినియోగదారులకు సేవలందిస్తున్నాయని పేర్కొన్నారు. ఓ అమెరికన్ ఛానల్‌లో

వివరాలు 2లో..

## ఎర్రజెండా ఎప్పటికీ

# తలవంచదు

## సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో సీఎం రేవంత్

### బ్రిటీషర్ల కంటే ఎక్కువ ప్రమాదం భాజపాతోనే..: సీఎం రేవంత్‌రెడ్డి



**ఖమ్మం పెన్ పవర్:** కమ్యూనిస్టు మిత్రులను స్ఫూర్తిగా తీసుకొని గత అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడి.. పాశవికంగా వ్యవహరించిన ప్రభుత్వాలను పడగొట్టామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న పాశవిక శక్తులను ఓడించడానికి ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరముందన్నారు. సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలు ఖమ్మంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఖమ్మంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, సీపీఐ అగ్రనేతలు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సీపీఐ శ్రేణులతో ఖమ్మం నగరం ఎరుపెక్కింది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "కాంగ్రెస్, కమ్యూనిస్టు సోదరులు కొట్లాడితేనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. దున్నివాడిదే భూమి అని కమ్యూనిస్టు పార్టీ నినాదం ఇస్తే.. దానికి చట్టరూపం కల్పించింది కాంగ్రెస్ సర్కారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చింది. రజాకార్లకు, నిజాంకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడారు. ఆనాడు జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో 4 వేల మంది వీరులు అమరులయ్యారు. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా ఎర్రజెండా తలెత్తి నిలబడుతుంది. కమ్యూనిస్టుల కంచుకోట ఖమ్మంలో ఈ సభ జరగడం హర్షణీయం.బ్రిటీషర్ల కంటే ఎక్కువ ప్రమాదం భాజపాతోనే. భాజపా అంటే బ్రిటీష్ జనతా పార్టీ. విభజించు, పాలించు, పేదవాళ్లను అణగదొక్కాలని బ్రిటీషర్ల నుంచి వచ్చిన ఆలోచనతోనే... ఇవాళ మనల్ని అణచివేయాలని చూస్తోంది.

వివరాలు 2లో..



## ఆస్తుల సంపాదన కోసం రాజకీయాల్లోకి రాలేదు

- నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల విషయంలో ఓ పత్రికలో అడ్డగోలు రాతలంటూ ఫైర్
- కట్టుకథలకు భయపడి లొంగిపోయే వ్యక్తిని కాదన్న డిప్యూటీ సీఎం
- ప్రభుత్వ వనరులు ప్రజలకు సమానంగా పంచడమే తన లక్ష్యమని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**కట్టుకథలు, పిట్ట కథలు అల్లి ప్రజలను మభ్య పెట్టేలా కథనాలు ప్రచురిస్తే భయపడి లొంగిపోయే వ్యక్తిని కాదంటూ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఓ పత్రికపై మండిపడ్డారు. నైనీ బొగ్గు గనుల టెండర్ల వ్యవహారంలో తనపై ఆరోపణలు గుప్పిస్తూ ఓ పత్రికలో వచ్చిన కథనంపై భట్టి స్పందించారు. ప్రజాభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్తుల సంపాదన కోసమో, వ్యాపారాన్ని విస్తరించుకునేందుకో రాజకీయాల్లోకి రాలేదని

వివరాలు 2లో..



## బాంబు బెదిరింపు... ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

- ఇండిగో విమానానికి బాంబు బెదిరింపుతో కలకలం
- ఢిల్లీ నుంచి బాగ్డోగ్రా వెళుతుండగా లక్నోకు మళ్లింపు
- విమానం టాయిలెట్‌లో టిష్యూ పేపర్‌పై బెదిరింపు నోట్
- ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని వెల్లడి
- బాంబ్ స్క్వాడ్‌తో విమానంలో విస్తృత తనిఖీలు

వివరాలు 2లో..

## ట్రంప్ మమ్మల్ని ఫూల్స్ ని చేశాడు

### ఇరాన్ నిరసనకారుల తీవ్ర ఆగ్రహం

- ఇరాన్ లో నిరసనకారులకు ట్రంప్ మద్దతు
- దాంతో మరింత రెచ్చిపోయి ఆందోళనలు చేసిన నిరసనకారులు
- ప్రభుత్వ అణచివేతలో 15,000 మంది మరణించారని ఆరోపణలు
- ట్రంప్ మాట మార్చి వెనక్కి తగ్గడంతో ప్రజల ఆగ్రహం
- తమను బలిపశువులను చేశారంటూ ట్రంప్‌పై ఇరానియన్ల విమర్శలు
- ఆర్థిక సమస్యలతో మొదలై రాజకీయ రూపుదాల్చిన ఆందోళనలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌లో జరిగిన ప్రభుత్వ వ్యతిరేక నిరసనల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమను నమ్మించి మోసం చేశాడని, ద్రోహానికి పాల్పడ్డాడని అక్కడి ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ ఇచ్చిన హామీలను నమ్మి తాము రోడ్లపైకి వస్తే, ఆయన తమను ఫూల్స్ ని చేశాడని, మాట మార్చి తమను

వివరాలు 2లో..



## గల్లాపెట్టె నింపిన సంక్రాంతి..

### పండగ వేళ టీజీఎస్‌ఆర్టీసీకి రికార్డు స్థాయి ఆదాయం

- సంక్రాంతి పండుగతో టీజీఎస్‌ఆర్టీసీకి భారీ లాభాలు
- కేవలం ఐదు రోజుల్లోనే రూ. 67.40 కోట్ల రికార్డు ఆదాయం
- పండుగ రద్దీ కోసం 6,431 ప్రత్యేక బస్సుల ఏర్పాటు
- తిరుగు ప్రయాణాల కోసం కూడా కొనసాగుతున్న ప్రత్యేక సర్వీసులు
- ఆర్థిక కష్టాల్లో ఉన్న సంస్థకు ఈ ఆదాయం పెద్ద ఊరట




**హైదరాబాద్ పెన్ పవర్:**సంక్రాంతి పండుగ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు కాసుల వర్షం కురిపించింది. పండుగ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని ముందుగానే అంచనా వేసి పక్కా ప్రణాళికతో వ్యవహరించిన ఆర్టీసీ యాజమాన్యం, కేవలం ఐదు రోజుల్లోనే రికార్డు స్థాయిలో ఆదాయం సాధించింది. ఈ నెల 9 నుంచి 13వ తేదీ మధ్య సంస్థకు

వివరాలు 2లో..



## ముఖ్యమంత్రివా..? ముఠా నాయకుడివా..?

### సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజం
- బీఆర్ఎస్ జెండా గద్దెలు కూల్చాలన్నారంటూ తీవ్ర ఆగ్రహం
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సీఎం వ్యాఖ్యలున్నాయని ఆరోపణ
- సీఎం రేవంత్‌పై చర్యలు తీసుకోవాలని డీజీపీని డిమాండ్ చేసిన కేటీఆర్
- పాత బాస్ ఆదేశాలతోనే రేవంత్ పనిచేస్తున్నారని విమర్శ

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ జెండా గద్దెలను ధ్వంసం చేయాలంటూ

వివరాలు 2లో..

## ఆరుగురు మావోయిస్టులు మృతి

### కొనసాగుతున్న ఎదురు కాల్పులు..

**హైదరాబాద్ పెన్ పవర్:**ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసు బలగాలకు మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. కాల్పుల్లో ఇప్పటివరకు ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. నేషనల్ పార్క్ అడవుల్లో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, పశ్చిమ సబ్ జోనల్

వివరాలు 2లో..



## మేడారం జాతర స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం



- బస్సు చార్జీలను ఖరారు చేసిన ఆర్టీసీ
- హైదరాబాద్ నుంచి రూ.600 - రూ.1,110
- వరంగల్, హనుమకొండ నుంచి రూ.250 నుంచి రూ.500

**హైదరాబాద్ పెన్ పవర్:**మేడారం జాతరకు వెళ్లే మహిళలకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. జాతర సందర్భంగా ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు నడపనున్న విషయం తెలిసిందే. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్లు ప్రకటించింది.

వివరాలు 2లో..




## ప్రైవేట్ స్కూల్ ఫీజులు ఎలా పడితే అలా పెంచితే కుదరదు..

### త్వరలో కొత్త చట్టం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో ప్రైవేట్ స్కూల్ ఫీజుల పెంపుపై కళ్లెం వేసేందుకు సిద్ధమైంది ప్రభుత్వం. ఎలా పడితే అలా పెంచి విద్యార్థుల ను, తల్లిదండ్రు లను ఇబ్బందులకు గురిచేయకుండా కట్టడి చేయనుంది. అందులో భాగంగా కొత్త చట్టం తీసుకొచ్చేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. ఫీజులు ఏటేటా పెంచకుండా రెండేళ్లకు ఒకసారి 8 శాతం లోపు పెంచుకునేలా చట్టం తీసుకురా నుంది.ఫీజుల పెంపు కోసం రాష్ట్ర ఫీ రెగ్యులేటరీ కమిటీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. 8 శాతం లిమిట్ కు లోబడి పెంచేందుకు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# బ్రేకులు ఫెయిల్

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారు. కానీ ఆయన శ్రమను ప్రజలు గుర్తిస్తున్నారు కానీ ఎమ్మెల్యేలు మాత్రం గుర్తించడం లేదు.ఎక్కువ మంది శాసనసభ్యులు తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా మారారు. ఎమ్మెల్యేల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటూ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ వారి వ్యవహార శైలిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు నిజంగా దోపిడీకి దిగుతున్నారన్న విమర్శలు సొంత పార్టీ కార్యకర్తల నుంచే వినిపిస్తున్నాయి. గతంలో ప్రధాన మీడియా ద్వారా వచ్చే విమర్శలు.. ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా వస్తున్నాయి.

**మందలించారంటూ...**

ఇటీవల మంగళగిరి కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి అందిన నివేదిక మేరకు దాదాపు 48 మంది ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేదని, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదని స్పష్టం చేసింది. అయితే వారిని చంద్రబాబు హెచ్చరించినట్లుగా వార్తలు వచ్చినప్పటికీ ఎమ్మెల్యే పనితీరు మాత్రం గాడిన పడలేదన్నది వాస్తవం. ఎందుకంటే ప్రతి పనికీ పర్సంటేజీలు. ప్రతి కార్యక్రమంలో అవినీతి. సొంత పార్టీ నేతలను కూడా వారు వదలకుండా దోపిడీకి తెరతీస్తున్నారన్న విమర్శలున్నాయి. చంద్రబాబు చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల, లోకేశ్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఎమ్మెల్యేలు కొందరు నిర్భీతిగా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం పార్టీలోనే జరుగుతుంది.

**అనేక మంది ఎమ్మెల్యేలపై...**

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్ని మధ్య తలెత్తిన వివాదంలోనూ ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొలికపూడి శ్రీనివాసరావు ఎంపీపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. అయినా సరే ఆయనను పిలిచి మందలించిన సందర్భం లేదు. అలాగే అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్ ప్రసాద్ విషయంలో కానీ, ఉత్తరాంధ్ర జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేల పనితీరుపై అక్కడి కార్యకర్తలే నేరుగా ఆరోపణలు చేస్తున్నారు. అయినా పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఎమ్మెల్యేల పనితీరుతో పార్టీ బాగా డ్యామేజీ అయింది. ఇక రానున్న కాలంలో ఇలాంటి మెతక వైఖరిని అవలంబిస్తే మాత్రం ఖచ్చితంగా వచ్చే ఎన్నికల్లో టీడీపీ కి నష్టం తప్పదన్న సంకేతాలు ఆ పార్టీ కార్యకర్తల నుంచే వినిపిస్తున్నాయి.

# ముఖ్యమంత్రివా..? ముఠా నాయకుడివా..?

- మొదటి పేజి తరువాయి

సీఎం మాట్లాడడం ఏంటంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన ముఖ్యమంత్రి, హోంమంత్రి పదవుల్లో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. "ముఖ్యమంత్రివా లేక ముఠా నాయకుడివా?" అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను మరిచి, అసాంఘిక చర్యలను ప్రోత్సహించేలా మాట్లాడటం ద్వారా సీఎం తన స్థాయిని దిగజార్చుకున్నారని విమర్శించారు.తెలంగాణ ప్రజల గుండెల్లో గులాబీ జెండాకు ఉన్న స్థానాన్ని చూసి ముఖ్యమంత్రికి మైండ్ బ్లాక్ అయినట్లుందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందని, తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే సీఎంకు మతిభ్రమించిందని, ఆయన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని అన్నారు. సోషల్ మీడియాలో చిన్న పోస్టు పెడితేనే కేసులు పెట్టి అరెస్టులు చేసే పోలీసు శాఖ, ఇప్పుడు నేరుగా హింసను ప్రేరేపించేలా మాట్లాడిన ముఖ్యమంత్రిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర డీజీపీ తక్షణమే స్పందించి, సీఎంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉంటూ రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీ పాట పాడటం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కేటీఆర్ ఆరోపించారు. గత రెండేళ్లుగా తన పాత బాస్ ఆదేశాల మేరకే తెలంగాణ జలహక్కులను కాలరాశారని, నేటి వ్యాఖ్యలతో ఆయన నిజస్వరూపం బట్టబయలైందని అన్నారు. కాంగ్రెస్ మునిగిపోయే నావ అని అర్థం కావడంతోనే, దాని నుంచి బయటకు దూకేందుకు రేవంత్ రంగం సిద్ధం చేసుకుంటున్నారని విమర్శించారు. ఒకవైపు బీజేపీతో చీకటి ఒప్పందాలు, మరోవైపు టీడీపీని రాష్ట్రంపై రుద్దే ప్రయత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని హెచ్చరించారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణకు ద్రోహం చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని కేటీఆర్ స్పష్టం చేశారు.

## బాంబు బెదిరింపు... ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

ఇండిగో విమానంలో బాంబు ఉందంటూ వచ్చిన బెదిరింపుతో తీవ్ర కలకలం రేగింది. ఢిల్లీ నుంచి బెంగాల్ లోని బాగ్డోగ్రా వెళుతున్న విమానాన్ని అత్యవసరంగా లక్నోకు మళ్లించారు. ఈ ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఆ సమయంలో విమానంలో ప్రయాణికులు, సిబ్బందితో సహా మొత్తం 238 మంది ఉన్నారు.

వివరాల్లోకి వెళితే, ఇండిగో విమానం 6ఇ-6650 ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బాగ్డోగ్రాకు బయలుదేరింది. విమానం గాల్లో ఉండగా, టాయిలెట్‌లోని ఒక టిష్యూ పేపర్‌పై బాంబు ఉన్నట్లు చేతితో రాసిన బెదిరింపు నోట్‌ను సిబ్బంది గుర్తించారు. వెంటనే పైలట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)ని ఉదయం 8:46 గంటలకు అప్రమత్తం చేశారు. అధికారుల సూచన మేరకు విమానాన్ని సమీపంలోని లక్నో విమానాశ్రయానికి మళ్లించారు. ఉదయం 9:17 గంటలకు విమానం లక్నోలో సురక్షితంగా ల్యాండ్ అయింది. అనంతరం విమానాన్ని వెంటనే ఐసోలేషన్ బేకు తరలించి ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందకు దించారు. సమాచారం అందుకున్న బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, సీఐఎస్ఎఫ్ బృందాలు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాయి. ప్రయాణికులు, సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు.

ఈ ఘటనపై ఇండిగో ఎయిర్‌లైన్స్ స్పందించింది. ప్రయాణికుల భద్రతకు తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, దర్యాప్తు సంస్థలకు పూర్తిగా సహకరిస్తున్నామని తెలిపింది. ప్రయాణికులకు తాత్కాలికంగా అసౌకర్యం కలగకుండా ఆహారం, ఇతర ఏర్పాట్లు చేస్తున్నామని సంస్థ ప్రతినిధి వివరించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## భారత్‌లో ఏఐ సేవలకు అమెరికన్లు ఎందుకు చెల్లిస్తున్నారు?

- మొదటి పేజి తరువాయి

వైట్ హౌస్ మాజీ ప్రధాన వ్యూహకర్త స్టీవ్ బానన్‌తో జరిగిన ఇంటర్వ్యూలో నవారో ఈమేరకు వ్యాఖ్యలు చేశారు."భారత్‌లో ఏఐ సేవల కోసం అమెరికన్లు ఎందుకు డబ్బులు చెల్లిస్తున్నారు? చాట్‌జీపీటీ అమెరికా గడ్డపై పనిచేస్తోంది. ఇక్కడి విద్యుత్తును ఉపయోగిస్తోంది. కానీ, భారత్, చైనా ఇలా ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాల్లో పెద్దఎత్తున వినియోగదారులకు సేవలు అందిస్తోంది" అని నవారో వ్యాఖ్యానించారు. అదే విధంగా అమెరికాలో వ్యవసాయ భూముల కొనుగోళ్లపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ సంస్థలు స్థానిక వ్యవసాయ భూములను వాస్తవ ధర కంటే పది రెట్లు ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి ధోరణులు అమెరికాలో ఆహార ధరల పెంపునకు కారణం కావొచ్చన్నారు.

అమెరికా (ఖూూా)తో వాణిజ్యం, రష్యాతో కొనసాగిస్తున్న విధానాలపై భారత్‌ను లక్ష్యంగా చేసుకుని నవారో గతంలోనూ పలు సందర్భాల్లో విమర్శలు గుప్పించారు. భారత్ అత్యధిక సుంకాలు విధించడం వల్ల అమెరికా ఉద్యోగాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. లాభం కోసమే ఆ దేశం రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందని, ఉక్రెయిన్‌తో మాస్కో చేస్తున్న యుద్ధాన్ని పోషిస్తోందని నోరు పారేసుకున్నారు. భారత్ ఈ వ్యాఖ్యలను కొట్టిపారేసింది. రష్యా (=బంంఖ) నుంచి తాము చమురు కొనుగోలు చేస్తోంది కేవలం ఇంధన భద్రత కోసమేనని పేర్కొంది.

# గల్లాపెట్టె నింపిన సంక్రాంతి..

- మొదటి పేజి తరువాయి

టికెట్ల విక్రయం ద్వారా ఏకంగా రూ. 67.40 కోట్ల ఆదాయం సమకూరింది. సగటున రోజుకు సుమారు రూ. 13.48 కోట్ల చొప్పున ఆర్జించడం విశేషం.ఈ ఏడాది సంక్రాంతి సెలవులకు తోడుగా వారాంతపు శని, ఆదివారాలు రావడంతో హైదరాబాద్ నుంచి సొంత ఊళ్లకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులతో బస్సులు కిక్కిరిసిపోయాయి. ఈ రద్దీని తట్టుకునేందుకు టీజీఎస్‌ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా 6,431 ప్రత్యేక బస్సులను నడిపింది. సాధారణ రోజులతో పోలిస్తే ఈ స్పెషల్ సర్వీసుల ద్వారానే రోజుకు అదనంగా రూ. 2.70 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రైవేటు ట్రావెల్స్ అధిక ఛార్జీలు వసూలు చేస్తాయనే భావన, ఆర్టీసీలో సురక్షిత ప్రయాణం వంటి కారణాలతో ప్రజలు ప్రభుత్వ బస్సులకే మొగ్గు చూపారు.

మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం అమలవుతున్నప్పటికీ, పండుగ సీజన్‌లో పెయిడ్ ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడం సంస్థకు ఆర్థికంగా కలిసొచ్చింది. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న టీజీఎస్‌ఆర్టీసీకి ఈ ఆదాయం గొప్ప ఊరటనిచ్చింది.పండుగ ముగియడంతో తిరుగు ప్రయాణాల కోసం కూడా ఆర్టీసీ భారీ ఏర్పాట్లు చేసింది. తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఏపీ నుంచి హైదరాబాద్‌కు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన కూడళ్లలో పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసింది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సుల లభ్యతపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నారు. ఈ పండుగ సీజన్‌లో వచ్చిన ఆదాయంతో భవిష్యత్తులో మరిన్ని ఆధునిక బస్సులను ప్రవేశపెట్టేందుకు రవాణా శాఖ యోచిస్తోంది.

# ఆస్తుల సంపాదన కోసం రాజకీయాల్లోకి రాలేదు

- మొదటి పేజి తరువాయి

స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తులను, వనరులను ప్రజలకు సమానంగా పంచడమే తన లక్ష్యమని ఆయన చెప్పారు. "నైనీ బొగ్గు బ్లాక్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే టెండర్లు పిలవాలని సింగరేణి సంస్థకు సూచించాం. టెండర్లను పిలిచింది సింగరేణి సంస్థే తప్ప మంత్రి కాదు. గనులు ఉన్న ప్రాంతం క్లిష్టమైనది కావడంతో ఫీల్డ్ విజిట్ నిబంధన తప్పనిసరి. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోనూ ఇలాంటి నిబంధనలు ఉన్నాయి. సింగరేణి ప్రజల ఆస్తి.. బొగ్గు గనులు ప్రజల ఆత్మగౌరవం. గద్దలు, దోపిడీదారులు, వ్యవస్థీకృత నేరగాళ్ల నుంచి తెలంగాణ ఆస్తులను కాపాడతాను. మీడియా సంస్థల మధ్య ఉన్న విషయాల్లోకి ప్రజాప్రతినిధులను లాగొద్దు. వ్యక్తిత్వాన్ని హననం చేసే కథనాలు రాసే అధికారం ఎవరికీ లేదు. ఆ మీడియా కథనంలో నా పేరును అనవసరంగా తీసుకువచ్చారు. ఆ పత్రికలో వచ్చిన కథనం వెనుక రాజకీయ ఉద్దేశం ఏమిటో తెలిశాక పూర్తి వివరాలు వెల్లడిస్తా. వైఎస్ రాజశేఖర్ రెడ్డిపై ఉన్న కోపాన్ని ఆయన సన్నిహితుడినైన నాపై చూపిస్తున్నారు. నాయకుల మధ్య విభేదాలు సృష్టించేందుకు కట్టుకథలు రాశారు. ఈ కట్టుకథలకు భయపడి లొంగిపోయే వ్యక్తిని కాదు" అని భట్టి విక్రమార్క అన్నారు.

# మేడారం జాతర స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం

- మొదటి పేజి తరువాయి

ఈ మేరకు శనివారం జాతర స్పెషల్ బస్సులకు టికెట్ ధరలను ఖరారు చేస్తూ ఆర్టీసీ ఓ ప్రకటన విడుదల చేసింది. వరంగల్, హనుమకొండ, హైదరాబాద్ సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపింది.వరంగల్, హనుమకొండ నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో మేడారం జాతరకు వస్తారని అంచనా వేసిన అధికారులు.. అక్కడి నుంచి పెద్ద సంఖ్యలో బస్సులు నడపాలని నిర్ణయించారు. వరంగల్, హనుమకొండ నుంచి మేడారానికి టికెట్ ధర బస్సుల ఆధారంగా రూ.250 నుంచి రూ.500, హైదరాబాద్ నుంచి రూ.600 నుంచి రూ. 1,110 వరకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలు, బాలికలు, ట్రాన్స్ జెండర్లకు 'మహాలక్ష్మి' పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు.

## ప్రైవేట్ స్కూల్ ఫీజులు ఎలా పడితే అలా పెంచితే కుదరదు..

- మొదటి పేజి తరువాయి

మాత్రమే అనుమతి ఉంటుంది. ఒక స్కూలుకు ఫీజు నిర్ణయించే ముందు ముఖ్యమైన డాక్యుమెంట్లు, స్కూల్ కు వస్తున్న రెవెన్యూ, ఆదాయం, ఖర్చుల వివరాలను పరిశీలించి కమిటీ అనుమతించనుంది. ప్రైవేట్, కార్పోరేట్ స్కూల్స్ ఫీజుల పెంపు నియంత్రణకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే ప్రభుత్వానికి చేరింది. వచ్చే కేబినెట్ మీటింగ్ లో దీనిపై చర్చించనున్నారు. రాష్ట్రంలో ఉన్న11 ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఎక్కువ భాగం ఉన్న బడ్జెట్ స్కూల్స్ ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాయి. ఏడాదికి 5 శాతం చుకునేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. రెండు సంవత్సరాలకు ఒకసారి ఎనిమిది శాతం ఫీజు పెంపుదల అనేది ఆమోదయోగ్యం కాదని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ చెబుతోంది. పెరుగుతున్న ధరలు, ఖర్చులు, టీచర్లు, సిబ్బంది జీతాల పెంపుదల.. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఏడాదికి ఒకసారి 5 శాతం ఫీజులు పెంచుకునేలా అనుమతివ్వాలని కోరుతున్నాయి. తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో, ప్రైవేట్ ప్రొఫెషనల్ కాలేజీలకు ఫీజులను నిర్ణయించే తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ తరహాలో, ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి 10 నుండి 15 శాతం ఫీజు పెంపును సిఫార్సు చేసింది.ఫీజు పెంపు కోసం, రాష్ట్ర స్థాయిలో సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో తెలంగాణ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ ఫీజు రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కమిషన్ సిఫార్సు చేసింది. ఈ కమిటీలో సీనియర్ విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, పాఠశాల నిర్వహణ సభ్యులుగా ఉండాలని సూచించింది.

కలెక్టర్ నేతృత్వంలో జిల్లా వారీగా ఫీజు నియంత్రణ కమిటీని కూడా కమిషన్ సిఫార్సు చేసింది. కన్జూమర్ ఇండెక్స్ ను పరిగణనలోకి తీసుకుని ఫీజు పెంపు ప్రతిపాదించడమే కాకుండా, కమిషన్ మూడు సంవత్సరాల లాక్-ఇన్ వ్యవధిని సూచించింది.

## ట్రంప్ మమ్మల్ని ఫూల్స్ ని చేశాడు

- మొదటి పేజి తరువాయి

నట్టేట ముంచాడని ఆవేదన చెందుతున్నారు.ఇరాన్‌లో ఆర్థిక సమస్యలపై మొదలైన ఆందోళనలు ప్రభుత్వ మార్పు డిమాండ్‌తో ఉద్ధృతంగా మారినప్పుడు, ట్రంప్ సోషల్ మీడియా వేదికగా నిరసనకారులకు మద్దతు ప్రకటించారు. "త్వరలోనే సహాయం అందుతుంది" అని, శాంతియుత నిరసనకారులపై హింసకు పాల్పడితే అమెరికా చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. దీంతో అమెరికా సైనిక చర్య తీసుకుంటుందనే ఆశతో చాలామంది నిరసనల్లో పాల్గొన్నారు.అయితే, ఇరాన్ ప్రభుత్వం ఈ నిరసనలను ఉక్కుపాదంతో అణచివేసింది. స్నైపర్ ఫైరింగ్, మెషీన్ గన్లతో జరిపిన దాడుల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని (దాదాపు 15,000 మంది మరణించారని అంచనా) నివేదికలు వచ్చాయి. అయితే, ట్రంప్ తన వైఖరిని మార్చుకుని, ఇరాన్ ప్రభుత్వం హత్యలు ఆపేస్తామని హామీ ఇచ్చిందని, సైనిక చర్య ఉండదని ప్రకటించారు. ఈ పరిణామంతో నిరసనకారులు తీవ్ర నిరాశకు లోనయ్యారు.ట్రంప్ చర్యలపై ౧×వీజు పత్రికతో పలువురు ఇరానియన్లు తమ ఆవేదనను పంచుకున్నారు. "ఈ 15,000 మరణాలకు ట్రంపే బాధ్యుడు. ఆయన పోస్టులు చూసే చాలామంది రోడ్లపైకి వచ్చారు" అని టెహ్రాన్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త అన్నారు. "ట్రంప్ మమ్మల్ని యుద్ధంలో బలిపశువులుగా వాడుకున్నారు. మా కాళ్ల కింద నుంచి నేల లాగేశారు" అని మరికొందరు ఆరోపించారు.

వాస్తవానికి, దేశంలో కరెన్సీ విలువ పడిపోవడం, ధరల పెరుగుదల వంటి ఆర్థిక సమస్యలతో ఈ నిరసనలు మొదలయ్యాయి. అయితే, ఇవి క్రమంగా ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలుగా మారాయి. ఇరాన్ అధికారులు మాత్రం ఈ నిరసనలను అమెరికా కుట్రగా అభివర్ణిస్తున్నారు. ట్రంప్ తీరుతో ఇరాన్ ప్రజల్లో ఆయనపై తీవ్ర అపనమ్మకం నెలకొంది.

## ఆరుగురు మావోయిస్టులు మృతి

- మొదటి పేజి తరువాయి

బ్యూరో ఇన్‌ఛార్జి సున్నం చంద్రయ్య ఎలియాస్ పాపారావు.. నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా ఉన్నారని నిఘావర్గాలకు సమాచారం అందడంతో బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా సహా నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్రకుమార్ తెలిపారు. ఓ మహిళా మావోయిస్టు సహా నలుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో దిలీప్ బెడ్జా ఉన్నట్లు గుర్తించారు. అదే ప్రాంతంలో ఇవాళ జరిగిన ఎదురుకాల్పుల్లో మరో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి ఏకే 47, 303 రైఫిల్, ఇన్సాస్, రైఫిల్‌తో పాటు భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## ఎర్రజెండా ఎప్పటికీ తలవంచదు

- మొదటి పేజి తరువాయి

ఆనాడు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీ కలిసి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొస్తే.. ఇవాళ ఆ పథకాన్ని రద్దు చేశారు. నరేంద్ర మోదీ కార్పొరేట్ కంపెనీల చేతిలో కీలుబొమ్మగా మారి ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచి.. మల్టీ నేషనల్ కంపెనీలకు మన హక్కులను తాకట్టు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం రద్దుతో మళ్లీ వలసలు మొదలవుతాయి. రాజ్యాంగాన్ని సమూలంగా మార్చడానికి, పేదల హక్కులు కొల్లగొట్టడానికి భాజపా 400 సీట్లు అడిగింది. కానీ, రాహుల్ గాంధీ, కమ్యూనిస్టులు ప్రజల దగ్గరకు వెళ్లి చెప్పడంతో.. 240 సీట్ల వద్దే ఆ పార్టీ ఆగింది. రాజ్యాంగాన్ని దెబ్బ తీసేందుకు మళ్లీ ఎస్ఐఆర్ (ూ×=) తీసుకొచ్చారు. ఎస్ఐఆర్ ద్వారా పేదల ఓటు హక్కును కేంద్రం రద్దు చేస్తోంది" అని సీఎం ఆరోపించారు.

# పెన్ పవర్ తెలంగాణ రౌండప్



డి.పోచంపల్లి సర్వే నెం.120లో 58-59 జీవో పట్టాలు ఉన్నాయట..

- "పెన్ పవర్" వార్తా కథనాలపై దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి సమాధానం..
- స్థానికుల ఫిర్యాదులతో పలుమార్లు వార్తలు వచ్చిన నిర్మాణాలపై ఎమ్మార్వో వివరణ..
- ప్రభుత్వ భూమిలో ఆ నిర్మాణాలకు రెవెన్యూ రికార్డుల్లో '58-59' పట్టాలు ఉన్నయ్..
- దుండిగల్ ఎమ్మార్వో వాట్సప్ గ్రూపులో తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి స్పష్టీకరణ..
- ప్రభుత్వ భూమిలో నిర్మాణాలుగా భావిస్తున్న దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్ అధికారులు..
- శాఖల సమన్వయ లోపంతో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలపై చర్యలకు దూరం..
- ఇప్పటికైనా దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్ అధికారులైనా స్పందిస్తారా చూడాలి..

# ఆ నిర్మాణాలకు..! '58-59' జీవో పట్టాలు..!

## దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి స్పష్టత..

- సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో అవి.. రెవెన్యూ రికార్డుల్లో '58-59' పట్టాలు..!
- పాతవి కూల్చేసి కొత్తవి నిర్మిస్తున్నారు: దుండిగల్ తహశీల్దార్..
- అందులో ఒకసారి కూల్చేసిన నిర్మాణాలు మళ్ళీ నిర్మించారని సమాచారం సారు..!

ఎట్టకేలకు దుండిగల్ రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలపై స్పష్టతను ఇచ్చారు.. సర్వే నెంబర్ 120 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలుగా స్థానికులు ఆరోపిస్తూ..! 58-59 జీవోల మాటున అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు చెబుతున్నారని ఆరోపణలు..! దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి మాత్రం, సంబంధిత నిర్మాణాలకు "58-59" జీవో ప్రకారం క్రమబద్ధీకరించారని స్పష్టీకరించారు.. రెవెన్యూ రికార్డులు ఉన్నాయని తహశీల్దార్ దుండిగల్ మీడియా గ్రూపులో మెస్సేజ్ ద్వారా స్పష్టతను ఇచ్చారు. ఏదిఏమైనప్పటికీ బాధ్యత గల అధికారులు, ప్రభుత్వ పరిరక్షణే ధ్యేయంగా విధుల్లో ఉన్న రెవెన్యూ అధికారులు చెబుతున్నది 100 శాతం నమ్మాల్సిందే.. అయితే 59 జీవో క్రమబద్ధీకరణ అంటే, సంబంధిత ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు, లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఆధారాలు కూడా మీడియాకు ఇచ్చి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.. అటు మీడియాను తప్పుదోవ పట్టించి, వార్తా కథనాలకు కారణమైన ఫిర్యాదు దారులకు కూడా చెంప పెట్టుగా ఉండేదని భావిస్తున్నారు సంబంధిత ఆధారాలను ఇవ్వగలరా అంటూ అదే మీడియా గ్రూపులో 'పెన్ పవర్' ప్రతినిధి అధికారులకు పెట్టిన మెస్సేజ్‌కి మాత్రం ఆదివారం సాయంత్రానికి కూడా సమాధానం ఇవ్వలేదు.. బహుశా సెలవుదినం అయినందున కాబోలు.. మరుసటి రోజు ఇస్తారేమో ప్రయత్నం చేద్దాం..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 18:

-4లో



సర్వే నెం.120 గాంధీ విగ్రహం వద్ద రెవెన్యూ క్రమబద్ధీకరణ అంటున్న ఎమ్మార్వో..



పాశపత అభిషేకంలో అధ్యక్షుడు గోగులపాటి..

శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు..

# ఘనంగా రుద్ర సంపుటిత..! గణపతి పాశుపత అభిషేకం..!

## సూరారం కాలనీలో వేద మంత్రోచ్చారణల నడుమ భక్తిశ్రద్ధలతో పూజలు..



ఓ మహిళకు పొయ్యి పెనం బహుమతిని అందజేస్తున్న బ్రాహ్మణ సంఘం..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జనవరి 18:** మౌని, ఛోళ్ళంగి అమావాస్య పురస్కరించుకొని శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో "రుద్ర సంపుటిత సర్వ దోష--సర్వరోగ నివారణ గణపతి పాశుపత అభిషేకం" కార్యక్రమాన్ని ఆదివారం సూరారం కాలనీలోని వాసవి ఆర్యవైశ్య సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు.. సంఘం ప్రధాన కార్యదర్శి నిట్టల సుబ్రహ్మణ్య స్వామి నేతృత్వంలో జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పంచామృతాలు, దూర్వాజలంతో వినాయకుడికి విశేష అభిషేకం నిర్వహించారు. వేద పండితుల నమక--చమక సహిత పాశుపత మంత్రోచ్చారణల మధ్య గణపతి పాశుపతం పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం భక్తిశ్రద్ధతో మార్మోగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ, సర్వ దోషాలు--సర్వరోగాల నివారణతో పాటు సమాజ శ్రేయస్సు కోసం 'లోకా సమస్తా సుఖినోభవంతు' అనే మహావాక్య భావనతో ఈ పూజలు నిర్వహించినట్లు తెలిపారు. వేద విద్యార్థులు గణేశ్, విశ్వశ్రీ నాగేంద్ర, సమిఖ్, వేదాంత్‌లు రుద్రం, వేదపఠనం చేయగా కార్యక్రమం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ--ప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేయగా భక్తులు భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. అలాగే స్వయం ఉపాధి కోసం ఒక మహిళకు, సంఘం తరపున "పొయ్యి పెన్ం" విరాళంగా అందజేయడం విశేషం. ఈ కార్యక్రమంలో సంఘం ముఖ్య సలహాదారులు సర్వేపల్లి రమేష్ కుమార్, హనుమంతరాయ శర్మ; ఉపాధ్యక్షులు చక్రధారి శ్రీరామశర్మ, గడ్డం రాంబాబు; సంయుక్త కార్యదర్శులు హరి రాఘవేంద్ర, సింహచలం శ్రీధరాచార్యులు; ప్రచార కార్యదర్శులు జగదీష్, శివభాస్కర్; కార్యవర్గ సభ్యులు దుర్గా నాగమోహన్, కనుపర్తి సాయిరాం, రమేష్ కులకర్ణి, చింతపట్ల వెంకటరమణాచార్యులు; మహిళా కార్యవర్గ సభ్యులు హైమ, జ్యోతి, లక్ష్మీ కుమారి, బండి సాయి సుందరి, సునీతతో పాటు సభ్యులు పృత్యుంజయ శర్మ, గడ్డం గోవర్ధన్, ఉమాకాంత్ శర్మ తదితరులు పాల్గొన్నారు..



# కన్జర్వేషన్ జోన్‌లు ఎత్తివేయాలని.. కేంద్ర మంత్రికి వినతిపత్రం..

- బడా బాబులకు లేని ఆంక్షలు..! రైతులకు మాత్రం ఎందుకు..?
- పీసరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేత..

- దుండిగల్ మండలంలో హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్ పేరుతో రైతులకి ఆంక్షలు..
- మాస్టర్ ప్లాన్ కన్జర్వేషన్ జోన్ ఎత్తివేయాలని కేంద్రమంత్రి జీ.కిషన్ రెడ్డికి బీజేపీ వినతి..
- కన్జర్వేషన్ జోన్ కారణంగా దుండిగల్ సర్కిల్‌లోనే 50 వేల రైతులకు ఇబ్బందులు..
- రైతులకు సొంత ఇల్లు కట్టుకునే హక్కు కూడా లేకుండా పోయిందని ఆవేదన..
- బడా బాబుల భూములు మల్టిపుల్ జోన్లలో, పేదల భూములు నిర్మాణ నిషేధ జోన్‌లలో..
- ఓఆర్ఆర్ లోపల జీహెచ్ఎంసిలో విలీనం చేసిన గ్రామాల్లో కూడా కన్జర్వేషన్ జోన్..
- హిల్‌టాప్ పాలసీతో 9,200 ఎకరాలు జోన్ మార్పులు చేసిన ప్రభుత్వం..
- రైతుల దరఖాస్తులు మాత్రం సంవత్సరాల తరబడి పెండింగ్‌లోనే: కృష్ణారెడ్డి..

-4లో

# ఆ నిర్మాణాలకు..! '58-59' జీవో పట్టాలు..!



సర్వే నెం.120లో '58-59' జీవో పట్టాలుగా తహశీల్దార్ చెప్పిన వాటిలో ఇదికూడా..



సర్వే నెం.120లో



సర్వే నెంబర్ 120లో..

-3 పేజి తరువాయి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలం దొమ్మర పోచంపల్లి గ్రామ శివారు సర్వే నెంబర్ 120 ప్రభుత్వ భూమిలో దాదాపు 50 వరకు సబ్ డివిజన్‌లు ('బై' నెంబర్‌లు) కూడా ఉన్నాయి.. మరోవైపు ఈ ప్రభుత్వ భూమి తహశీల్దార్ కార్యాలయానికి ఆనుకుని కూతవేటు దూరంలోనే ఉండటం గమనార్హం.. గతంలో ఇదే ప్రభుత్వ భూమిలో కార్యాలయానికి ఎదురుగానే నిర్జన ప్రదేశంలో ప్రభుత్వ నిధులతో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టినా చేతులు ముడుచుకుని కూర్చిని ఐదేళ్ళుగా నేటికీ చర్యల్లేవు.. గతంలో అక్కడక్కడా (కొన్ని సబ్ డివిజన్‌లలో) 59 జీవో పట్టాలు జారీ చేసిన విషయం నిజమే.. కానీ స్థానికుల కథనం ప్రకారం 58-59 జీవో పట్టాలు జారీచేయని చోట (సబ్ డివిజన్‌లలోనూ) కూడా అదే '58-59' జీవోల దందా కొనసాగుతుందని, ఒకచోట జారీచేసిన పట్టాలను చూపి, మరోచోట అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానికులు (నమ్మదగిన వారు) ఆరోపిస్తున్నారు. ఇటు రెవెన్యూ అధికారులు కూడా సంబంధిత ఆధారాల గురించి, మీడియా అడిగి నప్పటికీ ఇవ్వకుండా గోప్యంగా ఉంచడంపై స్థానికుల ఆరోపణలకు బలం చేకూరే విధంగా ఉంది.. సక్రమమేనని తహశీల్దార్ చెబుతున్న కట్టడాలలో కొన్ని గతంలో కూల్చేసినవేనని స్థానికుల ఆరోపణ.. అప్పుడు కూల్చేసిన అధికారులకి, బహుశా ఆ భూములపై అవగాహన ఉండకపోవచ్చనే విమర్శలు కూడా లేకపోలేదు.. రెవెన్యూ తరపున అక్రమం కాదు సక్రమమేనని, '58-59' జీవో ప్రకారం రెవెన్యూ రికార్డుల్లో క్రమబద్ధీకరణ ఉన్నట్టు దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి స్పష్టతను ఇచ్చారు. అయితే రెవెన్యూ క్రమబద్ధీకరణపై అవగాహన లేని ప్రజలు ఉండరు.. రెవెన్యూ 59 జీవో రెగ్యులరైజేషన్ అంటేనే, లబ్ధి దారుల నుండి రుసుము చెల్లించుకుని, అధికారులు స్వయంగా

లబ్దిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు.. ఆ విధంగా ఉంటే మున్సిపల్ పర్మిషన్‌లు తీసుకోవచ్చుకదా అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి.. తహశీల్దార్ బాధ్యతలు చేపట్టిన వారానికే 28 అక్రమ నిర్మాణాలుగా నిర్ధారించి కూల్చేసినట్లుగా..! ఒకసారి సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో మొత్తం నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్రమ నిర్మాణాలు గుర్తించి, కూల్చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు..

## మున్సిపల్ పర్మిషన్‌లు ఉన్నాయా..?

దుండిగల్ మండలం దొమ్మర పోచంపల్లి సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు అంటూ పలుమార్లు పెన్ పవర్ దినపత్రికలో వచ్చిన వార్తా కథనాలకు ఎట్టకేలకు తహశీల్దార్ సమాధానం ఇచ్చారు.. సంబంధిత నిర్మాణాలు '58-59' జీవో ప్రకారం క్రమబద్ధీకరణకు ఆమోదించబడినాయని పేర్కొన్నారు.. ఇప్పుడు అదే 58-59 జీవో పట్టాలు మున్సిపల్ అనుమతులకు అర్హతలేదా అంటూ ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.. 2019 మున్సిపల్ యాక్ట్ టిజి-బిపాస్ చట్టం ప్రకారం ప్రతి చిన్న నిర్మాణం కూడా పర్మిషన్ తీసుకోవాలని, నిబంధనలు ఉన్నప్పటికీ, సర్వే నెంబర్ 120లో పిల్లర్‌లతో అక్రమ కట్టడాలు చేపట్టడం విశేషం.. ఇదే విషయాన్ని దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ నాయక్, అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసిపి) శ్రీనివాస్, టిపిఎస్ సంజునా, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళగా ఏసిపి శ్రీనివాస్ స్పందించారు.. విచారణ జరిపిస్తామని తెలిపారు.

సర్వే నెంబర్ 120 లో.. ఇవన్నీ తహశీల్దార్ చెప్పిన 58-59 జీవో పట్టాలేనట..



సర్వే నెంబర్ 120లో ఫెన్సింగ్ పెట్టిన ఈ స్థలానికి 58-59 జీవో పట్టాలు ఉన్నయన్న ఎమ్మార్వో..



- దుండిగల్ మండలంలో హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్ పేరుతో రైతులకి ఆంక్షలు..
- మాస్టర్ ప్లాన్ కన్జర్వేషన్ జోన్ ఎత్తివేయాలని కేంద్రమంత్రి జీ.కిషన్ రెడ్డికి బీజేపీ వినతి..
- కన్జర్వేషన్ జోన్ కారణంగా దుండిగల్ సర్కిల్‌లోనే 50 వేల రైతులకు ఇబ్బందులు..
- రైతులకు సొంత ఇల్లు కట్టుకునే హక్కు కూడా లేకుండా పోయిందని ఆవేదన..
- బడా బాబుల భూములు మల్టిపుల్ జోన్లలో, పేదల భూములు నిర్మాణ నిషేధ జోన్‌లలో..
- ఓఆర్ఆర్ లోపల జీహెచ్ఎంసిలో విలీనం చేసిన గ్రామాల్లో కూడా కన్జర్వేషన్ జోన్..
- హిల్‌టాప్ పాలసీతో 9,200 ఎకరాలు జోన్ మార్పులు చేసిన ప్రభుత్వం..
- రైతుల దరఖాస్తులు మాత్రం సంవత్సరాల తరబడి పెండింగ్‌లోనే: కృష్ణారెడ్డి..

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు..



కేంద్ర మంత్రితో బీజేపీ సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి..



# కన్జర్వేషన్ జోన్‌లు ఎత్తివేయాలని...
# కేంద్ర మంత్రికి వినతిపత్రం

### బడా బాబులకు లేని ఆంక్షలు..! రైతులకు మాత్రం ఎందుకు..?

### పీసరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేత..

**దుండిగల్, పెన్ పవర్,జనవరి 18:** హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల "సమగ్ర అభివృద్ధి" పేరుతో తీసుకొచ్చిన హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్ వ్యవహారం, ఇప్పుడు వేలాది రైతుల జీవితాలపై భారంగా మారింది..ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి మాటెలా ఉన్నా.. పేద, అమాయక, సన్న, చిన్నకారు రైతులకు మాత్రం ఈ మాస్టర్ ప్లాన్ ఆంక్షలు శిక్షించే విధంగా మారిందన్న ఆరోపణలు బలపడుతున్నాయి.. దుండిగల్ సర్కిల్ పరిధిలోని రైతుల భూములను కంజర్వేషన్ జోన్లోనే కొనసాగించడం వలన, సొంత భూమిలో చిన్న ఇల్లు కూడా నిర్మించుకోలేని పరిస్థితి నెలకొందని దుండిగల్ సర్కిల్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.. ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తూ దుండిగల్ మున్సిపల్ బీజేపీ నాయకత్వంకేంద్రమంత్రి జీ.కిషన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసంది.. రైతుల భూములు కన్జర్వేషన్ జోన్‌లో పెట్టి, రియల్ ఎస్టేట్‌కు మాత్రం స్వేచ్ఛను కల్పించారని ఆరోపించారు..!



కేంద్రమంత్రితో బీజేపీ నాయకుడు ఎంబరి ఆంజనేయులు..



హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్‌లో భూములను జోన్‌ల విభజన పేద రైతుల భూములు ఇండ్ల నిర్మాణానికి అవకాశం లేకుండా పోయిందని ఆరోపించారు.. బడా బాబుల భూములు ఎన్ని అంతస్తులైనా కట్టుకునే మల్టిపుల్ జోన్లలో ఉండటం ద్వారా ప్రభుత్వ విధానాల్లోని వివక్ష స్పష్టంగా కనిపిస్తోందని బీజేపీ నేతలు ఆరోపించారు..

## అత్యధికంగా కన్జర్వేషన్ జోన్ ప్రభావిత గ్రామాలు..

**దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్, దుండిగల్, నాగులూరు, డి.పోచంపల్లి, మల్లంపేట్, బహదూర్‌పల్లి, గాగిల్లాపూర్, శంబిపూర్ గ్రామాల రైతులు అత్యధికంగా ఈ కంజర్వేషన్ జోన్ ప్రభావానికి లోనవుతున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు.. దీంతో దాదాపు 50 వేల మంది రైతులు తమ భూముల్లో నివాసాలు నిర్మించుకోలేక, ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఓఆర్ఆర్ లోపల కూడా కన్జర్వేషన్ జోన్‌లు ఏంటని ప్రశ్నిస్తున్నారు..? ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చి, ఆతర్వాత ఈ మధ్యనే జీహెచ్ఎంసిలో విలీనం చేసిన ప్రభుత్వం, అదే ప్రాంతాల్లోని భూములను ఇంకా కన్జర్వేషన్ జోన్‌లుగా కొనసాగటటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. మహానగరంగా మారిన ప్రాంతాల్లోనూ వ్యవసాయ భూముల పేరుతో ఆంక్షలు కొనసాగించడం రైతులపై కావాలని మోపిన భారమేనని విమర్శించారు..**

## హిల్ట్ పాలసీకి ఉన్న ప్రాధాన్యత.. రైతుల దరఖాస్తులకు లేదు..

ప్రభుత్వం హిల్ట్ పాలసీ ద్వారా ఒక్క కలం పోటుతో 9,200 ఎకరాల పారిశ్రామిక జోన్ భూములను మల్టిపుల్ జోన్‌గా మార్చగలిగినప్పుడు, హెచ్ఎండిఏ పరిధిలోని రైతుల భూముల విషయంలో సంవత్సరాల తరబడి దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టడం ఎవరి లాభాపేక్ష కోసం అంటూ బీజేపీ ప్రశ్నించింది.. బడా బాబులకు ఒక న్యాయం.. రైతులకు మరో న్యాయమా అంటూ నిలదీసింది.. జీహెచ్ఎంసి విలీనంతో రైతులపై పన్నుల భారమే తప్ప లాభం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.. దుండిగల్ మున్సిపాలిటీని మూడు డివిజన్లుగా విభజించి జీహెచ్ఎంసిలో విలీనం చేయడంతోరైతులపై పన్నులు పెరిగాయని,అయితే అటు రైతు బంధు, ఇటు రుణమాఫీ లాంటి ప్రయోజనాలు మాత్రం దక్కలేదని తెలిపారు..

**ఇటు భూమిపై హక్కు ఉన్నా,అటు జోన్ నిబంధనలతో సొంత ఇంటి కల కూడా నెరవేరడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. రైతుల తరఫున స్పష్టమైన డిమాండ్‌ను తెలియజేశారు.. రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న హెచ్ఎండి మాస్టర్ ప్లాన్‌ను తక్షణమే సవరించి,దుండిగల్ సర్కిల్ పరిధిలోని భూములను కంజర్వేషన్ జోన్ నుంచి మల్టిపర్పస్, రెసిడెన్షియల్ జోన్లుగా మార్చాలని కేంద్రమంత్రి జీ. కిషన్ రెడ్డిని బీజేపీ నాయకులు కోరారు.. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి. విఘ్నేశ్వర్, మరియు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..**

# కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ప్రతిగటించాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** .కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బి జె పి అహంభావతో రైతు,కార్మికులకు నష్టం చేకూర్చి కార్పొరేట్ సంస్థలకు లబ్ది చేకూర్చే విధంగా రూపొందిస్తున్న చట్టాల్ని ప్రతిఘటించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు.
ప్రజా వ్యతిరేక విధానాలను నిలువరించాలని కోరుతూ సి ఐ టి యు,వ్యవసాయ కార్మిక సంఘం,రైతు సంఘాల ఆధ్వర్యంలో సాగుతున్న జీప్ జాతా ఆదివారం బయ్యారం చేరుకుంది.ఈ సంధర్భంగా మండల కేంద్రంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించిన అనంతరం సుందరయ్య స్మారక స్థూపం వద్ద నంబూరి మదు అద్యక్షతన జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ నిత్యం పేదల,రైతుల సంక్షేమంటూ జపిస్తున్న బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని,ఉపాథి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం కోసం కుట్రలు చేస్తుందని విమర్శించారు. అదేవిధంగా విద్యుత్ సవరణ బిల్లు తో రైతులకు ఉచిత కరెంటు అందకుండా చేస్తుందని ఆరోపించారు. కార్పొరేట్ వ్యక్తుల కనుసన్నలలో నడుస్తున్న కేంద్ర ప్రభుత్వం వారికి లాంబం చేకూర్చే చట్టాలు చేస్తున్నదని అన్నారు. ఈ చట్టాల్ని నిలువరించక పోతే రైతులు,కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందనీ ,రానున్న రోజుల్లో జరిగే పోరాటాల్లో ప్రజలు పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో నాయకులు అల్వాల వీరన్న,గునిగంటి రాజన్న, కందునూరి శ్రీను, రాజమౌళి,సుధాకర్,వెంకన్న, మండా రాజన్న, అంగి రేకుల నాగేశ్వరావు, వల్లాల వెంకన్న,చంటి,మోహన్,పురుషోత్తం తదిత రులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజల సుఖసంతోషాల కోసం అమ్మవారికి ప్రత్యేక పూజలు : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి





**హైదరాబాద్ పెన్ పవర్:** శేరిలింగంపల్లి నియోజకవర్గం, గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయిదుర్గం ప్రాంతంలో ఉన్న కట్ట మైసమ్మ తల్లి ఆలయంలో గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ఈ రోజు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ, గచ్చిబౌలి డివిజన్ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండేలా ఆశీర్వదించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామ దేవతలను పూజించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలలో భాగమని పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లో ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, స్థానిక నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సైబరాబాద్‌లో వీకెండ్ స్పెషల్ డ్రంక్ & డ్రైవ్: 231 మందిపై కేసులు నమోదు

**హైదరాబాద్ పెన్ పవర్:** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 231 మందిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ఈ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిలో 187 మంది ద్విచక్ర వాహనదారులు, 15 మంది ఆటో డ్రైవర్లు, 29 మంది కార్ డ్రైవర్లు ఉన్నారు. హెవీ వాహనదారులు ఎవ్వరూ పట్టుబడలేదని అధికారులు వెల్లడించారు.
బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్‌ట్రేషన్ (దీూజ) ఆధారంగా కేసులను వర్గీకరించగా
203 మంది 30 ఎంజి/100 ఎంఎల్ నుంచి 200 ఎంజి/100 ఎంఎల్ మధ్య,
16 మంది 201 ఎంజి/100 ఎంఎల్ నుంచి 300 ఎంజి/100 ఎంఎల్ మధ్య,
12 మంది 301 ఎంజి/100 ఎంఎల్ నుంచి 550 ఎంజి/100 ఎంఎల్ వరకు మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది.పట్టుబడిన వారందరినీ చట్టప్రకారం కోర్టుకు హాజరుపరుస్తామని సంబంధిత ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు మరోసారి హెచ్చరించారు.
మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే భారతీయ న్యాయ సంహిత2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్టంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా, గత వారం (12.01.2026 నుంచి 17.01.2026 వరకు)లో మొత్తం 45 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి. ఇందులో ఐదుగురికి జరిమానాతో పాటు సోషల్ సర్వీస్ విధించగా, 40 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు వెల్లడించారు.
ప్రజల భద్రతే లక్ష్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగుతాయని, మద్యం సేవించి వాహనం నడపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు ప్రజలను కోరారు.

# హాకీ అంతర్జాతీయ పోటీలకు హైద్రాబాద్ వేదిక కావడం గర్వకారణం



**హైదరాబాద్ పెన్ పవర్:** హాకీ అంతర్జాతీయ పోటీలకు హైద్రాబాద్ గచ్చిబౌలి వేదిక కావడం ఎంతో గర్వకారణమని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. ప్రపంచ స్థాయి క్రీడా పోటీలకు మన ప్రాంతం ఆతిథ్యం ఇవ్వడం గొప్ప విషయం అని, ఇది శేరిలింగంపల్లిగచ్చిబౌలి ప్రాంతానికి దక్కిన విశేష గౌరవమని ఆయన పేర్కొన్నారు.మార్చి 8 నుంచి 14వ తేదీ వరకు గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్న హాకీ వరల్డ్ కప్ పోటీల వివరాలను తెలంగాణ హాకీ అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్‌తో కలిసి పిఏసి చైర్మన్ గాంధీ వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో స్థానికంగా మరింత బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.
ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, వెల్స్, ఉరుగ్వే, స్కాట్లాండ్, కొరియా, ఇటలీ తదితర దేశాల జట్లు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఇది భారత హాకీకి, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, హాకీ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. హాకీ క్రీడ అభివృద్ధికి ఇటువంటి అంతర్జాతీయ పోటీలు ఎంతో దోహదపడతాయని వారు అభిప్రాయపడ్డారు.

# నేటి కేబినేట్ సమావేశం నిర్ణయాలివే



**హైదరాబాద్ పెన్ పవర్:** పదవీకాలం పూర్తయిన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు వీలైనంత తొందరగా ఎన్నికలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం నిర్ణయించింది. రాష్ట్రంలో గడువు పూర్తయిన 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు, వాటి పరిధిలోని 2,996 వార్డులు, డివిజన్లకు సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. చరిత్రలో మొట్టమొదటిసారిగా హైదరాబాద్ వెలుపల మేడారం సమ్మక్కసారలమ్మ సన్నిధిలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. సీఎం రేవంత్ అధ్యక్షతన మేడారంలో జరిగిన ఈ మంత్రిమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.
మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి డెడికేషన్ కమిషన్ ఇప్పటికే నివేదిక సమర్పించడం, రిజర్వేషన్లు కూడా ఖరారవడం, అలాగే ఫిబ్రవరి చివరి వారం నుంచి వివిధ స్థాయిల్లో విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో, సాధ్యమైనంత తొందరగా ఎన్నికలు పూర్తి చేయాలని మంత్రిమండలి భావించింది. మేడారం జంపన్న వాగులో నిరంతరం నీరు ఉండే విధంగా రామప్ప, లక్నవరం నుంచి గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించేందుకు సంబంధించి 143 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. మేడారం పుణ్యక్షేత్రం కోసం ఇప్పటికే 19 ఎకరాల భూ సేకరణ పూర్తి కాగా, మరో 20 లేదా 21 ఎకరాల భూమిని సేకరించి భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని మంత్రిమండలి తీర్మానించింది.2027 జూలై 27 నుంచి ఆగస్టు 3 వరకు జరగనున్న గోదావరి పుష్కరాలను సమగ్ర ప్రణాళికతో నిర్వహించాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరీవాహక ప్రాంతంలోని పురాతన ప్రసిద్ధ దేవాలయాలను ఒక సర్క్యూట్ కింద ఏర్పాటు చేసి, వాటి అభివృద్ధి, ఈకో టూరిజం దృష్టితో నివేదిక అందించేందుకు ఒక కన్సల్టెన్సీని నియమించాలని నిర్ణయించారు. మార్చి 31 నాటికి కన్సల్టెన్సీ అందించే నివేదికపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి, మేడారంలో చేపట్టిన తరహాలోనే ఇతర దేవాలయాలను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసి, పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని మంత్రిమండలి అభిప్రాయపడింది. ఎల్అండ్ టీ సంస్థ నుంచి హైదరాబాద్ మెట్రో టేకోవర్ అంశంపై సమగ్రంగా చర్చించిన మంత్రిమండలి, వచ్చే సమావేశం నాటికి తుది నిర్ణయం తీసుకోనుంది.
ఈలోగా మెట్రో ఫేజ్2లో భాగంగా ూా, దీ విస్తరణలకు సంబంధించిన భూసేకరణను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, అందుకు రూ. 2,787 కోట్లను కేటాయిస్తూ కేబినేట్ ఆమోదముద్ర వేసింది. హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి
శిల్పా లేఔట్ వరకు సుమారు 9 కి.మీ. మేరకు హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి కూడా ఆమోదం తెలిపింది. నల్గొండ జిల్లా మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ పరిధిలో లా కాలేజీ ఏర్పాటు చేయడానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటవుతున్నాయ్: శ్రీనివాస్‌గౌడ్



**హైదరాబాద్ పెన్ పవర్:** పంచాయతీ ఎన్నికల్లో ఫలితాలు సరిగా రాకపోయే సరికి బీఆర్ఎస్‌ను ఎదుర్కొనేందుకు రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటవుతున్నయని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ నేతల పరస్పర పొగడ్తలు మున్సిపల్ ఎన్నికల్లో వారు కుమ్మక్కు అవుతున్నట్టు స్పష్టంగా సూచిస్తున్నాయన్నారు. సీఎం మహబూబ్‌నగర్‌లో మాట్లాడిన తీరు ఎన్నికల్లో మాట్లాడినట్టుగానే ఉన్నదన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే ఆయనకు పథకాలు గుర్తుకొస్తున్నాయని ఎద్దేవా చేశారు. రేవంత్ తన తండ్రి చనిపోతే స్నానానికి నీళ్లు లేవని కరెంటోళ్లకు చెప్పి అరగంట మోటార్ ఆన్ చేసుకున్నామని అసెంబ్లీలో చెప్పింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌లో ఇప్పుడు ఆ పరిస్థితి ఉన్నదా అని నిలదీశారు. కేసీఆర్ పాలనలోనే పాలమూరు పరిస్థితులు మారాయని తెలిపారు. కేసీఆర్ తెలంగాణ తీసుకురాకుంటే రేవంత్ సీఎం అయ్యేవారా అని.. నడుం విరగ్గొట్టి పడుకోబెట్టా అని నీచంగా మాట్లాడుతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కేసీఆర్ ఒక్కడే ప్రాధాన్యత ఇచ్చారు**

'నువ్వు ఏం చేస్తే అడ్డుపడ్డారని హరీశ్‌రావు, కేటీఆర్‌ను మారీచుడు, సుబాహుడు అంటున్నావు'అని నిలదీశారు. జూరాలలో నీళ్లు ఉంటే క్రాప్ హాలిడే ఎందుకు ప్రకటించారన్నారు. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా తీసుకొచ్చి కాంగ్రెస్, బీజేపీ నేతలు మాట్లాడాలన్నారు. మంత్రులకు దమ్ముంటే అశోక్‌నగర్ లైబ్రరీ సందర్శించాలని సవాల్ విసిరారు. మంత్రులు ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకుంటూ మహిళా ఐఏఎస్ అధికారుల పరువును బజారుకీడుస్తున్నారని.. రాష్ట్రంలో వారు పనిచేయడానికి భయపడుతున్నారని అన్నారు. మాజీ మంత్రి సి.లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ.. నల్లమల్ల బిడ్డను అని చెప్పుకుని సీఎం నిత్యం ప్రజల మొహాలు నల్లగా చేసి వెళ్తున్నారని అన్నారు. హెల్త్, ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చింది కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# చంటి బిడ్డతో ట్రాఫిక్ క్లియర్ చేసిన మహిళా కానిస్టేబుల్.. ఫిదా అయిన సీపీ సజ్జనార్!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో ఇటీవల చంటిబిడ్డతో ట్రాఫిక్ క్లియర్ చేసిన మహిళా కానిస్టేబుల్‌పై హైదారబాద్ సీపీ సజ్జనార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఎక్స్ వేదికగా వీడియో పంచుకున్నారు. ఒక చేతిలో పేగు బంధం.. మరో చేతిలో సమాజ బాధ్యత! అంటూ ఆయన ఫిదా అయ్యారు. డ్యూటీలో లేకపోయినా, చంటి బిడ్డ చంకలో ఉన్నా.. ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న అంబులెన్స్ కోసం స్వయంగా దారి క్లియర్ చేసిన ఏపీలోని రంగంపేట మహిళా కానిస్టేబుల్ ఆముదాల జయశాంతికి హ్యాట్సాఫ్.. అంటూ తెలిపారు. కాకినాడ - సామర్లకోట రోడ్డులో ఆమె చూపిన సమయస్ఫూర్తి, విధి నిర్వహణ పట్ల ఆమెకున్న నిబద్ధత అందరికీ ఆదర్శమని చెప్పారు. మాతృత్వానికి, కర్తవ్యానికి సెల్యూట్ అంటూ ట్వీట్‌లో పేర్కొన్నారు.కాగా, రంగంపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళ కానిస్టేబుల్ ఆముదాల జయశాంతి తన డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే కాకినాడ జిల్లా సామర్లకోట ఫ్లైఓవర్ పైన శనివారం రాత్రి విపరీతంగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో ఆమె రంగంలోకి దిగింది. తన బిడ్డను ఎత్తుకొని మరి ట్రాఫిక్ క్లియర్ చేశారు జయశాంతి. ఇక ఈ సంఘటనకు సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. ఇది చూసిన నెటిజెన్స్ ఫిదా అయిపోతున్నారు. ఓ చంటి బిడ్డను ఎత్తుకొని మరి ఇలా ట్రాఫిక్ క్లియర్ చేయడం చాలా గ్రేట్ అని నెటిజన్లు కొనియాడారు.

# కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ప్రతిగటించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**.కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బి జె పి అహంభావతో రైతు,కార్మికులకు నష్టం చేకూర్చి కార్పొరేట్ సంస్థలకు లబ్ది చేకూర్చే విధంగా రూపొందిస్తున్న చట్టాల్ని ప్రతిఘటించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు.ప్రజా వ్యతిరేక విధానాలను నిలువరించాలని కోరుతూ సి ఐ టి యు,వ్యవసాయ కార్మిక సంఘం,రైతు సంఘాల ఆధ్వర్యంలో సాగుతున్న జీప్ జాతా ఆదివారం బయ్యారం చేరుకుంది.ఈ సంధర్భంగా మండల కేంద్రంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించిన అనంతరం సుందరయ్య స్మారక స్థూపం వద్ద నంబూరి మదు అద్యక్షతన జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ నిత్యం పేదల,రైతుల సంక్షేమంటూ జపిస్తున్న బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని,ఉపాథి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం కోసం కుట్రలు చేస్తుందని విమర్శించారు. అదేవిధంగా విద్యుత్ సవరణ బిల్లు తో రైతులకు ఉచిత కరెంటు అందకుండా చేస్తుందని ఆరోపించారు. కార్పొరేట్ వ్యక్తుల కనుసన్నలలో నడుస్తున్న కేంద్ర ప్రభుత్వం వారికి లాంబం చేకూర్చే చట్టాలు చేస్తున్నదని అన్నారు. ఈ చట్టాల్ని నిలువరించక పోతే రైతులు,కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందనీ ,రానున్న రోజుల్లో జరిగే పోరాటాల్లో ప్రజలు పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో నాయకులు అల్వాల వీరన్న,గునిగంటి రాజన్న, కందు నూరి శ్రీను, రాజమౌళి,సుధాకర్,వెంకన్న, మండా రాజన్న, అంగి రేకుల నాగేశ్వరావు, వల్లాల వెంకన్న,చంటి, మోహన్,పురుషోత్తం తదిత రులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ ఫ్లేషన్ తో దూరమవుతున్న యువత..



**హైదరాబాద్ పెన్ పవర్:** ధరల పెరుగుదలతో స్నేహితుల మధ్య దూరం పెరుగుతోంది. ధరల పెరుగుదలకు , స్నేహితుల మధ్య దూరం పెరగటానికి సంబంధం ఏంటని అనుకోవచ్చు. సంబంధం ఉంది. అది ఎలా అంటే.. ఇన్ ఫ్లేషన్ కారణంగా హోటల్ ధరలు, సినిమా టికెట్ ధరలు, ఇతర వస్తువుల ధరలు పెరిగిపోయాయి. దీంతో ఏ చిన్న పార్టీ చేసుకోవాలన్నా, గెట్ టు గెదర్ అవ్వాలన్నా ఖర్చు తడిసి మోపెడవుతోంది. దీంతో అప్పటి వరకు పార్టీలు, ఫ్రెండ్స్ అని తిరిగిన యువత.. ఇప్పుడు చప్పుడు లేకుండా ఇంటికే పరిమితమవుతోంది. ఇన్ ఫ్లేషన్ కాస్తా ఫ్రెండ్స్ ఫ్లేషన్ అయింది.

**ధరలు ఎందుకు పెరుగుతాయి ..**

ధరల పెరుగుదలకు రకరకాల కారణాలు ఉన్నాయి. డిమాండ్ ఉండి.. సప్లై తక్కువ ఉన్నప్పుడు ధరలు పెరుగుతాయి. అదే విధంగా ఉత్పత్తి వ్యయం పెరిగినప్పుడు ధరలు పెరుగుతాయి. దిగుమతి చేసుకున్న వస్తువుల వ్యయం పెరిగినప్పుడు ధరలు పెరుగుతాయి. ఆర్బీఐ నిర్ణయాల కారణంగా కూడా ధరలు పెరుగుతాయి. అయితే ధరల పెరుగుదలకు చాలా కారణాలు ఉన్నప్పటికీ.. ఆ ధరల పెరుగుదలకు సమానంగా ప్రజల ఆదాయం పెరగకపోవడంతో.. ప్రజలు ఖర్చులు తగ్గించుకుంటారు. ఇప్పుడు అదే విధంగా ధరల పెరుగుదల ప్రభావంతో యువత కూడా తమ ఖర్చులు తగ్గించుకుంటోంది. పార్టీలు, ఫ్రెండ్స్ కు దూరంగా ఉంటున్నారు. దీనిని సరదాగా ఫ్రెండ్ ఫ్లేషన్ అంటున్నారు.

**ఫ్రెండ్స్ తో కలవకపోతే..**

మనిషి సాంఘిక జీవి. ఇంకో మనిషితో ఏదో ఒక విధమైన బంధం లేకుండా జీవించలేడు. ఒంటరితనం మానసిక సంఘర్షణకు దారితీస్తుంది. కాబట్టి ధరల పెరుగుదలతో ఫ్రెండ్స్ కు దూరమైతే.. దాని ప్రభావం యువత మానసిక పరిస్థితిపైన దీర్ఘకాలంలో ఉంటుంది. ఒంటరితనం మరింత వ్యయంతో కూడిన భారమవుతుంది. సాంఘిక దూరం ఏర్పడుతుంది. దీని వల్ల టీవీలకు, సెల్ ఫోన్లకు పరిమితమవుతారు. ఇది ఇతర అనారోగ్యానికి దారితీస్తుంది. కాబట్టి ఈ పరిస్థితి నుంచి బయటికి రావాలంటే.. వీటిని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఎదుర్కోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఇది కూడా అవగాహన ద్వారా యువతను చైతన్యవంతం చేయాలని చెబుతున్నారు. అప్పుడే ఈ పరిస్థితిని ఎదుర్కోవచ్చని అంటున్నారు.

**ప్రత్యామ్నాయం ఏంటి ..**

యువత ధరల పెరుగుదలతో ఖర్చులకు వెనుకాడుతున్న సందర్భంలో .. తక్కువ ఖర్చులో మీటింగ్ లు ఏర్పాటు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పార్కులు, ఇంటి దగ్గరే ప్లాన్ చేసుకోవడం ద్వారా ఫ్రెండ్స్ కు దూరం కాకుండా ఉంటారు. అదే సమయంలో ఖర్చులు తగ్గించుకోగలుగుతారు. ఖర్చులు పెరుగుతాయని

ఫ్రెండ్స్ కు దూరంగా ఉంటే సోషల్ డిస్టెన్స్ పెరిగి..మరిన్ని ఇబ్బందులు తలెత్తుతాయని నిపుణులు సూచిస్తున్నారు. సరిగ్గా ప్లాన్ చేసుకోవడం ద్వారా ఇన్ ఫ్లేషన్ ఎదుర్కోవచ్చని చెబుతున్నారు. ఈ పరిస్థితి మెట్రో నగరాల్లో కనిపిస్తోందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అక్కడ మిగిలిన పట్టణ ప్రాంతాలతో పోల్చితే ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. ఫలితంగా యువత ఖర్చులు భరించలేక.. ఇంటికి పరిమితమవుతున్నారు.

# ఎలోన్ మస్క్ బంపర్ ఆఫర్: 'X'లో ఒక ఆర్టికల్ రాస్తే రూ. 9 కోట్ల భారీ బహుమతి!



**హైదరాబాద్ పెన్ పవర్:** కంటెంట్ క్రియేటర్లకు కాసుల వర్షం కురిపించేందుకు సిద్ధమైన టెక్ దిగ్గజం. అయితే ఈ పోటీలో గెలవాలంటే కొన్ని కఠినమైన షరతులు పాటించాల్సిందే. ప్రపంచ కుబేరుడు ఎక్స్ అధినేత ఎలోన్ మస్క్ మరోసారి వార్తల్లో నిలిచారు. ప్లాట్‌ఫామ్‌పై నాణ్యమైన కంటెంట్‌ను పెంచేందుకు ఆయన ఏకంగా వి1 మిలియన్ (సుమారు 9 కోట్లు) బహుమతిని ప్రకటించారు. సోషల్ మీడియా చరిత్రలోనే ఒకే ఒక్క ఆర్టికల్‌కు ఇంత భారీ మొత్తం అందించడం ఇదే తొలిసారి.

**పోటీ నిబంధనలు ఇవే**

ఈ భారీ బహుమతిని సొంతం చేసుకోవడం అంత సులభం కాదు. మస్క్ ఈ పోటీ కోసం చాలా స్పష్టమైన నియమాలను విధించారు. ఆర్టికల్ కనీసం 1,000 పదాలకు తగ్గకుండా ఉండాలి. కేవలం చిన్న పోస్టులు కాకుండా లోతైన విశ్లేషణతో కూడిన రచనలకు మాత్రమే ప్రాధాన్యత ఉంటుంది. ప్రస్తుత కాలంలో ఏఐ సాయంతో కంటెంట్ సృష్టించడం పెరిగిపోయింది. కానీ, ఈ పోటీలో పాల్గొనే ఆర్టికల్ పూర్తిగా మానవ మేధస్సుతో రాసి ఉండాలి. ఏఐ టూల్స్ వాడినట్లు తేలితే సదరు యూజర్ అనర్హుడిగా ప్రకటించబడతారు. కంటెంట్ ఎక్కడా కాపీ చేయకుండా, పూర్తిగా రచయిత స్వంత ఆలోచనలతో కూడి ఉండాలి.

**ఎవరికి ఈ అవకాశం?**

ప్రస్తుతానికి ఈ పోటీ కేవలం అమెరికాలోని 'ఎక్స్' ప్రీమియం సబ్‌స్క్రైబర్లకు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ పోటీకి దరఖాస్తు చేసుకోవడానికి జనవరి 28 ఆఖరి తేదీ. ఈ పరిమితి వల్ల భారతీయ క్రియేటర్లతో పాటు ఇతర దేశాల రచయితలు కొంత నిరాశకు గురైనప్పటికీ భవిష్యత్తులో గ్లోబల్ స్థాయిలో ఇలాంటి పోటీలు నిర్వహిస్తామని మస్క్ హింట్ ఇచ్చారు.

**మస్క్ అసలు లక్ష్యం ఏంటి?**

ట్విట్టర్‌ను 'ఎక్స్'గా మార్చినప్పటి నుండి మస్క్ దానిని కేవలం ఒక మైక్రో బ్లాగింగ్ సైట్‌గా కాకుండా ఒక 'ఎవ్రీథింగ్ యాప్'గా మార్చాలని ప్రయత్నిస్తున్నారు. స్వతంత్ర జర్నలిస్టులను లోతైన విశ్లేషణలు చేసే మేధావులను ప్లాట్‌ఫామ్ వైపు ఆకర్షించడం ప్రధాన ఉద్దేశం. నాణ్యమైన కంటెంట్ ఉంటే యూజర్లు ఎక్కువ సమయం యాప్‌లో గడుపుతారు, తద్వారా ప్లాట్‌ఫామ్ విలువ పెరుగుతుందన్నది మస్క్ ప్లాన్.. టెక్నాలజీ రంగంలో ఉన్నప్పటికీ మానవ సృజనాత్మకతకు ఉన్న విలువను చాటిచెప్పడం మస్క్ ఉద్దేశంగా కనిపిస్తోంది.ఈ 9 కోట్ల ఆఫర్ సోషల్ మీడియా రంగంలో కొత్త ట్రెండ్‌కు తెరలేపింది. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సంస్థలు వీడియో క్రియేటర్లకు ప్రాధాన్యత ఇస్తుంటే మస్క్ మాత్రం 'రాత' కు మళ్ళీ పూర్వ వైభవం తీసుకురావాలని చూస్తున్నారు. జనవరి 28 తర్వాత ఆ అదృష్టవంతుడైన రచయిత ఎవరో ఆ ఆర్టికల్ ఏ అంశంపై ఉంటుందో అని ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# ప్రభుత్వాన్ని కుదిపేస్తున్న సికింద్రాబాద్ సెగ.. అసలు ఏంటి..? ఎందుకీ వివాదం..?




**హైదరాబాద్ పెన్ పవర్:** నగరాలు కేవలం మ్యాపుల్లో గీసిన గీతలు కావు. అవి జ్ఞాపకాల సమాహారం, చరిత్రకు చిరునామా, ప్రజల భావోద్వేగాలకు ప్రతీక. అలాంటి నగరాల్లో ఒకటి 'సికింద్రాబాద్'. హైదరాబాద్‌కు జంట నగరంగా వందేళ్లకు పైగా తనదైన గుర్తింపుతో నిలిచిన సికింద్రాబాద్ ఇప్పుడు మరోసారి చర్చలకు, ఆందోళనలకు కేంద్రంగా మారింది. అభివృద్ధి పేరుతో, పరిపాలనా సౌలభ్యం పేరుతో జరుగుతున్న పునర్వ్యవస్థీకరణ ప్రయత్నాలు సికింద్రాబాద్ అస్తిత్వానికే ముప్పు తెస్తున్నాయా? అనే ప్రశ్న ప్రజల మధ్య గట్టిగా వినిపిస్తోంది. ఇటీవల తెలంగాణలో కొత్త జిల్లాలు, మండలాల పునర్విభజనపై ప్రభుత్వ స్థాయిలో కసరత్తు జరుగుతోందన్న సమాచారం వెలుగులోకి వచ్చింది. ఇదే క్రమంలో సికింద్రాబాద్ ఉత్తర భాగం నార్త్ జోన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలను మల్కాజిగిరి కార్పొరేషన్‌లో కలిపే యోచన ఉందన్న ప్రచారం ఊపందుకుంది. అధికారిక ప్రకటన ఏదీ లేకపోయినా, రాజకీయ వర్గాల వ్యాఖ్యలు ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చాయి. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు సికింద్రాబాద్ పేరు, పరిధి మార్పుపై జరుగుతున్న చర్చలకు అగ్గిపుల్లలా మారాయి.

**హైదరాబాద్ కు జీవనాడి..**

సికింద్రాబాద్ నార్త్ జోన్‌లోని ప్రాంతాలు కేవలం నివాస కాలనీలే కాదు. మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నవి, జనసాంద్రత ఎక్కువగా ఉన్నవి, ఆర్థిక కార్యకలాపాలు చురుకుగా సాగేవి. కుత్బుల్లాపూర్, అల్వాల్ వంటి ప్రాంతాలు సికింద్రాబాద్ జీవన నాడిగా భావిస్తారు. ఇలాంటి ప్రాంతాలను విడదీస్తే అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతుందన్న వాదన ఒకవైపు ఉన్నా.. నగర సమగ్రత దెబ్బతింటుందన్న భయం మరోవైపు ప్రజల్లో ఉంది. ఈ వివాదాన్ని మరింత ముదిరేలా చేస్తుంది ప్రభుత్వ మౌనం. 'విడదీస్తాం' అని స్పష్టంగా చెప్పడంలేదు; 'ఇది కేవలం ప్రచారం' అని కొట్టిపారేయడంలేదు. ఈ మౌనం అనుమానాలను పెంచుతోంది. ప్రజాస్వామ్యంలో పెద్ద మార్పులు ప్రజలతో మాట్లాడకుండా జరగవు. ముఖ్యంగా సికింద్రాబాద్‌లాంటి చారిత్రక నగరానికి సంబంధించిన విషయాల్లో పారదర్శకత అవసరం.

**అన్ని అవసరాలు అక్కడి నుంచే..**

సికింద్రాబాద్ అనగానే గుర్తుకొచ్చేది రైల్వే స్టేషన్, పెద్ద బస్టాండ్, కంటోన్మెంట్ ప్రాంతం, బ్రిటీష్ కాలం నుంచి కొనసాగుతున్న ప్రత్యేక సాంస్కృతిక వాతావరణం. ఇవన్నీ కలిసి సికింద్రాబాద్‌ను హైదరాబాద్‌కు భిన్నమైన నగరంగా తీర్చిదిద్దాయి. ఈ గుర్తింపును కేవలం పరిపాలనా సౌలభ్యం కోసం మసకబార్చడం సమంజసమేనా? అనే ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం దొరకలేదు. రాజకీయంగా కూడా ఈ అంశం సున్నితమే. సికింద్రాబాద్ పరిధి ఓటు బ్యాంక్ సమీకరణల్లో కీలకం. ఇక్కడి మార్పులు పార్టీ సమీకరణాలపై ప్రభావం చూపుతాయి. అందుకే రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు పెరుగుతున్నాయి. కానీ ఈ వాదనల మధ్య అసలు విషయమేమిటంటేప్రజల అభిప్రాయం. తమ ప్రాంతం ఏ నగరంలో ఉండాలన్నది ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉంటుంది. ఆ భావాలను పట్టించుకోకుండా తీసుకునే నిర్ణయాలు ఎప్పుడూ ప్రతిఘటనకే దారి తీస్తాయి. అభివృద్ధి అవసరం అది వాస్తవం. కానీ అభివృద్ధి అంటే గీతలు మార్చడమే కాదు; జీవన నాణ్యతను మెరుగుపరచడం. సికింద్రాబాద్‌ను విడగొట్టి అభివృద్ధి సాధ్యమైతే ఆ లాభనష్టాలను ప్రజల ముందు పెట్టాలి. లేదంటే, ఈ సెగ కేవలం రాజకీయ వేడి మాత్రమే కాదు సికింద్రాబాద్ అస్తిత్వంపై ముద్రపడే దీర్ఘకాలిక ప్రశ్నగా మిగిలిపోతుంది. ఇప్పుడు స్పష్టత అవసరం. ప్రభుత్వం నేరుగా ప్రజలతో మాట్లాడాలి. సికింద్రాబాద్ పేరు, పరిధి, గుర్తింపు చర్చలకు అతీతమైనవి కావు. కానీ నిర్ణయాలకు ముందు ప్రజల మనసు గెలుచుకోవాలి. లేదంటే, ఈ సెగ మరింత ముదిరి నగర చరిత్రలో మరో వివాద అధ్యాయంగా నమోదవుతుంది.

# ఇదేం శపథం జగ్గారెడ్డి? ఓడిస్తే పోటీ చేయటం మానేయాలా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఊళ్లల్లో ఒక ముతక సామెతను తరచూ వాడేస్తుంటారు. చెరువు మీద అలకతో అలా ఉండిపోతే నష్టం చెరువుకు కాదు.. సదరు వ్యక్తికే అన్న విషయాన్ని మర్చిపోకూడదు. ఇప్పుడు కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి సంచలన ప్రకటన చూస్తే.. ఇదే మాట గుర్తుకు రాక మానదు. జగ్గారెడ్డికి ప్రత్యేక గుర్తింపును తెచ్చి పెట్టిన సంగారెడ్డిపై ఆయన అలకబూనారు. ఎన్నికల్లో తనను ఓడించిన సంగారెడ్డి నియోజకవర్గం నుంచి తాను భవిష్యత్తులో పోటీ చేయనని.. చివరకు తన భార్య బరిలోకి దిగినా.. ఆమె తరపున ప్రచారం కూడా చేయనని స్పష్టం చేశారు.సంగారెడ్డి మేధావులు తనను ఓడించారని.. అందుకే తానీ నిర్ణయాన్ని తీసుకున్నట్లుగా జగ్గారెడ్డి చెబుతున్నారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ వచ్చి మరీ తనను గెలిపించేందుకు ప్రచారం చేస్తే.. తనను అక్కడ ఓడించిన వైనాన్ని గుర్తు చేసుకుంటూ.. 'ఇక్కడ నన్ను ఓడించారు. రాహుల్ గాంధీని ఇన్సల్ట్ చేసినట్లు అయ్యింది. జగ్గారెడ్డిని గెలిపించాలని రాహుల్ గాంధీ స్వయంగా వచ్చి ప్రచారం చేసినా.. ఓడించారు. తన జీవితంలో మర్చిపోలేనిది. అందుకే సంగారెడ్డిలో జీవితంలో పోటీ చేయకూడదని డిసైడ్ అయ్యా' అని స్పష్టం చేశారు.

సంగారెడ్డిలో తన ఓటమికి కారణం సాధారణ ప్రజలు కాదని.. సంగారెడ్డి మేధావులుగా ఆయన పేర్కొన్నారు. రేపు నా భార్య నిర్మలా పోటీ చేసినా.. సంగారెడ్డిలో ఆమె తరఫు ఎన్నికల ప్రచారం మాత్రం చేయనని తేల్చి చెప్పారు. రాష్ట్రం మొత్తంలో ఎక్కడికి వెళ్లి ప్రచారమైనా చేస్తాను కానీ సంగారెడ్డిలో మాత్రం ససేమిరా అంటున్న జగ్గారెడ్డి మాటలు ఆసక్తికరంగా మారాయి, పెద్ద పెద్ద నేతలే ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలు కావటం మామూలే. అంతమాత్రాన తమను ఓడించిన ఓటర్లపై ఈ తరహా వ్యాఖ్యలు చేయటం సరికాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఎంపీ అరుణ మాటకు సీఎం రేవంత్ ఆన్సర్.. రాజకీయాలు ఇలా ఉండాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజకీయాల్లో ఘర్షణ చాలా ముఖ్యం. వైరుధ్య భావజాలం ఉన్నోళ్లు ఒకే వేదిక మీద కలిసినప్పుడు వారి మధ్య వచ్చే సంభాషణలు ఆసక్తికరంగా ఉంటాయి. దూషణలకు దూరంగా వ్యవహరిస్తూ.. మాట్లాడే మాటలు చూసినప్పుడు రాజకీయ వైరం ఉన్నప్పటికి ఒకలాంటి స్నేహపూర్వక వాతావరణం కొట్టొచ్చినట్లుగా కనిపించేది. గడిచిన కొద్దికాలంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ తరహా పరిస్థితులు లేకుండా పోయాయి.ఇలాంటి వేళ.. తాజాగా ఒక సన్నివేశం అందరిని ఆకర్షించటమే కాదు.. రాజకీయం అంటే ఇలా ఉండాలి కదా? అన్న భావన కలుగక మానదు. జడ్చర్ల మండలంలో ట్రిపుల్ ఐటీ భవనానికి భూమిపూజ చేసే కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మహబూబ్ నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ హాజరయ్యారు. ఇద్దరు ఒకే వేదికను పంచుకున్నారు. ఈ సందర్భంగా మొదట మాట్లాడిన డీకే అరుణ మాట్లాడుతూ.. "పాలమూరు డెవలప్ మెంట్ లో ముఖ్యమంత్రి బాధ్యత పెద్దది. వాస్తవంగా ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయం.. ఇక్కడ కూర్చున్న వారంతా నన్ను ఓడగొట్టేందుకు గట్టిగా పని చేసిన వాళ్లే' అన్నంతనే అక్కడంతా నవ్వులు విరబూశాయి.

తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. "ఎన్నికలు అయిపోయాయి. పాలమూరు డెవలప్ మెంట్ లక్ష్యంగా పని చేస్తున్నాం. ముఖ్యమంత్రిగా వచ్చిన అవకాశాన్ని నూటికి నూరుపాళ్లు సద్వినియోగం చేసుకోవాలి' అంటూ తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఆమె ప్రసంగం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. డీకే అరుణ వ్యాఖ్యలకు తనదైన శైలిలో బదులిచ్చారు. "అరుణమ్మ చెప్పింది నిజమే. దాపరికం లేదు. నేను నిలబడితే నాలుగు సమావేశాలు పెట్టేవాడిని. వంశీచంద్ ను గెలిపించుకునేందుకు అరుణమ్మను ఓడగొట్టేందుకు పద్నాలుగు సమావేశాలు నిర్వహించా. కానీ.. ప్రజలు ఆశీర్వదించి ఆమెను గెలిపించారు. ఎన్నికల తర్వాత రాజకీయాల్లేవు. కుట్రలు.. కుతంత్రాలు లేవు. దేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ.. మహబూబ్ నగర్ ఎంపీ అరుణమ్మ. రాష్ట్రంలో మేమున్నాం. కేంద్రంలో వారు ఉన్నారు. సమస్యల పరిష్కారం కోసం కలిసిమెలిసి ముందుకెళ్తాం" అంటూ వ్యాఖ్యానించారు ఈ తరహా ఉదంతాలు చూసినప్పుడు ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తికి అహంకారం.. ప్రత్యర్థి పార్టీల పట్ల నిర్లక్ష్యంతో పాటు.. ఎన్నికల్లో తమ ఓటమిని ముఖ్యమంత్రే స్వయంగా ఒప్పుకోవటం లాంటివి అందరినిఆకట్టుకునేవిగా ఉంటాయని చెప్పాలి. రాజకీయ వైరం ఎన్నికల వరకే తప్పించి.. ఎన్నికలు పూర్తైన తర్వాత ప్రజా సంక్షేమం.. డెవలప్ మెంట్ మీద మాత్రమే ఫోకస్ చేయాలన్న తీరు అందరిని ఆకట్టుకునేలా చేస్తుందని చెప్పక తప్పదు.

# ఇదేం తీరు వాసంశెట్టి? ఇప్పుడు మీరు మంత్రిగారు సార్!



**హైదరాబాద్ పెన్ పవర్:** సామాన్యుడికి అసమాన్యుడికి తేడా ఒక అక్షరమే అనుకుంటే తప్పులో కాలేసినట్లే. అలానే సాదాసీదా మనిషికి.. అలాంటి కోట్లాది మందికి రాష్ట్ర మంత్రిగా ప్రాతినిధ్యం వహించే నేతలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. అందులోనూ బహిరంగ ప్రదేశాలకు వచ్చినప్పుడు.. ప్రజల పెద్ద ఎత్తున పాల్గొనే కార్యక్రమాలకు హాజరైనప్పుడు తమ తీరుతోనూ.. నడవడికతోనూ వేలెత్తి చూపించే అవకాశాన్ని ఇవ్వకూడదు.కానీ.. ఏపీ కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ఆయన తీరుపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టీవీ ఆర్టిస్టులు.. నటీమణులతో డ్యాన్సులేంటి? మంత్రిగా వ్యవహరించాల్సిన అప్రమత్తత ఏ మాత్రం కనిపించలేదన్న అపప్రదను మూటగట్టుకున్న పరిస్థితి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వాసంశెట్టి.. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆయన వ్యవహరించిన తీరును పలువురు తప్పు పడుతున్నారు.రామచంద్రాపురం నియోజకవర్గంలోని కాలేజీలో సంక్రాంతి సంబరాల పేరుతో మ్యూజికల్ నైట్ లు.. రికార్డింగ్ డ్యాన్సులు ఏర్పాటు చేశారు. దీనికి పలువురు టీవీ నటీమణులతో పాటు.. టీవీల్లో వివిధ కార్యక్రమాల్లో నటించే వారితో కలిసి మంత్రివర్యులు డ్యాన్సులు వేయటం గమనార్హం. దాదాపు పండుగ సాగిన మూడు రోజులు ఆయన ఇదే తీరును ప్రదర్శించారు.ఇక్కడే మరో ఆసక్తికర అంశాన్ని ప్రస్తావించాలి. మంత్రి వాసంశెట్టి మాత్రమే కాదు.. ఆయన తండ్రి వాసంశెట్టి సత్య సైతం సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో డ్యాన్సులు వేసి అలరించారు. అయితే.. బాధ్యతగా వ్యవహరించాల్సిన మంత్రి.. ఇలా చేయటాన్ని తప్పు పడుతున్నారు. అయితే.. తమ మీద వస్తున్న విమర్శల్ని మంత్రి వాసంశెట్టి లైట్ తీసుకుంటున్నారు. తాను మంత్రిని అయినా.. ఎమ్మెల్యే అయినా తాను తన మాదిరే ఉంటానని.. అంతే తప్పించి తన తీరును మార్చుకునే ప్రసక్తే లేదని కుండ బద్ధలు కొట్టేస్తున్నారు. ప్రజలకు సన్నిహితంగా ఉండేందుకు రికార్డు డ్యాన్సులే వేయలా? అంతుకు మించి వేరే మార్గం లేదా మంత్రివర్యా? అన్న ప్రశ్నలు పలువురు సంధిస్తున్నారు.

# రూ.50 వేల లోపు పోగుట్టుకున్నారా... ఇకపై నో టెన్షన్!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల కాలంలో ఎక్కువగా వినిపిస్తున్న మాట సైబర్ మోసం అనేది తెలిసిన సంగతే. చిన్న పెద్ద అనే తారతమ్యాలేమీ లేకుండా సామాన్యుడి నుండి సెలబ్రెటీ వరకూ ఈ సైబర్ నేరాల బారిన పడుతున్న జనం సంఖ్య రోజు రోజుకీ పెరిగిపోతుంది. ఈ సమయంలో రూ.50 వేల కంటే తక్కువ పోగొట్టుకున్న వారికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి గుడ్ న్యూస్ వినిపించింది. ఇందులో భాగంగా... సరికొత్త స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్ (ఎస్.ఓ.పీ) కు ఆమోదం తెలిపింది.అవును... ఆన్ లైన్ ఆర్థిక మోసాలకు గురై, పోగొట్టుకున్న సొమ్మును తిరిగి రాబట్టుకోవడానికి ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతున్న బాధితులకు కేంద్ర ప్రభుత్వం తాజాగా తీపి కబురు చెప్పింది. ఇందులో భాగంగా... కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సరికొత్త 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్'కు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో సైబర్ నేరగాళ్ల బారిన పడి పోగొట్టుకున్న సొమ్మును బాధితులు ఇప్పుడు మరింత వేగంగా, సులభంగా తిరిగి పొందవచ్చు.సాధారణంగా సైబర్ మోసాలు జరిగినప్పుడు.. బ్యాంకులు సదరు మొత్తాన్ని ఫ్రీజ్ చేస్తాయి. ఈ సమయంలో బాదితుడు ఆ సొమ్మును తిరిగి పొందాలంటే కోర్టు నుండి 'రిస్టోరేషన్ ఆర్డర్' తీసుకురావాల్సి వచ్చేది. అయితే తాజాగా తీసుకొచిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్ ప్రకారం... రూ.50,000 కంటే తక్కువ మొత్తం మోసపోయిన సందర్భాల్లో ఎటువంటి కోర్టు ఆదేశాలు లేకుండానే బ్యాంకులే బాధితులకు రీఫండ్ చేసే అధికారం కల్పించారు.ఈ క్రమంలో... హోల్డ్ లో ఉన్న నిధులపై బ్యాంకులు విధించిన ఆంక్షలను 90 రోజుల్లోగా తొలగించి పరిష్కారం చూపాలి. దీనివల్ల సామాన్య పౌరులపై ఆర్థిక భారం తగ్గడంతో పాటు న్యాయపరమైన జాప్యం తప్పుతుందని చెబుతున్నారు. ఈ సందర్భంగా స్పందించిన ప్రముఖ ఫిన్ టెక్ సంస్థ జియోటస్.కామ్ సీఈఓ విక్రమ్ సుబ్బురాజ్.. ఈ కొత్త ఎస్.ఓ.పీ. ఫైనాన్షియల్ టెక్నాలజీ రంగంలో అనిశ్చితిని తగ్గిస్తుందని తెలిపారు.ఇండియన్ సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ గణాంకాల ప్రకారం.. గత ఆరేళ్లలో భారతీయులు ఆన్ లైన్ మోసాల వల్ల సుమారు రూ.52,976 కోట్లు నష్టపోయారు. అయితే.. ఇప్పటివరకు సుమారు రూ.7,130 కోట్లను మోసగాళ్ల చేతికి చిక్కకుండా కాపాడగలిగారు. ఈ క్రమంలో డిజిటల్ చెల్లింపుల్లో దేశంలోనే ముందు వరుసలో ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు తాజా ఎస్.ఓ.పీ నిర్ణయం వరప్రసాదంగా మారనుందని అంటున్నారు నిపుణులు.ప్రధానంగా... హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాల్లో డిజిటల్ లావాదేవీల సంఖ్య ఎక్కువగా ఉన్నందున.. ఇక్కడ సైబర్ ఫిర్యాదులు కూడా అదే స్థాయిలో ఉన్నాయని చెబుతున్నారు.

# ఏపీ టు హైదరాబాద్ : తిరుగుప్రయాణం నరకం



**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి సెలవులు ముగియడంతో నగరవాసులు తిరిగి హైదరాబాద్ బాట పట్టారు. పల్లెల్లో పండగ జరుపుకుని తిరుగు ప్రయాణమైన జనంతో జాతీయ రహదారులు కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా విజయవాడ–హైదరాబాద్ హైవేపై వాహనాల రద్దీ రికార్డు స్థాయిలో పెరగడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ క్రమంలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు.. పోలీసులు చేపట్టిన చర్యలు ట్రాఫిక్ రద్దీని తగ్గించలేకపోతున్నాయి..కనుమ పండగ ముగియడంతో భాగ్యనగరవాసులు తిరుగు ప్రయాణమయ్యారు. సంక్రాంతి సంబరాల కోసం సొంతూళ్లకు వెళ్లిన లక్షలాది మంది ఒక్కసారిగా హైదరాబాద్ వైపు కదలడంతో జాతీయ రహదారులు వాహన సముద్రాన్ని తలపిస్తున్నాయి. ముఖ్యంగా విజయవాడహైదరాబాద్ జాతీయ రహదారి (చీఎ–65) మరియు అద్దంకినార్కట్‌పల్లి రహదారులపై రద్దీ అదుపు తప్పింది.

**స్తంభించిన రహదారులు.. నత్తనడకన వాహనాలు**

విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలతో గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం రింగ్ రోడ్డు ప్రాంతాలు పూర్తిగా స్తంభించిపోయాయి. కేవలం 5 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి వాహనదారులకు దాదాపు గంటన్నర సమయం పట్టిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పొందుగుల బ్రిడ్జి, దామరచర్ల, మిర్యాలగూడ, చిట్యాల, చౌటుప్పల్ వంటి ప్రధాన కూడళ్ల వద్ద కార్లు, బస్సులు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. పంతంగి, కొర్లపహాడ్ , కీసర టోల్‌ప్లాజాల వద్ద ఫాస్టాగ్ స్కానింగ్‌లో సాంకేతిక ఆలస్యం కావడంతో వాహనాలు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. కీసర టోల్‌ప్లాజా వద్ద ఒక్క రోజే దాదాపు 20 వేల వాహనాలు రాకపోకలు సాగించినట్లు అధికారులు వెల్లడించారు.

**రంగంలోకి పోలీసులు: భారీగా దారి మళ్లింపులు**

ట్రాఫిక్ ఉధృతిని గమనించిన పోలీసులు అప్రమత్తమై పలు చోట్ల వాహనాలను దారి మళ్లించారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు. విజయవాడ నుంచి వచ్చే వాహనాలను కోదాడ వద్దే మళ్లిస్తున్నారు. భారీ వాహనాలను కోదాడ , హుజూర్‌నగర్ , మిర్యాలగూడ మార్గంలో పంపిస్తున్నారు. అద్దంకి నార్కట్‌పల్లి రోడ్డుపై వచ్చే వాహనాలను మిర్యాలగూడ వద్ద మళ్లిస్తున్నారు. మిర్యాలగూడ , హాలియా , మల్లేపల్లి మీదుగా హైదరాబాద్‌కు మళ్లిస్తున్నారు. పరిస్థితిని బట్టి చిట్యాల నుంచి భువనగిరి వైపు మళ్లిస్తున్నారు. డ్రోన్‌లు, సీసీ కెమెరాలతో ట్రాఫిక్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు..

**గంటన్నరలో 5 కిలోమీటర్లు**

గుంటుపల్లి నుంచి ఇబ్రహీంపట్నం రింగ్ కూడలి వరకు కేవలం 5 కిలోమీటర్ల దూరాన్ని దాటేందుకు గంటన్నర సమయం పట్టింది. రింగ్ కూడలిలో హైదరాబాద్ వైపు వెళ్లేవారు, మైలవరంతిరువూరు వైపు మలుపు తిరిగేవారు కలవడంతో రద్దీ ఉధృతమైంది. గొల్లపూడి నుంచి నందిగామ వరకు సరైన సర్వీస్ రోడ్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**కీసర, నందిగామలోనూ అదే పరిస్థితి**

కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా వద్ద ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు సుమారు 20 వేల వాహనాలు రాకపోకలు సాగించినట్లు అధికారులు తెలిపారు. ఎనిమిది కౌంటర్లు తెరిచినా ఫాస్టాగ్ స్కానింగ్ ఆలస్యం వల్ల వాహనాలు బారులు తీరాయి. నందిగామ వై జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్డు మీదుగా వాహనాలు వెళ్లడంతో ఆలస్యం తప్పలేదు. రద్దీ ఎక్కువైన సమయంలో ఫ్లైఓవర్‌పై కార్లకే అనుమతి ఇచ్చారు.

**పోలీసుల కట్టుదిట్టమైన చర్యలు**

సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల మధ్య ట్రాఫిక్ అత్యధికంగా ఉండటంతో కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి వచ్చే భారీ వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఉన్నతాధికారులు నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అవసరమైన చోట స్టాపర్లు, వేగ నియంత్రికలు ఏర్పాటు చేసి వాహనాలు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టారు.

సంక్రాంతి సంబరాల అనంతరం తిరుగు ప్రయాణాల ప్రభావంతో విజయవాడహైదరాబాద్ జాతీయ రహదారిపై రద్దీ తారాస్థాయికి చేరింది. పోలీసుల సమన్వయ చర్యలతో పరిస్థితి క్రమంగా అదుపులోకి వస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# చైనాలో మరో 'కరోనా'.. 100 మంది విద్యార్థులకు నరకం

**హైదరాబాద్ పెన్ పవర్:** చైనాలో మరో వైరస్ కలకలం రేపుతోంది. గంగ్ డాంగ్ ప్రావిన్స్ లోని ఫోషన్ లోఉన్న హై స్కూల్ లోని 100 మంది విద్యార్థులు నోరో వైరస్ కారణంగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు మెడికల్ టీమ్స్ ను పంపారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు స్థానికంగా చికిత్స అందిస్తున్నారు. వెంటనే ఆ పరిసరాలను శుభ్రం చేయాలని స్థానిక అధికారులు ఆదేశించారు. నోరో వైరస్.. గతంలో కూడా భారత్ లోని పూణే, కేరళలో బయటపడినట్టు తెలుస్తోంది. అయితే దీనివల్ల ప్రాణాపాయం తక్కువే అయినప్పటికీ జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే.. కరోనా వైరస్ వ్యాప్తి తర్వాత వైరస్ ల వ్యాప్తి ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. నోరో వైరస్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**నోరో వైరస్ ఎలా సోకుతుంది..**

ఈ వైరస్ ఆహారం, నీరు, లేదా వ్యక్తుల ద్వారా సోకుతుంది. సోకిన తర్వాత వేగంగా వ్యాపిస్తుంది. దీని వల్ల తీవ్రమైన నీరసం, డయేరియా, డీహైడ్రేషన్ కలుగుతుంది. జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి ఉంటుంది. డీహైడ్రేషన్ గురికావడం తీవ్రమైన సమస్య. అది శరీరంలోని నీటి శాతాన్ని తొందరగా తగ్గించేస్తుంది. 1968లో అమెరికాలో నోరో వైరస్ ను మొదటిసారి గుర్తించారు. నోరో వైరస్ లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. కలుషిత ఆహారం తినడం, కలుషిత నీరు తాగడం వల్ల నోరో వైరస్ సోకడానికి ఎక్కువ అవకాశం ఉంది. అదే సమయంలో నోరో వైరస్ సోకిన వ్యక్తికి దగ్గరగా ఉండటం కారణంగా నోరో వైరస్ సోకుతుంది. కాబట్టి ఆహారం, నీరు విషయంలో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పటికే సోకిన వారికి దూరంగా ఉండాలని కోరుతున్నారు. ఎందుకంటే నోరో వైరస్ చాలా వేగంగా సోకుతుంది.

**నోరో వైరస్ అంటే ..**

నోరో వైరస్ కేవలం కడుపుపైన ప్రభావం చూపుతుంది. అందుకే దీనిని స్టమక్ ఫ్లూ అంటున్నారు కానీ ఇది –ఫ్లూ– లాగా ఊపిరితిత్తులు, శ్వాస వ్యవస్థపైన ప్రభావం చూపదని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ సంస్థ చెబుతోంది. ప్రపంచ ఆరోగ్యం సంస్థ లెక్కల ప్రకారం ప్రతి ఏడాది 685 మిలియన్ ప్రజలు దీని బారిన పడతారు. ఇళ్లల్లో ఉన్న డెస్క్ మీద, డోర్ లపైన కూడా నోరో వైరస్ ఉండగలదు. శానిటైజర్ తో పూర్తిగా వైరస్ ను నిర్మూలించలేరు. కానీ జాగ్రత్తలు పాటించడం వల్ల వ్యాప్తిని అరికట్టవచ్చు. అదే సమయంలో లక్షణాలు కనిపించగానే వైద్యున్ని సంప్రదించడం ద్వారా తీవ్రతను తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

**ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి..**

తిన్న తర్వాత, వాష్ రూమ్ వెళ్లి వచ్చిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నోరో వైరస్ సోకిన వ్యక్తికి దూరంగా ఉండటమే కాకుండా వారి ఆహారానికి, వస్తువులకు దూరంగా ఉండాలి. తద్వారా వైరస్ ను అరికట్టవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. వైరస్ వ్యాప్తి గురించి, జాగ్రత్తల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చని ప్రజలు సూచిస్తున్నారు.

# అవన్నీ కట్టు కధలు - భగ్గుమన్న భట్టి



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భగ్గుమన్నారు. తన పేరు పెడుతూ పెద్ద అక్షరాలతో ఒక పత్రిక వార్తా కథనం రాయడం పట్ల ఆయన ఫైర్ అయ్యారు. తాను బాధ్యత గలిగిన వాడిని అన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చింది ఒక లక్ష్యం కోసం అన్నారు. అంతే తప్ప ఆస్తులు కూడబెట్టుకోవడానికో వ్యాపార సామ్రాజ్యాలు విస్తరించుకోవడానికో అధికారాన్ని హోదాగా అనుభవించడానికి రాలేదని అన్నారు. తన లక్ష్యం తెలంగాణా ఆస్తులను వనరులను సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా పంచడం కోసమే రాజకీయాల్లోకి వచ్చాను అన్నారు. దారి దోపిడిదారులు గద్దలా ఆస్తులను వనరులను వ్యవస్థలను పీక్కు తింటూ ఉంటే ఆపన్నుల తరఫున గొంతు ఎత్తడానికే తాను రాజకీయాలను ఎంచుకున్నాను అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

**అంతా పారదర్శకమే :**

తన జీవితం అంతా పారదర్శకమే అని భట్టి విక్రమార్క చెప్పారు. సింగరేణి బొగ్గు గనుల కోసమే అంటూ వార్తలు రాసిన వారు గ్రహించాల్సినది ఒకటి ఉందని అన్నారు. టెండర్లు పిలిచింది సింగరేణి సంస్థ బోర్డు అని ఆయన స్పష్టం చేశారు. ఆ టెండర్లలో ఏ కండిషన్లు ఉండాలో బోర్డు నిర్ణయిస్తుంది కానీ మంత్రి కాదని ఈ మాత్రం జ్ఞానం కూడా లేకుండా తోచింది రాశారు అని ఆయన మండిపడ్డారు. ఫిజికల్ సైట్ విజిట్ పెట్టారు అని రాశారు, సైట్ విజిట్ అనేది పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ సంస్థలలో పెడతారు అని ఆయన చెప్పారు. చాలా క్లిష్టతరమైన ప్రాంతాలుగా అవి ఉంటాయి కాబట్టి అని ఆయన వివరించారు. విజిట్ చేసి పారదర్శకంగా టెండర్లు దాఖలు చేయడానికి ఇది వెసులుబాటు అని మంత్రి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని ప్రభుత్వ రంగ సంస్థలలో అన్నీ ఇలాగే చేస్తాయని చెప్పారు.

**కట్టు కథలు పిట్ట కథలు :**

మేము నిజాయితీగా ఉన్నట్లుగా కూడా జనాలకు కనిపించాలని అన్ని విషయాలూ చెబుతున్నాను అని అన్నారు. సింగరేణి యాజమాన్యం కూడా సీరియస్ గా ఈ ఆరోపణల మీద విచారణ చేయాలని పాత టెండర్ ని రద్దు చేయాలని కూడా మంత్రి ఆదేశించారు. మళ్ళీ టెండర్లు పిలవండి అని ఆయన పేర్కొన్నారు. టెండర్ ఇపుడే పిలిచామని ఎవరూ పార్టిసిపేట్ చేయలేదు అని సింగరేణి అధికారులు చెప్పారు, అయినా సరే రద్దు చేయమనే కోరామని అన్నారు. ఇలాంటి కట్టు కథలు పిట్ట కథలు రాసిన ఆయనకు ఎవరి మీదనో ప్రేమ ఉండొచ్చని అన్నారు.

**వైఎస్సార్ మీద కోపంతో :**

వైఎస్సార్ కి సన్నిహితుడని అని కోపం ఉండొచ్చు అని అందువల్ల ఈ రాతలు రాశారు అని ఆయన సీరియస్ అయ్యారు. అందుకే ముందు టెండర్లు రద్దు చేయమన్నానని మిగతా విషయాలు తాను సదరు పత్రికా యాజమాన్యంతో తేల్చుకుంటాను అని భట్టి పేర్కొన్నారు. ఇది ప్రజల సంబంధించినది అని అన్నారు. ఏ ఉద్దేశ్యంతో ఈ పిట్ట కథలు రాసారు అన్నది తొందరలోనే తాను మీడియాకు వివరిస్తాను అని భట్టి చెప్పారు. తాను మాత్రం మంత్రి పదవిలో ఉన్నంత కాలం ఏ గద్దలను ఏ దోపిడీదారులను తెలంగాణా ఆస్తుల పైన వ్యవస్థ పైన పడనీయను అని హామీ ఇస్తున్నాను అన్నారు.


**మీడియా సంస్థల వైరం కూడా :**

మీడియా సంస్థల మధ్య వైరం ఉంటే వారు తేల్చుకోవాలని భట్టి అన్నారు. ఇందులో మంత్రులను పాలనను ప్రభుత్వాన్ని లాగేందుకు చూస్తే అసలు ఊఒరుకోమని అన్నారు. తాను ఆత్మ గౌరవంతో బతుకుతున్నాను అని ఆయన చెప్పారు. తాను ఎప్పుడూ తన లక్ష్యాలను మార్గాన్ని వీడను అన్నారు. ఏ మీడియాకు వార్తలు వండి రాసే హక్కు లేదని మంత్రి ఆవేశంగా చెప్పారు. మీకు ఆ హక్కు ఎవరు ఇచ్చారు అని ఆయన ప్రశ్నించారు.

**మంత్రులంతా సమిష్టిగానే :**

మంత్రులు అందరూ సమిష్టిగా పనిచేస్తున్నామని భట్టి చెప్పారు. తాము ప్రజల కోసమే ఉన్నామని అన్నారు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం నాది అని భట్టి విక్రమార్క అన్నారు. దిగజారుడు రాజకీయాల కోసం కట్టు కథనాలు సృష్టించడం తప్పు అని ఆయన అన్నారు. తనది అంత వీక్ క్యారెక్టర్ కాదని ఆయన స్పష్టం చేశారు. ఒక ప్రధాన వార్తా సంస్థ తనపైన రాసినవి అన్నీ కట్టు కథలే అని చెప్పారు.

# సంక్రాంతి పండగకు ఎంత మద్యం అమ్మారో తెలుసా?



**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి అంటేనే పాడి పంటల పండుగ, కుటుంబంలోని వారు కలుసుకోవడం వల్ల గ్రామాలు జనసంద్రంగా మారుతాయి. కానీ ఇటీవలి సంవత్సరాల్లో ఈ సంప్రదాయ ఉత్సవానికి మరో కోణం జతకలుస్తోంది. మద్యం అమ్మకాల జోరు. రాష్ట్రంలో సంక్రాంతి పండుగ రోజుల్లో మద్యం విక్రయాలు రికార్డు స్థాయిలో పెరిగిన తీరు చూస్తే, ఇది కేవలం వ్యాపార గణాంకం మాత్రమే కాదు.. ఒక సామాజిక వాస్తవానికి అద్దం పడుతున్న దృశ్యంలా కనిపిస్తోంది.

**వారంలో రెట్టింపు అమ్మకాలు..**

ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు, అంటే పండుగ ముందు–తర్వాత కలిపి ఒక వారంలో మద్యం అమ్మకాలు సాధారణ రోజులతో పోల్చితే దాదాపు రెట్టింపు అయ్యాయి. సాధారణంగా రోజుకు సగటున రూ.4045 కోట్ల మేర ఉండే లిక్కర్ సేల్స్, సంక్రాంతి సీజన్‌లో ఏకంగా రోజుకు రూ.85 కోట్ల దాకా చేరాయి. ఇది ప్రభుత్వ ఖజానాకు భారీ ఆదాయాన్ని తెచ్చిపెట్టినా, అదే సమయంలో సమాజానికి కొన్ని అసౌకర్యకరమైన ప్రశ్నలను కూడా ముందుకు తెస్తోంది. వారం వ్యవధిలో మొత్తం రూ.877 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరగడం ఒక పెద్ద సంఖ్య. ఇందులో ముఖ్యంగా పండుగకు కీలకమైన మూడు రోజుల్లోనే రూ.438 కోట్ల మేర అమ్మకాలు జరిగాయని లెక్కలు చెబుతున్నాయి. అంటే ఒక్కో రోజు సగటున రూ.140 కోట్లకు పైగా మద్యం విక్రయం జరిగినట్లే. పండుగ రోజుల్లో గ్రామాలకు వెళ్లే వారు, బంధువులు–స్నేహితులతో కలసి వేడుకలు జరుపుకునే సమయంలో మద్యం వినియోగం ఎంతగా పెరుగుతుందో ఈ సంఖ్యలు స్పష్టంగా చూపిస్తున్నాయి.

**సర్వత్రా చర్చ..**

ప్రభుత్వ పరంగా చూస్తే ఇది 'విజయవంతమైన వ్యాపారం'. ఎక్సైజ్ ఆదాయం పెరిగింది, లక్ష్యాలు దాటాయి, ఖజానాకు నగదు ప్రవాహం వచ్చింది. కానీ ఈ విజయం వెనుక దాగి ఉన్న సామాజిక ప్రభావాలపై చర్చ చాలా తక్కువగా జరుగుతోంది. పండుగ అనగానే ఆనందం, ఉల్లాసం ఉండాలి. కానీ అదే సమయంలో కుటుంబ కలహాలు, రోడ్డు ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు పెరుగుతుంటే.. ఈ ఆదాయం నిజంగా లాభమా? అన్న ప్రశ్న తలెత్తుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి అంటే కోడి పందాలు, పండుగ విందులు, రాత్రి జాగారాలు. వీటన్నింటితో పాటు మద్యం సహజంగా భాగమైపోయిన పరిస్థితి ఇప్పుడు కనిపిస్తోంది. ఒకప్పుడు పండుగకు ప్రత్యేక వంటకాలు, ఆటలు ప్రధానంగా ఉండేవి. ఇప్పుడు వాటి స్థానంలో మద్యం కేంద్రంగా వేడుకలు సాగుతున్నట్టు అనిపిస్తోంది. ఇది కేవలం వ్యక్తిగత ఎంపికగా చూడలేని స్థాయికి చేరిందని అనేక మంది అభిప్రాయపడుతున్నారు.ఇంకో కోణం ఆర్థిక భారం. పండుగ కోసం అప్పులు చేసి, బట్టలు, బహుమతులు కొనుగోలు చేసే మధ్య తరగతి, పేద కుటుంబాలు.. అదే సమయంలో మద్యంపై వేల రూపాయలు ఖర్చు చేస్తే, ఆ ప్రభావం తర్వాతి నెలలపై పడుతుంది. పండుగ ముగిసిన తర్వాత వచ్చే ఆర్థిక ఒత్తిడి, కుటుంబాల్లో తలెత్తే వివాదాలు దీనికి నిదర్శనం. ఒక వారం రోజుల ఆనందం కోసం నెలలపాటు భారం మోసే పరిస్థితి ఏర్పడుతోంది. అయితే ఈ ట్రెండ్‌ను పూర్తిగా నిషేధాలతో ఆపేయడం సాధ్యమా? బహుశా కాదు. కానీ నియంత్రణ, అవగాహన, ప్రత్యామ్నాయ వినోద మార్గాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. పండుగల సమయంలో మద్యం అమ్మకాలపై కఠిన నియమాలు, రోడ్డు భద్రత చర్యలు, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడితే కొంతైనా సమతుల్యత తీసుకురావచ్చు.సంక్రాంతి పండుగ ఇచ్చే సందేశం 'సమృద్ధి, ఐక్యత, ఆనందం'. కానీ ఈ రోజుల్లో ఆ ఆనందం మద్యం సీసాల్లో కొలవబడుతుంటే, అది ఒక ప్రమాదకర సంకేతం. ప్రభుత్వానికి వచ్చే రూ.877 కోట్ల ఆదాయం ఒక వైపు ఉంటే, సమాజం చెల్లిస్తున్న ధర మరో వైపు ఉంది. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే రాబోయే కాలంలో అసలైన సవాల్‌గా మారుతోంది.

# మాఘమాసం: ఏ శివలింగాన్ని పూజిస్తే.. ఎలాంటి ఫలితం కలుగుతుందో తెలుసా?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు సంవత్సరంలో 11వ నెల.. చంద్రుడు ముఖ నక్షత్రంతో కూడుకున్న నెల కావడంతో దీనిని మాఘమాసం అని పిలుస్తారు. ఉత్తరాయణ పుణ్యకాలంలో వచ్చే ఈ మాసం శ్రీమహావిష్ణువుకి అత్యంత ప్రీతిప్రథమైనది. హిందూ సంప్రదాయం ప్రకారం.. ఈ మాఘమాసంలో నదీ స్నానం చేసి శ్రీమన్నారావణుడిని పూజించి, శక్తి కొలది దానం చేస్తే కోటి యజ్ఞాలు చేసినంత ఫలితం కలుగుతుందట. ముఖ్యంగా ఈ మాఘ మాసంలో ఏ నది నీరైనా సరే గంగా నదితో సమానం కాబట్టి ఈ మాసంలో నదీ స్నానం చేస్తే సర్వ పాపాలు తొలగిపోతాయని పండితులు చెబుతున్నారు.

ఇకపోతే ఈ మాఘ మాసంలో ఎక్కువగా దేవదేవుడైన ఆ మహేశ్వరుడికి పూజలు ఘనంగా జరుగుతాయి . అయితే ప్రత్యేకించి ఈ మాఘమాసంలో మహాశివుడు భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతాడు. అలాంటి ఈ మాఘ మాసంలో ఏ శివలింగాన్ని ఏ విధంగా పూజిస్తే పాపాలు తొలగిపోతాయో.. ? ముఖ్యంగా ఏ శివలింగాన్ని పూజించడం వల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరుతుందో? అనే విషయం ఇప్పుడు చూద్దాం..

శివ మహాపురాణం ప్రకారం శివలింగాలు ఎన్ని రకాలు? వేటిని పూజిస్తే ఎలాంటి ఫలితం లభిస్తుంది? అనే విషయానికి వస్తే.. శివలింగం తయారైన పదార్థాన్ని బట్టి.. దానిని పూజించే వారికి వివిధ విశేష ఫలితాలు కలుగుతాయట.

**1). పార్థివ లింగం:**

ఈ లింగాన్ని పుట్టమన్ను లేదా మట్టితో తయారుచేస్తారు. ఇలా తయారుచేసిన శివలింగాన్ని పూజించడం వల్ల సకల కోరికలు నెరవేరి, మోక్షం లభిస్తుంది.

**2). పాదరస లింగం:**

దీర్ఘకాలిక రోగాలు నయం అవడమేకాకుండా.. మహా పాతకాలు కూడా తొలగిపోతాయి.

**3). స్పటిక లింగం:**

జ్ఞానం వృద్ధి చెందుతుంది. మనశ్శాంతి కలుగుతుంది. గ్రహదోషాలు ఏవైనా ఉంటే నివారించబడతాయి.

**4). స్వర్ణ లింగం:**

బంగారంతో తయారు చేయబడిన ఈ స్వర్ణ లింగాన్ని పూజించడం వల్ల అష్టైశ్వర్యాలు , ధన ప్రాప్తి కలుగుతుంది.

**5). రజత లింగం:**

వెండితో తయారుచేసిన ఈ రజత లింగానే పూజిస్తే.. సంపద వృద్ధి చెందడమే కాకుండా పితృదేవతల అనుగ్రహం కూడా కలుగుతుంది.

**6). కాంస్య లింగం:**

కంచు లోహంతో తయారు చేసే ఈ లింగాన్ని పూజించడం వల్ల సమాజంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.

**7). బెల్లపు లింగం:**

బెల్లంతో తయారు చేయబడిన ఈ లింగాన్ని పూజించడం వల్ల ప్రేమ వివాహాలు సఫలం అవుతాయి. బంధాలు బలపడతాయి.

**8). నవనీత లింగం:**

వెన్నతో తయారు చేయబడిన ఈ లింగాన్ని పూజించడం వల్ల కుటుంబంలో సంతోషం కలిగి , కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.

**9). గంధపు లింగం:**

చందనంతో తయారుచేసిన ఈ లింగాన్ని పూజించడం వల్ల సౌభాగ్యం పొందడంతో పాటు ఆనందం కలుగుతుంది.

**10). భస్మ లింగం:**

విభూదితో చేసే ఈ లింగాన్ని పూజించడం వల్ల అన్ని పనులు చక్కగా నెరవేరడమే కాకుండా గ్రహ పీడ ఏదైనా ఉంటే నివారణ జరుగుతుంది.

**11). అన్న లింగం:**

అన్నంతో తయారుచేసిన ఈ లింగాన్ని పూజించడం వల్ల ఆహార కొరత ఏర్పడదు. పైగా అన్నపూర్ణాదేవి అనుగ్రహం కూడా కలుగుతుంది.

**12). పుష్ప లింగం :**

పువ్వులతో అలంకరించబడిన ఈ పుష్ప లింగాన్ని పూజించడం వల్ల ఆస్తి లాభం మాత్రమే కాకుండా భూ తగాదాలు ఏవైనా ఉంటే పరిష్కారం అవుతాయి.

కాబట్టి పైన చెప్పబడిన లింగం యొక్క ప్రత్యేకతలను బట్టి.. మీకున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని.. ఆయా లింగాలకు పూజలు చేస్తే ఆయా ఫలితాలు కలుగుతాయని పండితులు చెబుతున్నారు.

# కారణ జన్ముడు ఎన్టీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:** నందమూరి తారక రామారావు సినీ రాజకీయ రంగాలు రెండింట్లో విశేషంగా రాణించారు. ఆయన మూడున్నర దశాబ్దాల పాటు సినీ సీమలో రారాజుగా వెలుగొందారు. అనంతరం తనను ఎంతగానో ఆదరించిన ప్రజల కోసం రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ప్రజా సేవ ద్వారా వారి రుణం తీర్చుకోవాలని ఎన్ టీఅర్ భావించారు. ఆయనకు ఆ ఆలోచన కూడా ఒక సినిమా షూటింగ్ జరుగుతున్న సమయంలో వచ్చింది అంటే ఆశ్చర్యం కాదు ఆసక్తికరంగా ఉంటుంది.



**ఆ పాత్ర వేషధారణలో :**

ఇక 1980 ప్రాంతంలో ఎన్టీఆర్ హీరోగా సర్దార్ పాపారాయుడు సినిమా తీస్తున్నారు. దాసరి నారాయణరావు దానికి దర్శకుడు. ఆ మూవీ జరుగుతున్నపుడు అందులో వచ్చే ఒక పాట కోసం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు గెటప్ లో ఎన్టీఆర్ కనిపిస్తారు. ఆ గెటప్ వేసుకున్న ఆయనలో ఎన్నో భావాలు కలిగాయి. అప్పుడు ఆయన షూటింగ్ స్పాట్ లోనే మీడియా వారితో మాట్లాడుతూ ప్రజలకు ఎంతో చేయాల్సి ఉందని అన్నారు. ఆ విధంగా తన రాజకీయ రంగ ప్రవేశం గురించి ఆయన చూచాయగా చెప్పుకొచ్చారు. ఆ తరువాత ఆయన దాని మీదనే దృష్టి పెడుతూ సినిమాలు తగ్గించుకున్నారు. అప్పట్లో తెలుగు సినీ సీమలో నంబర్ వన్ హీరోగా ఎన్టీఆర్ ఉండేవారు. అయితే ఆయన రాజకీయాల్లోకి వెళ్ళాలని నిర్ణయించుకుని చేతిలో ఉన్న సినిమాలను పూర్తి చేస్తూ 1982 నాటికి తెలుగు దేశం పార్టీని స్థాపించారు. ఆ మీదట రాష్ట్రవ్యాప్తంగా ఆయన చైతన్య రథం మీద పర్యటించారు. అలా ఎన్టీఆర్ తొమ్మిది నెలలలోనే అధికారంలోకి వచ్చారు. అది ప్రపంచ రికార్డుగా నేటికీ ఉంది.

**రూపాయి వేతనం :**

ఇక ముఖ్యమంత్రికి కూడా వేతనం ఉంటుంది. కానీ తాను కేవలం రూపాయి మాత్రమే తీసుకుంటాను అని నియమం పెట్టుకుని అన్న గారు పనిచేశారు. ఆయన ముఖ్యమంత్రిగా ఎన్నో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నారు. రెండు రూపాయలకే కిలో బియ్యం పేదలకు ఇవ్వడమే కాదు జనతా వస్త్రాలు అందించారు. అలాగే పక్కా ఇళ్ళను నిర్మించడం ద్వారా కూడు గుడ్డ గూడు అన్న మూడు ప్రాథమిక అవసరాలను తీర్చి సామాన్యుడికి భరోసాగా నిలిచారు. కరణం మునసబు వ్యవస్థను తీసేసి గ్రామ స్వరాజ్యం అందించారు. అలాగే సమితులను మండలాలుగా మార్చి పాలనాపరంగా సంస్కరణలను తెచ్చారు.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో కీలక నిర్ణయాలు ఆయన తీసుకున్నారు.

**రాజకీయ సంస్కరణలు :**

ఇక చదువుకున్న వారికి చట్ట సభలలో అవకాశం కల్పించడం బడుగు బలహీన వర్గాలకు ఎమ్మెల్యే ఎంపీ వంటి కీలక పదవులు ఇవ్వడం, అతి చిన్న వయసులోనే మంత్రి పదవులు ఇవ్వడం ద్వారా బడుగు అణగారిన వర్గాలలో సాధికారికత కల్పించడం ద్వారా ఎన్ టీఆర్ రాజకీయ సంస్కరణలకు ఎంతో కృషి చేశారు అని చెప్పాలి. అదే విధంగా పైసా కూడా పార్టీ ఫండ్ వసూలు చేయకుండా టికెట్లు ఇచ్చిన ఘనత ఎన్టీఆర్ కే దక్కింది. దాంతో ఎంతో పేదవారు, రాజకీయం గురించి కూడా అవగాహన లేని వారు మంత్రులు ఎంపీలు ఎమ్మెల్యేలు అయిపోయారు.

**మహిళలకు ప్రాధాన్యత :**

మహిళల కోసం ఎన్టీఆర్ తన హయాంలో ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆస్తి హక్కులో ఆడబిడ్డకు సగం వాటా అన్నది ఆయన మదిలో పుట్టిన ఆలోచనగానే ఉంది. దానినే చట్టబద్ధం చేశారు. తిరుపతిలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం స్థాపన ఆయన మరో ఆలోచన. అలాగే హెల్త్ యూనివర్శిటీని ఆయన విజయవాడలో నెలకొల్పారు.

**ఆయన సరిసాటి లేరు :**

ఒక్కరే ఎన్టీఆర్ అని చెప్పాలి. ఆయన సరిసాటి ఎవరూ లేరని కూడా ఒప్పుకుని తీరాలి. సినీ రాజకీయ రంగాలలో ఆయన సాధించిన రికార్డులు అసమానం. సినీ రంగంలో ఆయన వేసినన్ని పౌరాణిక పాత్రలు ఆయన చేసినన్ని ప్రయోగాలు ఎవరూ చేయలేదు, అలా అక్కడ తన కీర్తిని శాశ్వతం చేసిన ఎన్టీఆర్ రాజకీయ రంగంలో సైతం తొమ్మిది నెలలలోనే అధికారంలోకి రావడం తాను పాలించిన సమయంలో ఎన్నో వినూత్న ఆలోచనలతో నిర్ణయాలు తీసుకోవడం సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అన్న నినాదాన్ని నిజం చేసి చూపించడం ఇవన్నీ మరొకరికి సాధ్యపడవు, ఎవరూ చేయలేరని చెప్పాలి.

**తెలుగు జాతిని కన్నీట ముంచేసింది :**

ఎన్టీఆర్ కారణ జన్ముడిగా చెప్పాలి. ఆయన వంటి వారు యుగానికి ఒక్కరే పుడతారు అని అంటారు. మళ్లీ అలాంటి వారు రావాలీ అంటే యుగాల వరకూ ఎదురు చూడాలేమో. ఎన్టీఆర్ 1996 జనవరి 18న మరణించారు. ఆయన మరణం వార్త తెలుగు జాతిని కన్నీట ముంచేసింది. దేశమంతా కదిలిపోయింది. ఒక చరిత్ర సృష్టించడానికి ఈ భూమి మీదకు వచ్చి తన పని పూర్తి చేసి తిరిగి దివికి ఏగిన మహానుభావుడు మహా పురుషుడు ఎన్ టీఆర్. తెలుగు జాతి ఉన్నంతవరకూ ఆ మూడు అక్షరాలు శిలాక్షరాలే అని చెప్పక తప్పదు.

# త్రిశంకు వలయంలో చిక్కుకుపోయిన దానం నాగేందర్ పాలిటిక్స్.. !



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత వేటు వ్యవహారం ఇప్పుడు అత్యంత ఉత్కంఠభరితమైన దశకు చేరుకుంది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇప్పటికే పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేల్లో ఏడుగురి విషయంలో నిర్ణయం ప్రకటించగా, మిగిలిన ముగ్గురి భవితవ్యంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సుప్రీంకోర్టు విధించిన రెండు వారాల గడువు ముగియనుండటంతో స్పీకర్ కార్యాలయం ఈ ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ ముగ్గురిలో కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు వంటి నేతలు తాము పార్టీ మారలేదని, సాంకేతిక అంశాలను సాకుగా చూపి తప్పించుకునే అవకాశం ఉంది. అయితే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పరిస్థితి మాత్రం వీరందరికంటే భిన్నం.

దానం నాగేందర్ విషయంలో కాంగ్రెస్ పార్టీకి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. దానం కేవలం బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి రావడమే కాదు.. ఏకంగా కాంగ్రెస్ పార్టీ గుర్తుపై సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీ చేశారు. ఒక పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ మరో పార్టీ తరపున ఎన్నికల బరిలో నిలవడం అనర్హత వేటుకు తిరుగులేని ఆధారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో దానం ముందు రెండు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయి. ఒకటి స్పీకర్ తీర్పు వెలువడక ముందే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఖైరతాబాద్ ఉప ఎన్నికకు సిద్ధమవ్వడం. ఇప్పటికే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన ఉత్సాహంలో ఉన్న కాంగ్రెస్, ఇక్కడ కూడా గెలుస్తామనే ధీమాతో ఉంది. రెండో మార్గం ఏదైనా చట్టపరమైన లూప్‌హోల్‌ను వెతకడం. కానీ సుప్రీంకోర్టు ఇప్పటికే కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేయడంతో నాన్చివేత ధోరణి సాగే అవకాశం లేదు.ప్రస్తుతం దానం నాగేందర్ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకుండా సమయం కోరటం గమనిస్తే, ఈ వ్యవహారాన్ని వీలైనంత వరకు సాగదీయాలనే వ్యూహం కనిపిస్తోంది. ఒకవేళ స్పీకర్ గనుక దానం విషయంలో కూడా ఆయన పార్టీ మారలేదని తీర్పు ఇస్తే, అది న్యాయస్థానాల్లో నిలబడటం దాదాపు అసాధ్యం. బహిరంగంగా వేరే పార్టీ గుర్తుపై పోటీ చేసిన వ్యక్తికి క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సమంజసం కాదన్న అభిప్రాయాలున్నాయి. ఇది స్పీకర్ పదవికి ఉండే నైతికతను కూడా ప్రశ్నార్థకం చేసే ప్రమాదం ఉంది. ఇంటర్నెట్‌లో అందుతున్న సమాచారం ప్రకారం, గవర్నర్ కార్యాలయం కూడా ఈ విషయంలో వస్తున్న ఫిర్యాదులను నిశితంగా గమనిస్తోంది. న్యాయపరంగా గట్టి ఆధారాలు ఉండటంతో దానం నాగేందర్ పై వేటు పడటం ఖాయమని ప్రతిపక్షాలు గట్టిగా వాదిస్తున్నాయి.

ముగింపుగా చూస్తే ఈ మొత్తం వ్యవహారంలో బీఆర్ఎస్ చేస్తున్న న్యాయపోరాటం అత్యంత కీలకంగా మారింది. స్పీకర్ ఏ రకమైన నిర్ణయం తీసుకున్నా దానిని సవాలు చేసేందుకు బీఆర్ఎస్ లీగల్ టీమ్ ఇప్పటికే సర్వ సిద్ధంగా ఉంది. గతంలో మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో జరిగిన ఫిరాయింపుల కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను బట్టి చూస్తే, స్పీకర్ నిర్ణయంపై జ్యుడీషియల్ రివ్యూ చేసే అధికారం కోర్టులకు ఉంది. ఒకవేళ అసెంబ్లీ స్పీకర్ నుంచి సానుకూల తీర్పు రాకపోయినా, ఉన్నత న్యాయస్థానాల్లో ఈ ఎమ్మెల్యేలకు చుక్కెదురు అయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. దానం నాగేందర్ పై అనర్హత వేటు పడితే అది రాష్ట్ర రాజకీయాల్లో ఒక సంచలనంగా మారడమే కాకుండా, రాబోయే రోజుల్లో మరిన్ని ఉప ఎన్నికలకు దారితీసే అవకాశం ఉంది.

# వసంత పంచమి: విద్యాభ్యాసం చేయిస్తున్నారా.. జర ఆలోచించండి!

**హైదరాబాద్ పెన్ పవర్:** హిందూ పంచాంగం ప్రకారం.. మాఘమాసం శుక్లపక్షం పంచమి తిథి రోజు జరుపుకునే పవిత్రమైన రోజునే వసంత పంచమి అని అంటారు. అయితే ఈ సంవత్సరం జనవరి 23వ తేదీన వసంత పంచమి పండుగను జరుపుకుంటారు. ఈరోజు నుంచే వసంత రుతువు ప్రారంభం అవుతుందని, సరస్వతి దేవి అవతరించారని ప్రజలు విశ్వసిస్తారు. ముఖ్యంగా సరస్వతీ దేవి అవతరించిన రోజు కావడంతో విద్యార్థులు, కళాకారులు , సాహిత్యం, సంగీతం, జ్ఞానంతో ముడిపడి ఉన్న వ్యక్తులకు ఇది చాలా పవిత్రమైన రోజుగా పరిగణిస్తారు.

ఇకపోతే వసంత పంచమి వచ్చిందంటే చాలు ఆ రోజున తమ పిల్లల చేత విద్యాభ్యాసం చేయించడానికి ప్రతి తల్లిదండ్రులు ప్రయత్నం చేస్తూ ఉంటారు. అయితే ఈసారి వసంత పంచమి రోజు మీరు మీ పిల్లలకు విద్యాభ్యాసం చేయించాలి అంటే కొంచెం ఆలోచించండి అని చెబుతున్నారు పంచాంగ నిపుణులు. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం..

హిందూ పంచాంగం ప్రకారం.. 2026 ప్రారంభంలోనే శుక్ర మౌఢ్యమి ఉంది. ఇది ఫిబ్రవరి 17 2026 వరకు కొనసాగుతుంది. సాధారణంగా మౌఢ్యమి ఉన్నప్పుడు అక్షరాభ్యాసం వంటి శుభకార్యాలు చేయరు. కానీ వసంత పంచమి (జనవరి 23) వంటి విశేష పర్వదినాలలో మాత్రం కొంతమంది ముహూర్తం లేకుండానే తమ పిల్లల చేత అక్షరాభ్యాసం చేయిస్తూ ఉంటారు. ముఖ్యంగా మౌఢ్యమి సమయంలో వసంత పంచమి వచ్చింది కాబట్టి సాంప్రదాయాన్ని బట్టి పండితులను సంప్రదించడం మంచిది అని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ మీరు కూడా మీ పిల్లల చేత ఈ వసంత పంచమి రోజున విద్యాభ్యాసం చేయించాలని అనుకుంటున్నట్లయితే ఒకసారి పండితులను సంప్రదించి, ఆ తర్వాత విద్యాభ్యాసం చేయిస్తే మంచిది.



ఒకవేళ మీరు ఈ వసంత పంచమి రోజున మీ పిల్లల చేత విద్యాభ్యాసం చేయించలేకపోతే మాఘశుద్ధ విదియ అనగా ఫిబ్రవరి 20 శుక్రవారం రోజున మౌఢ్యమి తర్వాత వచ్చే మొదటి శ్రేష్టమైన రోజు. కాబట్టి ఈరోజున మీరు మీ పిల్లలు చేత విద్యాభ్యాసం చేయించవచ్చు. ఇక అలాగే మరో ముఖ్యమైన రోజుల విషయానికి వస్తే.. గురుపౌర్ణమి జూలై 29 బుధవారం అలాగే విజయదశమి అక్టోబర్ 20 మంగళవారం పిల్లల విద్యాభ్యాసానికి శ్రేష్టమైన రోజులుగా పండితులు చెబుతున్నారు.

ఇకపోతే ఈ విద్యాభ్యాసం చేసేటప్పుడు పిల్లల వయసు ముఖ్యంగా రెండున్నర నుండి ఐదు సంవత్సరాల మధ్య ఉండి తీరాలి. అశ్విని, పునర్వసు, హస్త, చిత్త, పుష్యమి, స్వాతి, శ్రవణం, రేవతి వంటి నక్షత్రాలను బట్టి సోమ, బుధ, గురు, శుక్రవారాలలో అలాగే మీ పిల్లలు పుట్టిన నక్షత్రాన్ని బట్టి ఖచ్చితమైన లగ్నం నిర్ణయించుకొని ఆ తర్వాత విద్యాభ్యాసం చేయిస్తే వారు తమ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుతారని పండితులు కూడా సూచిస్తున్నారు.ఇక ఈ వసంత పంచమి రోజు సరస్వతి దేవిని పూజించడానికి ఉదయం 06:43 నుంచి మధ్యాహ్నం 12:15 వరకు చాలా ఉత్తమమైన సమయం. ఇక వసంత పంచమి పంచాంగం ప్రకారం మాఘమాసం శుక్లపక్షం పంచమి తిథి జనవరి 22 గురువారం అర్ధరాత్రి 01:44 గంటలకు ప్రారంభమై జనవరి 23 శుక్రవారం అర్ధరాత్రి 12:37 గంటలకు ముగుస్తుంది. సూర్యోదయ తిథి ప్రకారం జనవరి 23 శుక్రవారం వసంత పంచమి జరుపుకుంటారు. ఈ వసంత పంచమి యొక్క ప్రాముఖ్యత విషయానికి వస్తే.. ప్రపంచం ప్రారంభ దశలో నిస్తేజంగా, మౌనంగా ,నిశ్శబ్దంగా ఉందని నమ్ముతారు. బ్రహ్మదేవుడు సృష్టితో సంతృప్తి చెందలేదట. అప్పుడు తన కమండలం నుంచి నీటిని చల్లగా దీని నుంచి సరస్వతి దేవి ఆవిర్భవించింది. అమ్మ వీణతో మధురమైన స్వరం పలికారు. దీని వల్లే ప్రపంచానికి స్వరం, ధ్వని లభించాయి. అప్పటినుంచి వసంత పంచమి రోజునే సరస్వతి దేవిని పూజించే ఆచారం మొదలైంది అని ప్రముఖ పండితులు చెప్పుకొస్తున్నారు.

## 20 లక్షల మంది విద్యార్థులకు ల్యాప్ టాప్ లు..



**హైదరాబాద్ పెన్ పవర్:** డిజిటల్ యుగంలో విద్య అనేది పుస్తకాలకే పరిమితం కాదు. ఒకప్పుడు బ్లాక్ బోర్డు, చాక్‌తో మొదలైన విద్యా ప్రయాణం.. ఇప్పుడు ల్యాప్‌టాప్‌లు, ఏఐ ప్లాట్‌ఫామ్‌లు, ఆన్‌లైన్ స్కిల్స్ దాకా వచ్చి చేరింది. మారుతున్న కాలాన్ని ముందుగానే అర్థం చేసుకొని, విద్యార్థుల చేతుల్లోకి భవిష్యత్తును అప్పగించే ప్రయత్నమే తమిళనాడు ప్రభుత్వం ప్రారంభించిన 'ఉలగం ఉంగల్ కైయిల్ (ప్రపంచం మీ చేతుల్లో ఉంది)' పథకం. పేరు వినగానే ఇది కేవలం ఒక సంక్షేమ పథకం కాదని, ఒక ఆలోచన అని అర్థమవుతుంది. ప్రపంచంతో పోటీ పడే సామర్థ్యం విద్యార్థుల్లో పెరగాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

**తొలివిడుతలో 20 లక్షల మందికి**

తాజాగా ఈ పథకం కింద తొలి విడతగా ఏకంగా 20 లక్షల మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ చేపట్టడం దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. ఇది కేవలం సంఖ్యల పరంగా పెద్ద విషయం కాదు.. దాని వెనుక ఉన్న విజన్ మరింత కీలకం. ఎం.కే. స్టాలిన్ స్పష్టంగా చెప్పిన మాట ఒక్కటే 'ఇది ఉచిత బహుమతి కాదు, నైపుణ్యాభివృద్ధికి పెట్టుబడి' విద్యార్థులు డిగ్రీలు సంపాదించడమే కాకుండా, ఉద్యోగాలకు అవసరమైన స్కిల్స్‌ను కూడా సొంతం చేసుకోవాలన్నదే ఈ పథకపు ప్రధాన ఉద్దేశం. ఈ ల్యాప్‌టాప్‌ల పంపిణీ కూడా సాధారణంగా జరగలేదు. డెల్, లెనోవో, ఏసర్, హెచ్‌పీ వంటి ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ల ల్యాప్‌టాప్‌లను ఎంపిక చేశారు. అంటే 'ఉచితం కాబట్టి ఏదో ఒకటి' అన్న ధోరణి కాదు. విద్యార్థులు రోజువారీ ఉపయోగం, ప్రోగ్రామింగ్, డిజిటల్ డిజైన్, డేటా అనాలిసిస్ వంటి పనులు చేయగలిగే స్థాయి హార్డ్‌వేర్‌ను అందిస్తున్నారు. ఇది ప్రభుత్వ విధానాల్లో అరుదుగా కనిపించే క్వాలిటీ ఫోకస్‌కి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

**ఉచిత ఏఐ కూడా..**


ఇంకా ముఖ్యమైన అంశం.. ఈ ల్యాప్‌టాప్‌లతో పాటు ఆరు నెలల పాటు ఏఐ ఆధారిత లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఉచితంగా అందించడం. ఇది ఈ పథకాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అంశం. ఎందుకంటే ప్రపంచం ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చుట్టూనే తిరుగుతోంది. రేపటి ఉద్యోగాలు, వ్యాపారాలు, పరిశోధనలు అన్నీ ఏఐ స్కిల్స్‌తోనే ముడిపడి ఉన్నాయి. అలాంటి సమయంలో గ్రామీణ, పట్టణ విద్యార్థుల మధ్య ఉన్న డిజిటల్ గ్యాప్‌ను తగ్గించడానికి ఇది కీలక అడుగు. తమిళనాడు ఇప్పటికే విద్య, సామాజిక న్యాయం, మానవ వనరుల అభివృద్ధి విషయంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ఈ ల్యాప్‌టాప్ పథకం కూడా అదే కొనసాగింపుగా కనిపిస్తోంది. ముఖ్యంగా మొదటి తరం విద్యార్థులు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లల జీవితాన్ని మలుపుతిప్పే అవకాశం.

**ల్యాపులతో విద్యార్థులకు మరింత విద్య..**

ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఉంది. చాలా సార్లు సంక్షేమ పథకాలు ఎన్నికల కోణంతోనే చూస్తారు. కానీ ఈ పథకం ఫలితం ఐదేళ్లలో కనిపించదు. 10, 15 ఏళ్ల తర్వాతే అసలైన ప్రభావం కనిపిస్తుంది. అప్పటికి ఈ రోజు ల్యాప్‌టాప్ తీసుకున్న విద్యార్థుల్లో కొందరు స్టార్టప్ వ్యవస్థాపకులుగా, కొందరు ఏఐ ఇంజినీర్లుగా, మరికొందరు గ్లోబల్ కంపెనీల్లో కీలక పాత్రల్లో కనిపించే అవకాశం ఉంది. అంటే ఇది ఓట్ల కోసం కాదు, తరాల కోసం చేసిన పెట్టుబడి. అయితే ఇలాంటి పథకాల విజయానికి మరో కీలక అంశం అమలు. ల్యాప్‌టాప్‌లు ఇచ్చినంత మాత్రాన సరిపోదు. వాటిని ఎలా ఉపయోగించాలో మార్గనిర్దేశం, కంటెంట్ నాణ్యత, ఇంటర్నెట్ యాక్సెస్ వంటి అంశాలు కూడా సమాంతరంగా బలోపేతం కావాలి. ప్రభుత్వం ఈ దిశగా కూడా అడుగులు వేస్తే, "ఉలగం ఉంగల్ కైయిల్" అనే నినాదం నిజంగానే అక్షరాలా నిజమవుతుంది.

ఈ పథకం స్పష్టమైన సందేశం ఇస్తోంది భవిష్యత్తు పేదరికాన్ని తుంచాలంటే సబ్సిడీలు కాదు స్కిల్స్ అవసరం. ప్రపంచం మీ చేతుల్లో ఉండాలంటే, ఆ చేతుల్లో సరైన సాధనాలు ఉండాలి. తమిళనాడు చేసిన ఈ ప్రయోగం.. మిగతా రాష్ట్రాలకు కూడా ఒక మోడల్‌గా మారుతుందా? అన్నదే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తిగా మారింది.

# తిరుమల శ్రీవారి పేరుతో 'లక్కీడ్రా' మోసం.. రంగంలోకి కరాటే కల్యాణి!



**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుమల వేంకటేశ్వర స్వామి పవిత్ర నామాన్ని అడ్డం పెట్టుకుని సామాన్య ప్రజలను బురిడీ కొట్టిస్తున్న ఒక భారీ లక్కీ డ్రా మోసం వెలుగులోకి వచ్చింది. కేవలం రూ. 399 చెల్లిస్తే చాలు.. ఫార్చ్యూనర్ కారు, ఐఫోన్, ఖరీదైన బైక్‌లు గెలుచుకోవచ్చంటూ సోషల్ మీడియాలో సాగుతున్న ప్రచారాన్ని అడ్డుకోవడానికి నటి కరాటే కల్యాణి పోలీసులను ఆశ్రయించారు.

**అసలేం జరిగింది?**

ప్రవీణ్ కాస, సిద్ధమోని మహేందర్ అనే ఇద్దరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు తిరుమల ఆలయ ప్రాంగణాన్ని వేదికగా చేసుకుని కొన్ని వీడియోలు చిత్రీకరించారు. భక్తుల మనోభావాలతో ఆడుకుంటూ శ్రీవారి పేరును వాడుకుని ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారని కరాటే కల్యాణి ఆరోపించారు.

**మోసం సాగుతున్న తీరు**

తక్కువ పెట్టుబడితో భారీ ఆశ చూపించి కేవలం రూ. 399కే లక్కీ డ్రా కూపన్ అని ప్రచారం చేశారు. ఫార్చ్యూనర్ కార్లు, ఐఫోన్లు, టీవీలు వస్తాయని ఆశ చూపారు. అత్యంత పవిత్రమైన తిరుమల కొండపై ఈ మోసపూరిత ప్రచార వీడియోలు చిత్రీకరించారు.

**పోలీసుల యాక్షన్**

కరాటే కల్యాణి ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీసులు రంగంలోకి దిగారు. ఈ వ్యవహారంపై లోతైన దర్యాప్తు చేపట్టిన పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. నిందితులు ప్రవీణ్ కాస, సిద్ధమోని మహేందర్‌లపై కేసు ఫైల్ చేశారు. ఐటీ చట్టం 2008లోని సెక్షన్ 318(4) , సెక్షన్ 66 కింద కేసులు నమోదయ్యాయి. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారు? వసూలు చేసిన కోట్లాది రూపాయలు ఎక్కడికి వెళ్లాయి? అనే కోణంలో విచారణ సాగుతోంది. "భక్తుల సెంటిమెంట్లను వాడుకుని ఇలాంటి మోసాలకు పాల్పడటం క్షమించరాని నేరం. టీటీడీ పరిధిలో ఇలాంటి ప్రచారాలు జరగడం ఆందోళనకరం అని కరాటే కల్యాణి అన్నారు.

**ప్రజలకు హెచ్చరిక**

సోషల్ మీడియాలో వచ్చే ప్రతి ఆఫర్‌ను నమ్మవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా తక్కువ ధరకే విలాసవంతమైన వస్తువులు వస్తాయని చెప్పే లక్కీ డ్రాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# రూ.35 వేల కోట్ల పెట్టుబడితో గుజరాత్‌లో మారుతి కొత్త ప్లాంట్.. ఇక 10 లక్షల వాహనాలను ఉత్పత్తి ..




**హైదరాబాద్ పెన్ పవర్:** గుజరాత్‌లో ఏర్పాటు చేయబోయే కొత్త తయారీ ప్లాంట్ కోసం రూ.35 వేల కోట్లను మారుతి సుజకీ ఇన్వెస్ట్ చేయనుంది. ఈ ప్లాంట్ ద్వారా సంవత్సరానికి 10 లక్షల వాహనాలను ఉత్పత్తి చేయనుంది. ఈ కొత్త ప్లాంట్‌లో ప్రొడక్షన్ 202829 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమవుతుందని అంచనా. ప్రస్తుతం మారుతి సుజుకీ ఏడాదికి 24 లక్షల వాహనాలను తయారు చేస్తోంది. కంపెనీ కిందటేడాది డిసెంబర్‌లో దేశీయ డీలర్లకు 1,78,646 యూనిట్లను అమ్మింది. ఇది ఏడాది లెక్కన 37శాతం ఎక్కువ. ఎంట్రీ-లెవల్ మోడళ్లకు సుమారు 45 రోజుల ఆర్డర్ బ్యాక్‌లాగ్ ఉందని కంపెనీ తెలిపింది. ప్లాంట్ కోసం భూమి కొనుగోలుకు బోర్డు రూ.4,960 కోట్ల ప్రారంభ పెట్టుబడిని ఆమోదించింది. కొత్త ప్లాంటుతో భారతదేశంలో పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడమే కాకుండా, ఎగుమతులనూ పెంచుతారు.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం రూ.18, 654 కోట్లు.. వడ్డీ ఆదాయం రూ.32,620 కోట్లు




**హైదరాబాద్ పెన్ పవర్:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు కిందటేడాది డిసెంబర్‌తో ముగిసిన క్వార్టర్ (క్యూ3) లో రూ.18,654 కోట్ల నికర లాభం వచ్చింది. ఇది అంతకుముందు సంవత్సరంలోని ఇదే కాలంలో వచ్చిన రూ.16,736 కోట్లతో పోలిస్తే 11.5శాతం ఎక్కువ. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.19,807 కోట్ల నికర లాభాన్ని సాధించింది. ఆదాయం, డిపాజిట్లు పెరగడం, ఆస్తుల నాణ్యత స్థిరంగా ఉండటంతో బ్యాంక్ ప్రాఫిట్ దూసుకుపోయింది. అయితే వడ్డీ మార్జిన్లు కొంత ఒత్తిడిలో ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కి క్యూ3లో రూ.32,620 కోట్ల వడ్డీ ఆదాయం వచ్చింది. 2024 డిసెంబర్ క్వార్టర్‌లో వచ్చిన రూ.30,650 కోట్ల ఆదాయంతో పోలిస్తే 6.4శాతం పెరిగింది. వడ్డీ మార్జిన్ 3.51శాతంగా ఉంది. బ్యాంక్ అసెట్ క్వాలిటీ క్యూ3లో నిలకడగా ఉంది. గ్రాస్ ఎన్‌పీఏల విలువ రూ.36,019 కోట్ల నుంచి రూ.35,179 కోట్లకు తగ్గింది. గ్రాస్ ఎన్‌పీఏల రేషియో 1.42 శాతం నుంచి1.24 శాతానికి మెరుగుపడింది. నెట్ ఎన్‌పీఏల విలువ రూ.11,982 కోట్లుగా, నెట్ ఎన్‌పీఏల రేషియో 0.42శాతం ఉంది. బ్యాంక్ ఖర్చులు క్యూ3లో రూ.18,770 కోట్లకు చేరాయి. కొత్త లేబర్ కోడ్స్ ప్రభావం వలన రూ.800 కోట్లు అదనంగా ఖర్చు అయ్యాయి. ఈసారి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డిపాజిట్లు ఏడాది లెక్కన 11.6 శాతం పెరిగి రూ.28.6 లక్షల కోట్లకు ఎగిశాయి. బ్యాంక్ ఇచ్చిన అప్పుల విలువ 11.9 శాతం వృద్ధి చెంది రూ.28.45 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

# రిలయన్స్ చేతికి బ్రైల్‌క్రీమ్, టోనీ అండ్ గయ్ బ్రాండ్లు.. 60శాతం పెరిగిన ఆదాయం..




**హైదరాబాద్ పెన్ పవర్:** రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి చెందిన ఎఫ్ఎంసీజీ విభాగం రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ (ఆర్‌సీపీఎల్), ఇంటర్నేషనల్ పర్సనల్ కేర్ బ్రాండ్లయిన బ్రైల్‌క్రీమ్, టోనీ అండ్ గయ్, బాడెడాస్‌ల గ్లోబల్ హక్కులను దక్కించుకుంది. దీంతో పాటు యూకేకి చెందిన పిల్లల పర్సనల్ కేర్ బ్రాండ్ మేటీని కూడా కొనుగోలు చేసింది. ఆర్‌సీపీఎల్ ఈ బ్రాండ్ల ప్రొడక్ట్‌లను భారత్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో అమ్మనుంది. కాగా, బ్రైల్‌క్రీమ్, టోనీ అండ్ గయ్ ప్రీమియం హెయిర్ కేర్ బ్రాండ్లు. ఆర్‌సీపీఎల్ ఇప్పటికే తమిళనాడుకు చెందిన వెల్వెట్ బ్రాండ్‌ను కొనుగోలు చేసి, మార్కెట్‌లోకి తెచ్చింది. అలాగే గ్లిమ్మర్, గెట్ రియల్ వంటి స్వంత బ్రాండ్లతో తక్కువ ధరలో స్నానపు ఉత్పత్తులను అందిస్తోంది. డిసెంబర్ క్వార్టర్‌లో ఈ కంపెనీ ఆదాయం ఏడాది లెక్కన 60శాతం పెరిగి రూ.5,065 కోట్లకు చేరగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.15వేల కోట్లను దాటింది. కంపెనీ ఇటీవల ఉదయమ్స్ అగ్రో ఫుడ్స్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఈ కంపెనీకి కనీసం రూ.వెయ్యి కోట్లకు పైగా ఆదాయం తెచ్చే నాలుగు బ్రాండ్లు ఉన్నాయి. అవి కాంపా, ఇండిపెండెన్స్, గుడ్ లైఫ్, కాంపా ఎనర్జీ. ఆర్‌సీపీఎల్ రూ.40వేల కోట్లతో ఫుడ్ పార్కులు కూడా ఏర్పాటు చేస్తోంది.

# టాప్5 ఐటీ కంపెనీలు ఇచ్చిన జాబ్స్ 17 ! భారీగా పడిపోయాయి నియామకాలు..

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొదటి తొమ్మిది నెలల్లో దేశంలోని టాప్ ఐదు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా నికరంగా 17 మందికే ఉద్యోగాలు ఇచ్చాయి. గత సంవత్సరం ఇదే కాలంలో ఇచ్చిన 17,764 మందితో పోలిస్తే నియామకాలు భారీగా పడిపోయాయి. ఏఐ వాడకం పెరగడమే ఇందుకు కారణం. టీసీఎస్ గత తొమ్మిది నెలల్లో 25,816 మందిని తీసేసింది. ఇదే టైమ్‌లో ఇన్ఫోసిస్ 13,456 మందిని, విప్రో 9,740 మందిని, హెచ్‌సీఎల్ టెక్ 1,885 మందిని, టెక్ మహీంద్రా 752 మందిని నియమించుకున్నాయి. టీసీఎస్ ఎక్కువ మందిని తొలగించడంతో నెట్‌గా ఈ ఐదు కంపెనీలు నియమించిన ఉద్యోగుల సంఖ్య భారీగా పడిపోయింది. ఈ కంపెనీలు డిసెంబర్ క్వార్టర్‌లో నికరంగా 2,174 మందిని తొలగించాయి. టీసీఎస్ 11,151 మందిని తొలగించగా, ఇన్ఫోసిస్ 5,043 మందిని, విప్రో 6,529 మందిని నియమించుకున్నాయి. టీసీఎస్ ఈ సంవత్సరం క్యాంపస్ నియామకాల సంఖ్యను వెల్లడించలేదు. దీనినిబట్టి కంపెనీ ఫ్రెషర్ నియామకాలను తగ్గించుకున్నట్టు తెలుస్తోంది.

# కిచెన్ తెలంగాణ : రోటి పచ్చళ్ల రుచే వేరు!



**హైదరాబాద్ పెన్ పవర్:** వేడి వేడి అన్నంలో అప్పుడే నూరిన రోటి పచ్చడి వేసుకుని, కాస్త నెయ్యి కలుపుకుని తింటుంటే.. ఆ కమ్మదనానికి నిమిషాల్లో ప్లేట్? ఖాళీ అయిపోతుంది! మిక్సీలు వచ్చాక రుచి కాస్త మారింది. కానీ.. అసలు సిసలైన రోటి పచ్చడంటే రోట్లోనే నూరాలి. అప్పుడే దానికి ఆ రుచి! పాతకాలం రోటి పచ్చళ్ల రుచులు చూడాలంటే ఈ రెసిపీలు ట్రై చేయాల్సిందే. ఆరోగ్యకరమైన ఈ పచ్చళ్లు ఇంట్లో అందరికీ నచ్చేస్తాయి.

**కావాల్సినవి :** మినపప్పు : ముప్పావు కప్పు, నూనె, ధనియాలు : ఒక్కోటి రెండు టీ స్పూన్లు, ఎండు మిర్చి : ఇరవై, జీలకర్ర : ఒక టీస్పూన్, కరివేపాకు : కొంచెం, వెల్లుల్లి రెబ్బలు : ఎనిమిది, గోరువెచ్చని నీళ్లు, ఉల్లిగడ్డ ముక్కలు,

**ఉప్పు :** సరిపడా, చింతపండు రసం : రెండు టేబుల్ స్పూన్లు

**తయారీ :** పాన్?లో నూనె వేడి చేసి అందులో ఎండు మిర్చి వేసి వేగించి పక్కన పెట్టాలి. తర్వాత అదే పాన్?లో మినపప్పు వేసి దోరగా వేగించాలి. అందులో ధనియాలు, జీలకర్ర, కరివేపాకు, వెల్లుల్లి రెబ్బలు కూడా వేసి కలపాలి. వాటన్నింటిని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. ముందుగా రోటిలో ఎండు మిర్చి వేసి దంచాలి. అవి మెదిగాక వేగించిన మినపప్పు మిశ్రమం వేసి, నీళ్లు పోస్తూ రుబ్బాలి. ఉప్పు వేసి, చింతపండు రసం కూడా కలిపి బాగా రుబ్బాలి. చివరగా ఉల్లిగడ్డ ముక్కలు వేసి ఒకసారి రుబ్బితే చాలు.

**ఉలవలతో..**

**కావాల్సినవి :** ఉలవలు : అర కప్పు, శనగపప్పు, మినపప్పు : ఒక్కో టీస్పూన్,
ఎండు మిర్చి : పది, పచ్చి కొబ్బరి ముక్కలు : అర కప్పు,
చింతపండు : కొంచెం, వెల్లుల్లి రెబ్బలు : ఐదు

**తయారీ :** పాన్?లో నూనె లేకుండా ఉలవలు వేసి వేగించాలి. వాటిని ఒక ప్లేట్లోకి తీసుకోవాలి. అదే పాన్?లో నూనె వేడి చేసి శనగపప్పు, మినపప్పు, ఎండుమిర్చి వేసి వేగించాలి. తర్వాత పచ్చి కొబ్బరి ముక్కలు కూడా వేసి కలపాలి. ఇవన్నీ చల్లారనివ్వాలి. రోటిలో ఉలవలు వేసి దంచి పొడి చేయాలి. తర్వాత మిగతావాటిని కూడా వేసి మెత్తగా రుబ్బాలి. చివరగా నానబెట్టిన చింతపండు వేసి బాగా దంచాలి. అందులో వెల్లుల్లి రెబ్బలు, ఉప్పు వేసి అవసరమైతే నీళ్లు పోస్తూ రుబ్బాలి. తర్వాత తాలింపు వేసుకుంటే సరి.

**నువ్వులతో..**

**కావాల్సినవి :** నువ్వులు : ఒక కప్పు, పచ్చిమిర్చి : నాలుగు, ధనియాలు : ఒక టీస్పూన్, ఉప్పు, నీళ్లు, నూనె : సరిపడా
నానబెట్టిన చింతపండు : ఒక టేబుల్ స్పూన్?
బెల్లం : చిన్న ముక్క ఆవాలు : అర టీస్పూన్, ఎండు మిర్చి : రెండు, కరివేపాకు : కొంచెం

**తయారీ:** నువ్వుల్ని నూనె లేకుండా దోరగా వేగించి, దంచి పొడి చేసుకోవాలి. ఆ పొడిని పక్కన పెట్టి రోట్లో వేగించుకున్న పచ్చిమిర్చి, ధనియాలు, ఉప్పు వేయాలి. వాటితోపాటు నానబెట్టిన చింతపండు, బెల్లం కూడా వేసి, నీళ్లు పోస్తూ మెత్తగా దంచాలి. అందులో నువ్వుల పొడి కూడా వేసి రుబ్బాలి. ఆ తర్వాత తాలింపు కోసం నూనె వేడి చేసి ఆవాలు, ఎండు మిర్చి, కరివేపాకు వేసి వేగించాలి. ఆ తాలింపును పచ్చడిలో వేసి కలుపుకోవాలి.

# సిటీలో స్టైల్.. రొడింగ్ లో పవర్ ! ల్యాండ్ మోటో నుంచి కొత్త ఎలక్ట్రిక్ అడ్వెంచర్ బైక్.. ఫీచర్లు ఇవే!




**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికన్ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ తయారీ సంస్థ ా్రాచీన మోటో ఒక కొత్త పవర్ ఫుల్ బైక్ డిస్ట్రిక్ట్ ాణిని ప్రవేశపెట్టింది. ఇదొక డ్యూయల్-స్పోర్ట్ మోటార్ బైక్, అంటే దీనిని సిటీ రోడ్లపై అలాగే ఆఫ్-రోడింగ్ కోసం కూడా నడపవచ్చు. ఈ బైక్ ప్రత్యేకంగా ఆఫ్-రోడింగ్ కోసం రూపొందించారు. ఈ కొత్త ఎలక్ట్రిక్ అడ్వెంచర్ బైక్ ఫీచర్ల చూస్తే....... ా్రాచీన వీఃటీ లైట్ వెయిట్ బైక్‌లకు ప్రసిద్ధి చెందింది. డిస్ట్రిక్ట్ ాణి బైక్ కేవలం 109 కిలోల బరువుతో దీనిని నడపడం, మెయిన్ టైన్ చాల ఈజీ. ఈ బైక్‌లో కంపెనీ ఎండ్యూరో ఎవల్యూషన్ అనే కొత్త మోటార్ సిస్టమ్‌ను ఇన్‌స్టాల్ చేసింది. పవర్ అవుట్‌పుట్ పరంగా 345 బీపీ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది... కఠినమైన భూభాగాలు, ఎత్తైన పర్వతాలను ఈజీగా అధిరోహిస్తుంది. ఈ బైక్ రివర్సింగ్ కోసం రివర్స్ మోడ్, రీజనరేటివ్ బ్రేకింగ్, (బ్రేకింగ్ చేసేటప్పుడు బ్యాటరీని ఛార్జ్ చేస్తుంది.

**ఆఫ్-రోడింగ్ కోసం స్పెషల్ ఫీచర్లు**

కఠినమైన భూభాగాలపై ఈజీగా ప్రయాణించేందుకు ఈ బైక్ కి లాంగ్ సస్పెన్షన్ ఇచ్చారు. దీని గ్రౌండ్ క్లియరెన్స్ 9 అంగుళాలు. స్ట్రాంగ్ వీల్స్, ప్రత్యేకమైన ట్యూబ్‌లెస్ స్పోక్ వీల్స్ ఉన్నాయి. ఇంజిన్/మోటార్‌ని రాళ్ల నుండి రక్షించడానికి అల్యూమినియం బాష్ గార్డ్ అందించారు. బైక్ స్పీడ్, బ్యాటరీ సమాచారాన్ని చూపించడానికి కలర్ స్క్రీన్ ఉంది. సిటీలో అయితే ఫుల్ ఛార్జ్ చేస్తే బ్యాటరీ 177 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఛార్జర్ బైక్‌తోనే వస్తుంది... కాబట్టి మీరు విడిగా ఛార్జర్‌ను తీసుకెళ్లాల్సిన అవసరం లేదు. కంపెనీ ఈ బైకుని రెండు వెర్షన్లలో ప్రవేశపెట్టింది. స్టాండర్డ్ మోడల్ ధర సుమారు రూ. 10.17 లక్షలు. డెలివరీలు 2026లో ప్రారంభమవుతాయి.అసెంట్ ఎడిషన్ అనేది ప్రపంచవ్యాప్తంగా 30 యూనిట్లు మాత్రమే ఉత్పత్తి చేసిన లిమిటెడ్ ఎడిషన్. దీని ధర సుమారు రూ. 11.54 లక్షలు. ా్రాచీన వీఃటీ నుండి వచ్చిన ఈ బైక్ ఆఫీసుకు వెళ్లడానికి, వీకెండ్ అడ్వెంచర్ (ట్రిప్) ఆస్వాదించడానికి స్టైలిష్ ఌ స్ట్రాంగ్ ఎలక్ట్రిక్ బైక్‌ను కోరుకునే వారికి ఒక గొప్ప ఆప్షన్ .

# ఆస్తులు, అప్పులు.. లెక్కలన్నీ ఇక ఒకేచోట! ఇండియాలోనే మొదటి యాప్..



**హైదరాబాద్ పెన్ పవర్:** చాలా కుటుంబాల్లో ఆర్థిక వ్యవహారాలు చెల్లాచెదురుగా ఉంటాయి. బ్యాంక్ అకౌంట్లు, ఇన్వెస్ట్‌మెంట్లు, లోన్లు, ఇన్సూరెన్స్ పాలసీలు.. ఇలాంటివన్నీ వివిధ యాప్‌లు, అకౌంట్లలో ఉంటాయి. తల్లిదండ్రులు చేసిన డిపాజిట్లు పిల్లలకు తెలియవు. భర్త చేసిన ఇన్వెస్ట్‌మెంట్లు భార్యకు తెలియవు. పైగా చాలామంది ఇలాంటి వాటి గురించి పెద్దగా పట్టించుకోరు. కానీ.. కుటుంబ పెద్ద అకస్మాత్తుగా చనిపోతే అప్పుడు వాటి ఇంపార్టెన్స్ తెలుస్తుంది. ఎన్ని బ్యాంకు అకౌంట్లు ఉన్నాయి? ఎన్ని లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు ఉన్నాయి? పేరెంట్స్ మా పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ ఎంత చేశారు?.. ఇలాంటి ప్రశ్నలు తలెత్తుతాయి. అలాంటి వాళ్లకు ఫోలో భరోసాని ఇస్తుంది. ఇది పూర్తి ఫైనాన్షియల్ లైఫ్‌ని ఫోన్ స్క్రీన్ మీదే చూపించేస్తుంది. దీన్ని మున్మున్ దేశాయ్, విశాల్ పురోహిత్ అనే ఇద్దరు ఫ్రెండ్స్ కలిసి 2024లో స్థాపించారు. ఫోలో(ఫీూలా) అంటే ఫ్యామిలీ ఆఫ్ లవ్డ్ వన్స్ అని అర్థం. ఇది ఇండియాలోని మొదటి నెట్‌వర్త్ మేనేజ్‌మెంట్ యాప్. ఇది యూజర్ల ఆస్తులు, బాధ్యతలు, ఇన్సూరెన్స్‌లను ఒకే చోట సమన్వయం చేసి, రియల్-టైమ్ నెట్‌వర్త్‌ను చూపిస్తుంది. మున్మున్ దేశాయ్ వ్యక్తిగత అనుభవాలే ఫోలో స్థాపనకు అడుగులు పడేలా చేశాయి. 2022లో ఆమె కజిన్ బ్రదర్ అనుకోకుండా చనిపోయాడు. ఆ టైంలో వాళ్ల కుటుంబం ఆస్తులు, అప్పుల వివరాలు సేకరించడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. మున్మున్‌కు ఉన్న అనుభవం, ఫైనాన్షియల్ స్కిల్స్‌తో బ్యాంకు అకౌంట్స్, పాలసీలు, ఇమెయిల్స్, కంప్యూటర్ ఫోల్డర్లలో ఉన్న డాక్యుమెంట్స్.. ఇలా అన్నింటినీ ఒకచోటకు చేర్చి లెక్క తేల్చింది. తనకు ఆర్థిక రంగంలో అనుభవం ఉంది కాబట్టి ఈ పనులన్నీ ఈజీగా చేసింది. అవగాహన లేనివాళ్ల పరిస్థితి ఏంటి? అనే ప్రశ్న ఆమెలో తలెత్తింది. ఆ ప్రశ్నకు సమాధానంగా ఈ స్టార్టప్ పుట్టింది. మొదట్లో మున్మున్ ఈ సమస్య మహిళలకు మాత్రమే ఉంటుందని భావించేది. అంటే ఆస్తుల వివరాలు చెప్పకుండా చనిపోయిన భర్తల ఆస్తులను క్లెయిమ్ చేసుకోవడంలో భార్యలు ఇబ్బందులు పడతారని నమ్మేది. కానీ.. దీనిపై రీసెర్చ్ చేశాక ఆమెకి ఈ సమస్య ఆడవాళ్లకు మాత్రమే కాదు.. దేశం అంతటా ఎన్నో కుటుంబాలు ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయని తెలిసింది. వెంటనే ఉద్యోగానికి రిజైన్ చేసి ఫోలోపై దృష్టి పెట్టింది. వర్క్ ట్రాకింగ్ అఫ్లికేషన్ డెవలప్‌మెంట్ 2024లో ప్రారంభమైంది. పది మంది ఇంజనీర్ల బృందం ఫోలోని నిర్మించింది. ముందు బీటా వెర్షన్‌ని తీసుకొచ్చారు. ఏప్రిల్ 2025లో అందరికీ అందుబాటులోకి వచ్చింది. కొన్ని వారాల్లోనే 60 వేల కంటే ఎక్కువమంది ఈ ప్లాట్‌ఫామ్‌లో చేరారు. ప్రస్తుతం యాప్ సర్వీసులను ఉచితంగానే అందిస్తున్నారు.

**యాప్ ఎలా పనిచేస్తుంది?**

ఫోలో యాప్ 350+ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్లతో కనెక్ట్ అయ్యింది. యూజర్ కన్సెంట్‌తో డేటాను సమన్వయం చేసి, నెట్‌వర్త్‌ను రియల్-టైమ్‌లో చూపిస్తుంది. పైగా ఇందులో మాన్యువల్ అప్‌డేట్స్ భారం కూడా ఉండదు. ఆటోమేటిక్ సింకింగ్‌తో సమాచారాన్ని తీసుకుంటుంది. ఎర్రర్స్‌ని తగ్గిస్తుంది. టైంని ఆదా చేస్తుంది. సెబీ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తుంది. ఆస్తులు, బాధ్యతలు: బ్యాంక్ అకౌంట్లు, ఇన్వెస్ట్‌మెంట్లు (స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్), లోన్లు, క్రెడిట్ కార్డులు, రిటైర్‌మెంట్ ఫండ్స్ (పీఎఫ్, ఎన్‌పీఎస్ లాంటివి) మొదలైనవాటి వివరాలు అందిస్తుంది. ఇన్సూరెన్స్: హెల్త్, లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్‌లను ఒకే చోటకి చేర్చి, వాటి ప్రీమియం చెల్లించాల్సిన రోజుకు ముందే అలర్ట్స్ పంపుతుంది.

**షేరింగ్:** నలుగురు కుటుంబ సభ్యులకు డేటాని సేఫ్‌గా షేర్ చేయొచ్చు. ఎప్పుడైనా రివోక్ చేయొచ్చు.కాలిక్యులేటర్లు: నెట్‌వర్త్, ఇన్సూరెన్స్ కవర్, ఎమర్జెన్సీ ఫండ్, రిటైర్‌మెంట్ రెడీనెస్ లాంటివాటిని ఆటోమేటిక్‌గా కాలిక్యులేట్ చేసి చూపిస్తుంది. అకౌంట్ హెల్త్ స్కాన్: మిస్సింగ్ నామినీలు, కేవైసీ గ్యాప్‌లు మొదలైనవి గుర్తించి స్కోర్ ఇస్తుంది. 18 ఏండ్ల అనుభవం మున్మున్, విశాల్ పురోహిత్‌తో కలిసి ఫోలోకి పునాదులు వేసింది. ఇది ముంబై కేంద్రంగా పనిచేస్తుంది. మున్మున్ దేశాయ్ ప్రస్తుతం కంపెనీకి సీఈవోగా పనిచేస్తోంది. ఆమెకు ఫైనాన్స్ రంగంలో 18 సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది. దాల్మియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో చదువుకుంది. తర్వాత 'బాట్లివాలా అండ్ కరణి సెక్యూరిటీస్'లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎదిగింది. 'టాప్ 100 విమెన్ ఇన్ ఫైనాన్స్',
'40 అండర్ 40 ఇన్వెస్ట్‌మెంట్ ప్రొఫెషనల్' అవార్డులు గెలుచుకుంది. ఏంజెల్ ఇన్వెస్టర్‌గా కూడా గుర్తింపు దక్కించుకుంది.

కంపెనీ కోఫౌండర్ విశాల్ పురోహిత్ ఒక సీరియల్ ఎంటర్‌ప్రెన్యూర్. పూణే యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్ డిగ్రీ పట్టా అందుకున్నాడు. ఆయన పూకర్ అనే రిటైల్ ఆపరేషన్స్ ప్లాట్‌ఫామ్‌కి ఫౌండర్. స్కానోర్ టెక్నాలజీస్‌లో బోర్డ్ మెంబర్, గ్యారేజ్ అగైన్ వెంచర్స్ ఫౌండర్. ఏంజెల్ ఇన్వెస్టర్.

# మే నెలలో పుట్టిన అమ్మాయిలు చాలా అట్రాక్టివ్ ఉంటారు..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫలానా అమ్మాయి ఎందుకో చాలా అట్రాక్ట్‌గా ఉందని మీరెప్పుడైనా భావించారా? మిగతా వారికంటే ఫలానా మహిళలో ఏదో ఆకర్షణ ఉందబ్బా అని ఎవరైనా పొగడటం విన్నారా? అయితే వారు దాదాపు మే నెలలో జన్మించిన వారై ఉంటారు! ఎందుకంటే ఈ నెలలో జన్మించిన మహిళలు వారి కలర్ నలుపైనా, తెలుపైనా హైట్ అండ్ వెయిట్ ఎలా ఉన్నా చూడ్డానికి మాత్రం.. మిగతా మహిళలతో పోల్చినప్పుడు ఆకర్షణీయంగా అనిపిస్తారని పోలండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ వ్రోక్లా నిర్వహించిన ఒక అధ్యయనం వెల్లడించింది. బోర్న్ టు బీ బ్యూటిఫుల్' అనే స్టడీలో భాగంగా రీసెర్చర్స్ అత్యధికమంది ప్రజలు ఏ విధమైన మహిళల్ని అట్రాక్టివ్ గలవారిగా భావిస్తారో తెలుసుకునేందుకు ప్రయత్నించారు. ఇందులో భాగంగా 21 నుంచి 23 సంవత్సరాలలోపు వయసుగల 5, 294 మహిళల సోషల్ మీడియా ఫొటోలను సైతం అంచనా వేశారు. ప్రత్యక్షంగా, ఆన్‌లైన్ వేదికగా పరిశీలనలు జరిపారు. ఈ సందర్భంగా తేలిందేమిటంటే.. మిగతా వారితో పోలిస్తే.. వసంతకాలం(మే నెల)లో పుట్టిన మహిళలు, శరదృతువులో (సెప్టెంబర్, నవంబర్) పుట్టినవారికంటే చాలా ఆకర్షణీయంగా ఉన్నట్లు రేటింగ్ పొందారు. ఇది ఆకర్షణను కొలిచే స్కేల్‌లో స్పష్టంగా కనిపించింది. మేలో పుట్టినవారి స్కోర్ 10.22గా ఉండగా, సెప్టెంబర్, అలాగే నవంబర్‌లో పుట్టినవారి అట్రాక్టివ్ రేటింగ్ 10.15 అండ్ 10.14గా ఉంది. అంటే మే నెలలో పుట్టినవారు అత్యంతక ఆకర్షణీయంగా ఉంటున్నారు. మే నెలలో పుట్టిన మహిళలు/అమ్మాయిలు సెప్టెంబర్, నవంబర్ నెలల్లో పుట్టినవారికంటే ఎక్కుక ఆకర్షణీయంగా అనిపించడానికి ముఖ్య కారణం.. వారి పుట్టిన సీజన్‌తో ముడిపడిన ఆరోగ్య ప్రయోజనాలేనని అధ్యయనం పేర్కొన్నది. రీసెర్చర్స్ చెప్పినట్లుగా.. వసంతకాలం(మే)లో పుట్టినవారు సహజంగానే పోషకాహారం, చలి, వేడి, డీహైడ్రేషన్ వంటివి సీజనల్ కారకాల వల్ల మెరుగైన ఆరోగ్యాన్ని కలిగి ఉంటారు. ముఖ్యంగా ఫిబ్రవరి నుంచి మే మధ్య పుట్టిన శిశువులు జన్మించిన తర్వాత రెండు నెలల వరకు బాలింతల్లో ఇమ్యూనోగ్లోబులిన్స్ (ఇమ్యూనిటీ ప్రోటీన్లు) వల్ల రోగనిరోధకత బలంగా ఉంటుంది. ఇది శిశువుల్లో డిసీజ్ రిస్క్‌ను తగ్గిస్తుంది. దీని వల్ల వారు పెరిగే కొద్దీ కూడా దీర్ఘకాలంలో శారీరక ఆకర్షణ పెరుగుతుంది. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ వంటి నెలల్లో పుట్టినవారి కంటే కూడా మే నెలలో పుట్టిన వీరు చాలా తక్కువ హెల్త్ ప్రాబ్లమ్స్‌ను ఎదుర్కొంటారు. అమెరికన్ మెడికల్ ఇన్ఫర్మాటిక్స్ అసోసియేషన్ 2015 స్టడీ కూడా మే నెల పుట్టినవారిలో 55 రకాల డిసీజ్‌ల రిస్క్ తక్కువగా ఉంటుందని నిర్ధారించింది. మొత్తానికి ఈ థియరీల వెనుక శాస్త్రీయ కారణాలు ఉన్నట్లు అనిపించినప్పటికీ పూర్తిగా యూనివర్సల్ మాత్రం కాదు. ఎందుకంటే ఆకర్షణ జన్యువులు, లైఫ్‌స్టైల్ వంటి ఇతర కారకాలపై కూడా ఆధారపడి ఉంటుంది. పైగా సదరు అధ్యయనాలు ముఖ్యంగా పోలిష్ మహిళలపై ఆధారపడినవి. ఇటీవల తరచుగా వైరల్ అవుతున్నాయి. లింక్


# శనివారం పొరపాటున కూడా ఈ పనులు చేయొద్దు..?



**హైదరాబాద్ పెన్ పవర్:** హిందూ సంప్రదాయంలో శనివారం ప్రత్యేకమైన ప్రాధాన్యం కలిగి ఉంటుంది. ఈ రోజు శని దేవుడికి అంకితమై ఉంటుంది, శని గ్రహాన్ని కర్మ ఫలదాతగా భావిస్తారు. అందుకే శనివారం చేసే కొన్ని పనులు వ్యక్తి జీవితంపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని పండితులు చెబుతుంటారు. హిందూ సంప్రదాయంలో శనివారంకు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంది. ఈ రోజు శని దేవుడికి అంకితమై ఉంటుంది. శని గ్రహం కర్మఫలదాతగా భావిస్తారు. అందుకే శనివారం చేసే కొన్ని పనులు జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతాయని పండితులు చెబుతుంటారు. మరి శనివారం ఏ పనులు చేయకూడదు? ఎందుకు చేయకూడదు? శనివారం జుట్టు లేదా గోర్లు కత్తిరించుకుంటే.. ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, మనసుకు అశాంతి కలిగే అవకాశం ఉందని శాస్త్రాలు చెబుతున్నాయి. శని దేవుడికి ఇనుముతో సంబంధం ఉంటుంది. శనివారం ఇనుము వస్తువులు కొనుగోలు చేయడం లేదా అమ్మడం వల్ల నష్టం, అనుకోని సమస్యలు ఎదురవుతాయని నమ్మకం. శనివారం తలకి నూనె రాసుకోవడం మంచిది కాదని భావిస్తారు. కానీ, నువ్వులు నూనె లేదా ఆవ నూనె దానం చేయడం మాత్రం శుభకరం. ఇది శని దోషం తగ్గించేందుకు ఉపయోగపడుతుందని నమ్మకం.

శని దేవుడు న్యాయానికి ప్రతీక. శనివారం అబద్ధాలు చెప్పడం, ఇతరులను మోసం చేయడం చేస్తే కర్మఫలితాలు వెంటనే వస్తాయని, జీవితంలో ఆటంకాలు పెరుగుతాయని పండితులు హెచ్చరిస్తున్నారు. శనివారం మద్యం, మాంసాహారం తీసుకోవడం వల్ల మనస్సు అస్థిరంగా మారడం, శని ప్రభావం తీవ్రంగా పడటం జరుగుతుందని విశ్వాసం. పేదలకు నల్ల వస్త్రాలు, నువ్వులు, నూనె, ఆహారం దానం చేయడం శుభప్రదం."ఓం శం శనైశ్చరాయ నమః" ఈ మంత్రాన్ని 108 సార్లు జపిస్తే శని అనుగ్రహం లభిస్తుందని నమ్మకం.శనివారం హనుమంతుని దర్శనం చేయడం వల్ల శని దోషం తగ్గి, భయాలు తొలగుతాయని శాస్త్రోక్తి. శనివారం ఈ జాగ్రత్తలు పాటిస్తే? అనవసర సమస్యలు తగ్గుతాయి. ఆర్థిక స్థిరత్వం పెరుగుతుంది. మనశ్శాంతి కలుగుతుంది. శనివారం చేసే చిన్న పొరపాటు కూడా జీవితంలో పెద్ద ఇబ్బందులకు దారితీయవచ్చని పెద్దలు చెబుతుంటారు. అందుకే ఈ నియమాలను గౌరవిస్తూ, శుభకార్యాలు చేస్తే శని దేవుడి కృప తప్పక లభిస్తుందని విశ్వాసం. దీంతో మీకు సానుకూల ఫలితాలు లభిస్తాయి.

# బ్లూటూత్ పెట్టుకోవడం వల్ల క్యాన్సర్ వస్తుందా?



**హైదరాబాద్ పెన్ పవర్:** అధునిక యుగంలో వైర్‌లెస్ ఇయర్‌ఫోన్‌లు దైనందిన జీవితంలో భాగమయ్యాయి. ఆఫీస్ కాల్స్ నుండి సంగీతం, సోషల్ మీడియా వరకు, ఈ పరికరాలు గంటల తరబడి చెవుల్లోనే ఉంటాయి. బ్లూటూత్ ఇయర్‌ఫోన్‌ల ద్వారా వెలువడే రేడియేషన్ ఆరోగ్యానికి హానికరమా? క్యాన్సర్‌కు కారణమవుతుందా అనే ప్రశ్నలు తలెత్తున్నాయి. అధునిక యుగంలో వైర్‌లెస్ ఇయర్‌ఫోన్‌లు దైనందిన జీవితంలో భాగమయ్యాయి. ఆఫీస్ కాల్స్ నుండి సంగీతం, సోషల్ మీడియా వరకు, ఈ పరికరాలు గంటల తరబడి చెవుల్లోనే ఉంటాయి. బ్లూటూత్ ఇయర్‌ఫోన్‌ల ద్వారా వెలువడే రేడియేషన్ ఆరోగ్యానికి హానికరమా? క్యాన్సర్‌కు కారణమవుతుందా అనే ప్రశ్నలు తలెత్తున్నాయి. ఇంటర్నెట్‌లో వైరల్ వాదనలు కూడా వాటిని ధరించడం వల్ల తల దగ్గర మైక్రోవేవ్ పట్టుకోవడం లాంటిదని చెబుతున్నాయి. ఈ గందరగోళాన్ని తొలగించడానికి, అమెరికాలోని మిచిగాన్ న్యూరోసర్జరీ ఇన్‌స్టిట్యూట్ న్యూరోసర్జన్ డాక్టర్ జే జగన్నాథన్ ఇటీవల ఒక వీడియో విడుదల చేశారు. ఇందులో శాస్త్రీయ వాస్తవాల ఆధారంగా పరిస్థితిని స్పష్టం చేశారు. అక్టోబర్ 13, 2025న ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ వీడియోలో, ఎయిర్‌పాడ్‌లు ధరించడాన్ని మైక్రోవేవ్‌లకు గురికావడాన్ని పోల్చిన వైరల్ క్లిప్‌కు ఆయన స్పందించారు. డాక్టర్ జగన్నాథన్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ పోలిక పూర్తిగా తప్పుదారి పట్టించేది. వైర్‌లెస్ ఇయర్‌ఫోన్‌ల ద్వారా వెలువడే రేడియేషన్ "నాన్-అయనీకరణం" అని, ఆఔంని దెబ్బతీసే సామర్థ్యాన్ని కలిగి ఉండదని ఆయన వివరించారు. అందుకే దీనిని క్యాన్సర్‌తో నేరుగా అనుసంధానించే ఖచ్చితమైన ఆధారాలు లేవని కొట్టిపారేశారు. బ్లూటూత్ ఇయర్‌ఫోన్‌ల ద్వారా విడుదలయ్యే రేడియేషన్ మొబైల్ ఫోన్‌ల కంటే చాలా తక్కువగా ఉంటుందని వారు అంటున్నారు. డేటా ప్రకారం, ఎయిర్‌పాడ్‌ల వంటి పరికరాల ద్వారా విడుదలయ్యే రేడియేషన్ మొబైల్ ఫోన్‌ల కంటే 10 నుండి 400 రెట్లు తక్కువగా ఉంటుంది. కాబట్టి, మొబైల్ ఫోన్ వాడకం నుండి క్యాన్సర్‌కు ఎటువంటి నిశ్చయాత్మక ఆధారాలు లేనప్పటికీ, ఇయర్‌ఫోన్‌ల ప్రమాదం ఇంకా తక్కువగా ఉంటుందని అంటున్నారు.క్యాన్సర్ వాదనలకు సంబంధించి ఎక్కువగా ఉదహరించిన పరిశోధన నేషనల్ టాక్సికాలజీ ప్రోగ్రామ్ (ఔఖ) చేసిన అధ్యయనం. ఈ అధ్యయనం ఎలుకలను దీర్ఘకాలిక రేడియోఫ్రీక్వెన్సీ రేడియేషన్‌కు గురిచేసింది. మగ ఎలుకలలో కొన్ని రకాల గుండె క్యాన్సర్ సంభవంలో స్వల్ప పెరుగుదలను ఇది గుర్తించింది. అయితే ఆడ ఎలుకలలో ఎటువంటి స్పష్టమైన ప్రభావం కనిపించలేదు. ఈ అధ్యయనాన్ని తరువాత జూ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ సమీక్షించిందని డాక్టర్ జగన్నాథన్ వివరించారు. ఈ పరిశోధన మానవులలో క్యాన్సర్, రేడియేషన్ మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని నిరూపించలేదని ఈఆం స్పష్టంగా పేర్కొంది. ఈ అధ్యయనంలో ఎలుకలకు రేడియేషన్ బహిర్గతం మొబైల్ ఫోన్లు లేదా ఇయర్‌ఫోన్‌ల నుండి నిజ జీవితంలో సాధారణంగా ఎదుర్కొనే పరిస్థితులకు భిన్నంగా ఉందని గమనించడం ముఖ్యం. ప్రస్తుత శాస్త్రీయ ఆధారాల ఆధారంగా, వైర్‌లెస్ ఇయర్‌ఫోన్‌లు క్యాన్సర్‌కు కారణమవుతాయని నిర్ధారించడం తప్పు అని నిపుణులు అంటున్నారు.

# ఓవర్ థింకింగ్‌తో నిద్రను కోల్పోతున్న మహిళలు..!



**హైదరాబాద్ పెన్ పవర్:** స్త్రీలు యావరేజ్‌గా రాత్రిపూట 2 నుంచి 4 గంటల నిద్రను ఓవర్ థింకింగ్ వల్ల కోల్పోతున్నారని, ఇది వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే వాదన ఈ మధ్య సోషల్ మీడియాలో తరచుగా వైరల్ అవుతోంది. కాగా ఓవర్ థింకింగ్ ప్రమాదకరమే కానీ.. ఇది కేవలం మహిళలకు మాత్రమే కాదు, పురుషులకు కూడా వర్తిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే చాలా వరకు పురుషులకంటే మహిళలు ఒత్తిడి, ఆందోళనలు ఎక్కువగా ఎదుర్కొంటున్నారని, దీనివల్ల నిద్రలేమి లేదా నిద్రా భంగం వంటి సమస్యలు సైతం అనుభవిస్తున్నారని పరిశోధనలు చూపిస్తున్నాయి. అమెరికన్ అకాడమీ ఆఫ్ స్లీప్ మెడిసిన్ సర్వే ప్రకారం.. పురుషులతో పోలిస్తే 74% మంది మహిళలు ఒత్తిడి వల్ల, 68% మంది ఆందోళన వల్ల ఓవర్ థింకింగ్ బారిన పడుతున్నారు. దీనివల్ల నాణ్యమైన నిద్రను కోల్పోతున్నారు. అయితే పర్యవసనాల విషయానికి వస్తే స్త్రీలు పురుషుల కంటే రెండింతలు ఎక్కువగా డిప్రెషన్, ఆందోళనలతో బాధపడుతున్నారు. ఇది వారిలో ఇన్‌సామ్నియాకు దారితీస్తున్నది. ఇక గాలప్ పోల్ ప్రకారం కూడా 18–49 సంవత్సరాల మహిళలు పురుషుల కంటే 53% ఎక్కువ ఒత్తిడిని అనుభవిస్తూ తక్కువ నిద్రను పొందుతున్నారు. ఇక ఓవర్‌థింకింగ్ లేదా పదే పదే వేధించే ఆలోచనలు స్త్రీలలో ఎక్కువగా వస్తూ నిద్రను అడ్డుకుంటున్నాయి. దీనికి ప్రధాన కారకాలు ఒత్తిడి, ఆందోళన, పనుల్లో మల్టీటాస్కింగ్ అంటున్నారు నిపుణులు.

చాలామంది స్త్రీలు కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగ బాధ్యతలు కూడా నిర్వహించడం. అదనంగా ఇంటి పనులు చేసుకోవడం, పిల్లల్ని చూసుకోవడం వంటి అదనపు బాధ్యతలు మోస్తున్నారు. ఇవి మెదడును నిరంతరం యాక్టివ్‌గా ఉంచుతూ, విశ్రాంతి తీసుకోవడాన్ని కష్టతరం చేస్తున్నాయి. క్రమంగా ఓవర్ థింకింగ్‌కు, హార్మోనల్ మార్పులకు, నిద్రలేమికి కారణం అవుతున్నాయి. తక్కువ నిద్ర వల్ల ఒత్తిడి, కోపం, మానసిక అలసట పెరుగుతాయి. ఇవి డిప్రెషన్, యాంగ్జైటీలకు దారితీస్తాయి. ప్రస్తుతం చాలామంది మహిళలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. దీర్ఘకాలిక నిద్రలేమి మొత్తం ఆరోగ్యం, మానసిక శ్రేయస్సుపై ప్రభావం చూపుతుంది. నిద్ర లోపం వల్ల కాగ్నిటివ్ ఫంక్షన్ దెబ్బతింటుంది, రోగనిరోధక శక్తి తగ్గుతుంది. హార్ట్ ప్రాబ్లమ్స్, ఒబెసిటీ, డయాబెటిస్ వంటి హెల్త్ రిస్క్ పెరుగుతాయి. ఈ సమస్య నుంచి బయటపడాలంటే ఓవర్ థింకింగ్‌ను వదిలేయాలని, కనీసం 6 గంటలకు మించిన క్వాలిటీ స్లీప్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# పర్యావరణ విద్యలో.. ప్రపంచవ్యాప్త ఖ్యాతి.!



**హైదరాబాద్ పెన్ పవర్:** మనం ముందు కాపాడుకోవాల్సింది పర్యావరణాన్ని. అది బాగుంటేనే కదా మిగతావి. కానీ.. జనాల బుర్ర ఇప్పుడు పర్యావరణం గురించి ఆలోచించే స్థితిలో లేదు. ఆలోచింపజేసేలా.. ఆకర్షణీయంగా.. వినూత్నంగా చెప్తేనే జనాల మెదళ్లకు ఎక్కుతుంది. దీనిని గుర్తించిన 17 ఏళ్ల యువతి సిరి వడ్లమూడి పర్యావరణం గురించి ప్రపంచాన్ని ఆలోచింపజేస్తోంది. ఆటలతో ఆకర్షణీయంగా.. సూర్యాపేట.. హైదరాబాద్‌లోని 25 పాఠశాలల్లో పర్యావరణ కాలుష్య పాఠాలు బ్లాక్‌బోర్డు లెక్చర్లతో నడవవు. దానికి బదులుగా ఆ పాఠశాలల్లోని విద్యార్థులు వార్తాపత్రికలతో ఎకో-ఫ్రెండ్లీ బ్యాగ్‌లు మడతపెడుతూ.. మట్టి ఇంకా ఆకులతో వినాయక విగ్రహాలు తయారు చేస్తూ.. బాటిల్ క్యాప్‌ను తడి లేదా డ్రై వేస్ట్‌లో వేస్తూ చర్చిస్తారు. అంటే చెప్పడం ఉండదు. ప్రాక్టికల్‌గా చేసి చూపించుడే అన్నమాట. ఈ మార్పుకు మార్గదర్శకురాలు 17 ఏళ్ల సిరి వడ్లమూడి. హైదరాబాద్‌లోని ఆర్కా గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న సిరి పర్యావరణ పాఠాలను ఆటలతో ఆకర్షణీయంగా మార్చింది. ఉత్తమ డిబేటర్.. సిరి సూర్యాపేటలో పుట్టింది. ట్రినిడాడ్‌లో పెరిగింది. పదో తరగతి పూర్తయిన తర్వాత ఇండియాకు తిరిగొచ్చి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ట్రినిడాడ్‌లోనే సిరికి పర్యావరణం పట్ల అవగాహన ఏర్పడింది. ఇంటి సమీపంలోని మ్యాంగ్రోవ్ అడవుల నిర్మూలనపై మొదట్లో తనొక వీడియో తయారు చేసింది. మ్యాంగ్రోవ్‌ల నష్టం వల్ల వచ్చే పర్యావరణ హానిని నేరుగా చూసిందామె. ఆ అనుభవమే తనను పర్యావరణం పట్ల మరింత బాధ్యత పెంచింది. 2022లో ట్రస్ట్ ఫర్ సస్టెయినబుల్ లివింగ్ డిబేట్లలో పాల్గొని ఉత్తమ డిబేటర్‌గా ఎంపికైంది. గుర్తింపు సంతోషమిచ్చినా యువత పర్యావరణ గురించి ఎందుకు ఆలోచించట్లేదనే ప్రశ్న మొదలైంది.

యూత్ గేమిఫికేషన్ క్లబ్.. హైదరాబాద్‌కు వచ్చినంక.. బయోడిగ్రేడబుల్.. మైక్రోప్లాస్టిక్స్.. సెగ్రిగేషన్ వంటి పదాలను తెలుగులో వివరించడం కష్టంగా అనిపించింది. ఆటలతో అవగాహన కల్పిస్తే ఎలా ఉంటుంది? అని ఆలోచించింది సిరి. ఆ ఆలోచనే యూత్ గేమిఫికేషన్ క్లబ్ స్థాపించేలా చేసింది. తన తమ్ముడు సార్థక్‌తో కలిసి స్థాపించిన ఈ క్లబ్‌లో కాన్సెప్ట్‌లను సరళంగా.. దృశ్యాత్మకంగా వివరించడం మొదలుపెట్టింది. అలా ఎకోసిస్టమ్.. వరదలు.. కరువులు వంటివి తెలియజేస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో చూపిస్తోంది. మాటలతో కాకుండా స్వయంగా అనుభవించేలా కార్యక్రమాలు డిజైన్ చేస్తోంది. సిరి వర్క్‌షాప్‌లు శాశ్వత ప్రభావం చూపిస్తున్నాయి. ప్రతి పాఠశాలలో ఎకో-అంబాసిడర్లను శిక్షణ ఇచ్చి.. సెషన్లు ముగిసిన తర్వాత క్యాంపెయిన్ కొనసాగిస్తుంటారు. వీళ్లు వాళ్ల పరిసరాల్లో క్లీనప్ డ్రైవ్‌లు నిర్వహిస్తారు. కుటుంబాలను సింగిల్-యూజ్ ప్లాస్టిక్స్ తగ్గించమని ఒప్పిస్తారు. అలా 25 పాఠశాలల్లో మార్పు తీసుకొచ్చారు. ఒకప్పుడు పర్యావరణ శాస్త్రం బోరింగ్‌గా అనిపించిన విద్యార్థులు ఇప్పుడు ఆసక్తి.. ఉత్సాహంతో కనిపిస్తున్నారు. ఈ-వేస్ట్‌ను మాక్రోఎకనామిక్ ఫ్యాక్టర్లతో లింక్ చేసే రీసెర్చ్ పేపర్.. ఏఐ అండ్ ఎకనామిక్స్‌పై డిబేట్లో అంతర్జాతీయ స్థాయిలో మొదటి స్థానం సాధించింది.

# రాత్రి భోజనం ఆలస్యంగా తీసుకుంటే.. డయాబెటిస్ వస్తుందా?



**హైదరాబాద్ పెన్ పవర్:** చాలా మంది రాత్రి వేళ ఆలస్యంగా భోజనం తీసుకోవడాన్ని సాధారణ అలవాటుగా భావిస్తారు. కానీ ప్రభావం వెంటనే గుర్తించబడకపోయినా అది క్రమంగా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా రాత్రి ఆలస్యంగా తినడం వల్ల శరీర సమతుల్యత దెబ్బతింటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలి ఆరోగ్యంలో అనేక మార్పులకు దారితీసింది. పని, మొబైల్ ఫోన్ల అధిక వినియోగం,మారుతున్న జీవనశైలి కారణంగా ఆహారపు అలవాట్లు చెదిరిపోతున్నాయి. అందువల్ల చాలామంది ఆలస్యంగా తినడం అలవాటు చేసుకున్నారు. దానిని సాధారణ అలవాటుగా భావిస్తారు. కానీ ప్రభావం వెంటనే గుర్తించబడకపోయినా అది క్రమంగా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా రాత్రి ఆలస్యంగా తినడం వల్ల శరీర సమతుల్యత దెబ్బతింటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కాబట్టి రాత్రి ఆలస్యంగా తినడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరుగుతాయా? రాత్రిపూట ఆలస్యంగా తినడం, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం మధ్య బలమైన సంబంధం ఉందని నిపుణులు చెబుతారు. భోజన సమయం చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుందని అనేక అధ్యయనాలు సైతం నిరూపించాయి. అందుకే ఈ అలవాటు విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆర్ఎంఎల్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి ప్రకారం.. ఒక వ్యక్తి ఆలస్యంగా భోజనం చేసినప్పుడు, శరీరం దానిని ప్రాసెస్ చేయడం కష్టమవుతుంది. పగటిపూట కంటే రాత్రిపూట శరీరం నెమ్మదిగా పనిచేస్తుంది. అలాంటి సందర్భంలో తినే ఆహారం వెంటనే శక్తిగా మారదు. అందువల్ల, రక్తంలో గ్లూకోజ్ స్థాయి పెరగవచ్చు. ముఖ్యంగా తీపిగా ఉండే భోజనం తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి వేగంగా పెరుగుతుంది. అధిక చక్కెర స్థాయిలు కేవలం మధుమేహ వ్యాధిగ్రస్తులకు మాత్రమే సమస్య కాదు. ఆరోగ్యకరమైన వ్యక్తికి కూడా, రాత్రి ఆలస్యంగా తినే అలవాటు భవిష్యత్తులో సమస్యలకు దారితీస్తుంది. ఎక్కువ రోజులు ఈ అలవాటు కొనసాగించడం వల్ల శరీర చక్కెర నియంత్రణ వ్యవస్థ బలహీనపడుతుంది. క్రమంగా, ఇది ఇన్సులిన్‌ను ప్రభావితం చేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయి సాధారణం కంటే ఎక్కువగా పెరగడం ప్రారంభమవుతుంది. ఈ అలవాటు మధుమేహం క్రమంగా ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ సకాలంలో సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.


# బట్టల్లో యూరిన్ పడిపోతుందా!



**హైదరాబాద్ పెన్ పవర్:** మూత్ర ఆపుకొనలేని స్థితి అనేది చాలా మందిని వేధించే సమస్య. ఓవర్‌యాక్టివ్ బ్లాడర్, స్ట్రెస్ యూరినరీ ఇంకంటినెన్స్, ఓవర్‌ఫ్లో ఇంకంటినెన్స్ వంటి వివిధ రకాలు ఉన్నాయి. డయాబెటిస్, మెనోపాజ్, బలహీనమైన కండరాలు వంటివి ప్రధాన కారణాలు. సరైన నిర్ధారణ, చికిత్సల ద్వారా ఈ సమస్యను నియంత్రించవచ్చు. మూత్ర ఆపుకొనలేని స్థితి (యూరినరీ ఇంకంటినెన్స్) అనేది చాలా మంది వృద్ధులను, ముఖ్యంగా మహిళలను, వేధించే ఒక సాధారణ ఆరోగ్య సమస్య. దీని వల్ల వ్యక్తిగత జీవితంపై తీవ్ర ప్రభావం పడుతుంది, సామాజిక కార్యకలాపాలకు దూరం కావాల్సి రావచ్చు. యూరిన్ లీకేజ్, దుర్వాసన, మూత్రం రంగులో మార్పు వంటి లక్షణాలతో బాధపడుతున్న ఒక 50 ఏళ్ల వ్యక్తి ప్రశ్నకు సమాధానంగా, వైద్యులు ఈ సమస్య గురించి కారణాలు, చికిత్సా పద్ధతులను వివరించారు. మూత్రం ఆపుకొనలేని స్థితి ప్రధాన రకాలు: 1. ఓవర్‌యాక్టివ్ బ్లాడర్: ఈ స్థితిలో బ్లాడర్ పరిమాణం చిన్నదై, తరచుగా మూత్ర విసర్జన చేయాలనే బలమైన కోరిక కలుగుతుంది. బ్లాడర్‌కు వెళ్లే లోపల కూడా మూత్రం లీక్ కావచ్చు. దీర్ఘకాలిక మధుమేహం (5-6 సంవత్సరాలకు పైగా) ఉన్నవారిలో బ్లాడర్ కండరాలు ప్రభావితమై ఈ సమస్య రావొచ్చు. అలాగే, పోస్ట్ మెనోపాజల్ తర్వాత హార్మోన్ల మార్పుల వల్ల బ్లాడర్ కండరాలు బలహీనపడి, ఇరిటబిలిటీ పెరిగి, బ్లాడర్ సామర్థ్యం తగ్గిపోవడం కూడా ఒక కారణం. దీనివల్ల తరచుగా, హఠాత్తుగా మూత్ర విసర్జన చేయాల్సి వస్తుంది. 2. స్ట్రెస్ యూరినరీ ఇంకంటినెన్స్: దగ్గినా, తుమ్మినా, నవ్వినా, లేదా ఏదైనా శారీరక శ్రమ చేసినా మూత్రం లీక్ అవ్వడం దీని లక్షణం. హార్మోన్ల క్షీణత, వయసు పెరగడం, లేదా ప్రసవాల కారణంగా గర్భసంచి చుట్టూ ఉన్న పెల్విక్ కండరాలు (పెల్విక్ ఫ్లోర్ మజిల్స్) బలహీనపడటం వల్ల ఇది సంభవిస్తుంది. కడుపుపై ఒత్తిడి పెరిగినప్పుడు ఈ బలహీన కండరాలు మూత్రాశయాన్ని సరిగా నిలువరించలేవు. 3. మిశ్రమ ఇంకంటినెన్స్: ఇది ఓవర్‌యాక్టివ్ బ్లాడర్, స్ట్రెస్ యూరినరీ ఇంకంటినెన్స్ లక్షణాల కలయిక. అంటే, దగ్గినా, తుమ్మినా మూత్రం లీక్ అవ్వడం, అలాగే మూత్రం వచ్చినప్పుడు ఆపుకోలేకపోవడం వంటి రెండు సమస్యలు ఒకేసారి ఉండవచ్చు.

4. ఓవర్‌ఫ్లో ఇంకంటినెన్స్: ఈ రకంలో, బ్లాడర్ సరిగ్గా ఖాళీ అవ్వదు. దీనివల్ల మూత్రాశయం నిండిపోయి, మూత్రం నిరంతరం చుక్కలు చుక్కలుగా లీక్ అవుతుంది. దీర్ఘకాలిక మధుమేహం ఉన్నవారిలో బ్లాడర్ పంపింగ్ సామర్థ్యం తగ్గిపోవడం, మూత్రం మిగిలిపోవడం వల్ల బ్లాడర్ పూర్తి అయ్యే సంవేదన తెలియక, అది నిండిపోయి ఓవర్‌ఫ్లో అవుతుంది. ఓవర్‌యాక్టివ్ బ్లాడర్ నిర్ధారణ: యూరోడైనమిక్ స్టడీ అనే పరీక్ష ద్వారా బ్లాడర్ ప్రెషర్‌లను, లీకేజ్ ఎప్పుడు జరుగుతుందో అంచనా వేస్తారు. దీనిలో బ్లాడర్‌లోకి చిన్న ట్యూబ్ ద్వారా నీటిని పంపి పరిశీలిస్తారు. ఓవర్‌ఫ్లో ఇంకంటినెన్స్ చికిత్స: కొన్ని రోజులు యూరిన్ పైపు (కేథెటర్) అమర్చడం, ఆపై సిఐసి (క్లీన్ ఇంటర్‌మిటెంట్ కేథెటరైజేషన్) అంటే ప్రతి నాలుగు గంటలకు ఒకసారి పైపును స్వయంగా పెట్టుకుని తీయడం వంటి శిక్షణ ఇస్తారు. బ్లాడర్ పంపింగ్‌ను మెరుగుపరచడానికి మందులు కూడా ఇస్తారు. ఈ పద్ధతుల ద్వారా లీకేజ్‌ను గణనీయంగా తగ్గించవచ్చు. స్ట్రెస్ ఇంకంటినెన్స్ చికిత్స: కీగెల్ ఎక్సర్‌సైజులు (పెల్విక్ ఫ్లోర్ ఎక్సర్‌సైజులు) కండరాలను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. అయితే, కొన్నిసార్లు ఈ వ్యాయామాలు సరిగా స్పందించకపోవచ్చు లేదా లీకేజ్ ఎక్కువగా ఉన్నప్పుడు "స్లింగ్ సర్జరీలు" అనే శస్త్రచికిత్సలు అవసరం కావచ్చు. ఈ ఆపరేషన్ల ద్వారా మూత్రం లీకేజ్‌ను పూర్తిగా నివారించవచ్చు. ఈ సమస్యతో బాధపడేవారు తక్షణమే వైద్య నిపుణులను సంప్రదించి, సరైన నిర్ధారణ, చికిత్స పొందడం ద్వారా సాధారణ జీవితాన్ని గడపవచ్చు.

# స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వస్తుందా..?



**హైదరాబాద్ పెన్ పవర్:** నేటి ప్రపంచంలో, గుండె జబ్బులు, దాని చికిత్స గురించి ఇంటర్నెట్‌లో చాలా సమాచారం అందుబాటులో ఉంది. దీంతో రోగులు, వారి కుటుంబాలు తరచుగా గందరగోళానికి గురవుతారు. ముఖ్యంగా కార్డియాక్ స్టెంట్లకు సంబంధించి, ప్రశ్న పదేపదే తలెత్తుతుంది. స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వస్తుందా? స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వచ్చే అవకాశం పూర్తిగా తొలగించినట్లు కాదని వైద్యులు స్పష్టంగా చెబుతున్నారు. నేటి ప్రపంచంలో, గుండె జబ్బులు, దాని చికిత్స గురించి ఇంటర్నెట్‌లో చాలా సమాచారం అందుబాటులో ఉంది. దీంతో రోగులు, వారి కుటుంబాలు తరచుగా గందరగోళానికి గురవుతారు. ముఖ్యంగా కార్డియాక్ స్టెంట్లకు సంబంధించి, ప్రశ్న పదేపదే తలెత్తుతుంది. స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వస్తుందా? స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వచ్చే అవకాశం పూర్తిగా తొలగించినట్లు కాదని వైద్యులు స్పష్టంగా చెబుతున్నారు. గుండెకు రక్తాన్ని తీసుకువెళ్ళే ధమనులలో కొలెస్ట్రాల్ నిక్షేపాలు దారిని ఇరుకుగా చేసినప్పుడు స్టెంట్ అమరుస్తారు. ఇది సాధారణ రక్త ప్రవాహాన్ని పునరుద్ధరించడానికి, మూసుకుపోయిన సిరలోకి చొప్పించబడే లోహపు మెష్. గుండెపోటు తర్వాత లేదా తీవ్రమైన అడ్డంకులు ఉన్న సందర్భాల్లో సిరను తెరిచి ఉంచడానికి సహాయపడుతుంది. గుండెకు తగినంత రక్త ప్రసరణను నిర్ధారించడానికి సాధారణంగా స్టెంట్ అమరుస్తారు.

స్టెంట్ ఒక నిర్దిష్ట సిరను తెరుస్తుంది. కానీ అది గుండెలోని అన్ని ధమనులను రక్షించదు. రోగి అనారోగ్యకరమైన జీవనశైలిని కొనసాగిస్తే, వేయించిన, అధిక కొవ్వు పదార్థాలు తింటే, ధూమపానం చేస్తే లేదా శారీరకంగా క్రియారహితంగా ఉంటే, ఇతర గుండె ధమనులలో అడ్డంకులు ఏర్పడవచ్చు. అందుకే స్టెంట్ వేసినప్పటికీ మళ్ళీ గుండెపోటు రావచ్చు. స్టెంట్ సహజ సిరకు ప్రత్యామ్నాయం కాదు. ఆ సమయంలో ప్రాణాలను కాపాడటానికి సహాయపడే తాత్కాలిక మద్దతు మాత్రమే. శరీరంలోకి పదేపదే స్టెంట్లను చొప్పించడం సురక్షితమైనదిగా.. శాశ్వత పరిష్కారంగా పరిగణించదంటున్నారు వైద్య నిపుణులు. మళ్ళీ గుండెపోటు వస్తే, రోగి పరిస్థితి మరింత తీవ్రంగా మారవచ్చంటున్నారు. చికిత్స కూడా కష్టతరం కావచ్చు అని కార్డియాలజిస్ట్ వైద్య నిపుణులు వివరిస్తున్నారు. స్టెంట్ అమర్చిన తర్వాత, రోగి మునుపటి కంటే ఎక్కువగా దుర్బలంగా ఉంటాడు. రెండవ గుండెపోటుతో ప్రమాద తీవ్ర పెరుగుతుంది. చాలా సందర్భాలలో, యాంజియోప్లాస్టీ , స్టెంట్ చొప్పించడం అవసరం రావచ్చు. కొన్ని సందర్భాల్లో, శరీరం స్టెంట్‌ను అంగీకరించకపోతే, ప్రక్రియ సమయంలో ఏదైనా సమస్య ఉంటే, పరిస్థితి ప్రాణాంతకం కూడా కావచ్చు. అందుకే స్టెంట్ అమర్చిన తర్వాత నిర్లక్ష్యంగా ఉండకూడదని వైద్యులు పదేపదే హెచ్చరిస్తున్నారు. సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, సరైన సమయంలో వైద్యులు సూచించిన మందులు తీసుకోవాలి. ధూమపానం మానేయడం, ఒత్తిడిని నియంత్రించడం అనేవి స్టెంట్ తర్వాత గుండెను రక్షించుకోవడానికి అత్యంత ప్రభావవంతమైన మార్గాలు. స్టెంట్ అనేది చికిత్సలో ఒక భాగం, మొత్తం చికిత్స కాదు. నిజమైన చికిత్స జీవనశైలి మార్పుల నుండి వస్తుందంటున్నారు వైద్య నిపుణులు.

## టమాటాలు ఫ్రిజ్‌లో నిల్వ చేస్తే.. రోగాలు కొని తెచ్చుకున్నట్లే!



**హైదరాబాద్ పెన్ పవర్:** చట్నీ నుంచి సాంబార్ వరకు ప్రతి వంటకానికి టమోటాలు అవసరం. అందుకే మనం మార్కెట్ నుంచి కాస్త ఎక్కువ మొత్తంలో టమోటాలు కొని నేరుగా ఫ్రిజ్‌లో ఉంచుతాం. ఈ విధంగా రిఫ్రిజిరేటర్‌లో టమోటాలు నిల్వ చేయడం వల్ల వాటి రుచి మారడమే కాకుండా ఆరోగ్యానికి కూడా హానికరం. టమోటాలు లేకుండా వంట చేయడం ఎవరికీ సాధ్యం కాదు. చట్నీ నుంచి సాంబార్ వరకు ప్రతి వంటకానికి టమోటాలు అవసరం. అందుకే మనం మార్కెట్ నుంచి కాస్త ఎక్కువ మొత్తంలో టమోటాలు కొని నేరుగా ఫ్రిజ్‌లో ఉంచుతాం. ఈ విధంగా రిఫ్రిజిరేటర్‌లో టమోటాలు నిల్వ చేయడం వల్ల వాటి రుచి మారడమే కాకుండా ఆరోగ్యానికి కూడా హానికరం అని నిపుణులు హెచ్చరించారు.బాగా పండిన టమోటాలను ఫ్రిజ్‌లో నిల్వ చేయవచ్చు. కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం వాటిని ఐదు రోజుల కంటే ఎక్కువ నిల్వ చేయకూడదట. అతి శీతల ఉష్ణోగ్రతలు టమోటాలలో కణ నిర్మాణాన్ని దెబ్బతీస్తాయి. దీనివల్ల వాటి నాణ్యత తగ్గుతుంది. కాబట్టి మీరు వాటిని రెండు లేదా మూడు రోజుల్లో ఉపయోగించుకుంటే మంచిది. ఫ్రిజ్‌లో ఉంచవచ్చు లేదంటే వాటిని బయట గది ఉష్ణోగ్రత వద్ద ఉంచడం మంచిది. ఈ విధంగా మీరు టమోటాల పూర్తి ప్రయోజనాలను పొందవచ్చు. సాధారణంగా టమోటాలను ఒక వారం కంటే ఎక్కువ రోజులు ఫ్రిజ్‌లో ఉంచితే, అవి బయటి వైపు బాగా కనిపించవచ్చు కానీ లోపల కుళ్ళిపోవడం ప్రారంభించవచ్చు. వంటలో ఇటువంటి టమోటాలను ఉపయోగించడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. రిఫ్రిజిరేటర్‌లో అధిక తేమ వల్ల టమోటాలు మనకు తెలియకుండానే చెడిపోతాయి. ఇటువంటి టమోటాలు తినడం వల్ల అనారోగ్యం, వాంతులు, విరేచనాలు వస్తాయి. రోగనిరోధక శక్తి బలహీనపడటం, ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. మీరు టమోటాలను తాజాగా ఉంచుకోవాలనుకుంటే వాటిని కొన్న వెంటనే కొన్ని రోజుల్లోనే ఉపయోగించడానికి ప్రయత్నించండి. ఫ్రిజ్‌లో నిల్వ చేసినప్పటికీ కూరగాయల కోసం కేటాయించిన డ్రాయర్‌లో ఉంచండి. టమాట లోపల నల్లటి మచ్చలు, దుర్వాసన ఉన్న టమోటాలను ఉపయోగించవద్దు.

## అరటి పండ్లు ఈ టైంలో తింటే ఎన్నో లాభాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏడాది పొడవునా లభించే పండ్లలో అరటిపండు ఒకటి. అరటిపండ్లను పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టంగా తింటారు. అయితే అరటిపండ్లను ఎల్లప్పుడు సరైన పద్ధతిలోనే తినాలి. తద్వారా వీటిల్లోని పోషకాలను పూర్తిగా పొందొచ్చు.ఏడాది పొడవునా లభించే పండ్లలో అరటిపండు ఒకటి. అరటిపండ్లను పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టంగా తింటారు. అయితే అరటిపండ్లను ఎల్లప్పుడు సరైన పద్ధతిలోనే తినాలి. తద్వారా వీటిల్లోని పోషకాలను పూర్తిగా పొందొచ్చు. ఉదయం నిద్రలేచిన తర్వాత అరటిపండ్లు తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఇందులో ఉండే విటమిన్ బి6, పొటాషియం రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి. మలబద్ధకంతో బాధపడేవారికి ఉదయం అరటిపండ్లు తినడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. జిమ్‌కు వెళ్లే ముందు లేదా వ్యాయామం చేసే ముందు 1 లేదా 2 అరటిపండ్లు తినడం మంచిది. అరటిపండ్లలోని కార్బోహైడ్రేట్లు వ్యాయామానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. అలాగే పొటాషియం కండరాల తిమ్మిరిని నివారిస్తుంది. ఇది కండరాలను కూడా బలపరుస్తుంది. భోజనం తర్వాత అరటిపండ్లు తినడం వల్ల జీర్ణక్రియ వేగవంతం అవుతుంది. అరటిపండ్లలోని ఫైబర్ ఆహారం జీర్ణం కావడానికి దోహదపడుతుంది. ఇది పేగు ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. శరీరం నుంచి విషాన్ని బయటకు పంపడంలో కూడా సహాయపడుతుంది. సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య ఆకలిగా అనిపించినప్పుడు జంక్ ఫుడ్ కు బదులుగా అరటిపండ్లు తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇది స్నాక్స్ తినే అలవాటును వదిలించుకోవడానికి సహాయపడుతుంది. ఇది శరీరానికి అవసరమైన పోషణను కూడా అందిస్తుంది.

## టెక్నాలజీ : వాయిస్ ట్రాన్స్లేషన్తో ఒరిజినల్ వీడియోలా!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇన్‌స్టాగ్రామ్‌లో మరో కొత్త ఫీచర్ వచ్చేసింది. క్రియేటర్లకు ఈ ఫీచర్ చాలా బాగా ఉపయోగపడనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని వాడి రీల్స్ కంటెంట్‌ను ప్రాంతీయ భాషల్లోకి ట్రాన్స్‌లేట్ చేసకునేందుకు 'వాయిస్ ట్రాన్స్‌లేషన్ణ ఫీచర్‌ను తీసుకొచ్చింది. దీంతోపాటు 'లిప్ సింక్' టూల్ కూడా ఉంది. ఇప్పటివరకు కేవలం ఇంగ్లిష్, హిందీ వంటి భాషలకు మాత్రమే పరిమితమైన ఈ టెక్నాలజీ తెలుగు, తమిళం, కన్నడ, బెంగాలీ, మరాఠీ భాషల్లో అందుబాటులోకి వచ్చింది.అయితే, వీడియో కంటెంట్ ట్రాన్స్‌లేషన్?లా కాకుండా చాలా నేచురల్‌గా ఉంటుంది. పైగా రోబోటిక్ వాయిస్‌లా ఉండకుండా అచ్చం ఒరిజినల్‌లా అనిపిస్తుంది. గొంతులోని పిచ్, స్టైల్, ఎమోషన్స్‌కు తగ్గట్టు పసిగట్టి అలానే అనువదిస్తుంది. దీనికి లిప్ సింక్ ఫీచర్ కూడా తోడవ్వడంతో మాట్లాడే వ్యక్తి పెదవుల కదలికలను బట్టి ఏఐ ఆటోమేటిక్‌గా అనలైజ్ చేసి, ట్రాన్స్‌లేట్ చేసేటప్పుడు దానికనుగుణంగా కదలికలను మారుస్తుంది. కాబట్టి కంటెంట్‌ను ఏ భాషలో చూసినా ఒరిజినల్ వాయిస్‌లానే అనిపిస్తుంది. వాయిస్ మాత్రమే కాదు, వీడియో ఎడిటింగ్ డిపార్ట్‌మెంట్‌లో కూడా దేవనాగరి, బెంగాలీ, అస్సామీ స్క్రిప్ట్‌లలో కొత్త ఫాంట్‌లను తీసుకురావడం ద్వారా క్రియేటర్లు తమ వీడియోలకు వాళ్ల భాషలో క్యాప్షన్లు రాసుకోవచ్చు.

**లిమిట్స్ క్రాస్ చేయకుండా..**

సోషల్ మీడియాలో ఎక్కువసేపు టైం స్పెండ్ చేయడం కూడా మంచిది కాదని పిల్లల కోసం ఆల్రెడీ కొన్ని రూల్స్, రెగ్యులేషన్స్?ను తీసుకొచ్చింది యూట్యూబ్. పిల్లలను ఎక్కువసేపు సోషల్ మీడియాలో ఉండనివ్వకుండా, వాళ్ల యాక్టివిటీలు, చదువును ఎంకరేజ్ చేసేలా పేరెంటల్ కంట్రోల్? అనే ఫీచర్? తీసుకొచ్చింది. దీంతోపాటు ఇప్పుడు మరో అప్?డేట్?ను పంచుకుంది. అదేంటంటే.. పిల్లలు యూట్యూబ్ షార్ట్స్‌ను ఎంతసేపు చూడాలో టైం లిమిట్ పెట్టొచ్చు. అంతేకాదు, త్వరలోనే షార్ట్స్ ఫీడ్‌ను పూర్తిగా జీరోకి సెట్ చేసే చాన్స్ కూడా ఉందట. అవసరాన్ని బట్టి ఒకరోజు కంప్లీట్ షార్ట్స్‌ను ఆపేయడం లేదా ఎంటర్‌టైన్‌మెంట్ కోసం 60 నిమిషాల వరకు లిమిట్ పెట్టొచ్చు.

15 నిమిషాలు, అరగంట, 45 నిమిషాలు, గంట లేదా రెండు గంటలుగా షార్ట్స్? టైమ్?ని సెట్? చేసుకోవచ్చు. సూపర్‌వైజ్డ్ యూట్యూబ్ అకౌంట్‌లలో బెడ్ టైం, 'టేక్ ఎ బ్రేక్ణ రిమైండర్లను కూడా కస్టమైజ్ చేసుకోవచ్చు. దీంతోపాటు టీనేజర్లకు ఉపయోగపడేలా కంటెంట్?ను అందించడమే లక్ష్యంగా కొత్తగా క్రియేటర్ గైడ్‌ను తీసుకొచ్చింది. ఈ క్రమంలో ఖాన్ అకాడమీ, క్రాష్ కోర్స్, టెడ్-ఎడ్ లాంటి ఎడ్యుకేషనల్ వీడియోలను టీనేజర్లకు ఎక్కువగా సూచించనుంది. వీటిని యూత్ అడ్వైజరీ కమిటీ, యూసీఎల్?ఏకి చెందిన సెంటర్ ఫర్ స్కాలర్స్ అండ్ స్టోరీటెల్లర్స్‌తో కలిసి డిజైన్? చేసినట్టు తెలిపింది. అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్, బోస్టన్ చిల్డ్రన్స్ హాస్పిటల్స్?కు చెందిన డిజిటల్ వెల్‌నెస్ ల్యాబ్‌తోపాటు అంతర్జాతీయ సంస్థల ఎక్స్‌పర్ట్స్ దీనికి సపోర్ట్ ఇచ్చారు. రాబోయే రోజుల్లో అప్‌డేటెడ్ సైన్ అప్ విధానంతో టీనేజర్లకు ఆటోమేటిక్?గా అండర్-18 ప్రొటెక్టెడ్ అకౌంట్‌లలోకి తీసుకొచ్చేలా యాప్?లోనే వెసులుబాటు కల్పించింది.

# సుందర్ స్థానంలో ఆల్ రౌండర్ కాకుండా స్పిన్నర్‌కు ఛాన్స్ ..



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయం కారణంగా న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌కు దూరమయ్యాడు. సెలెక్టర్లు అతని స్థానంలో లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను జట్టులోకి తీసుకున్నారు. వడోదరలో కివీస్‌తో జరిగిన తొలి వన్డేలో బౌలింగ్ చేస్తున్నప్పుడు సుందర్ పక్కటెముకల కండరాల గాయానికి గురయ్యాడు. కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించగా.. అతను బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు వెళ్తాడని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా శుక్రవారం ప్రకటించారు. అయితే సుందర్ స్థానంలో ఇప్పుడు స్పెషలిస్ట్ స్పిన్నర్ ను ఎంపిక చేయడం చర్చనీయాంశంగా మారుతోంది.

స్వదేశంలో వరల్డ్ కప్ జరగడంతో టీమిండియాకు స్పిన్ ఆల్ రౌండర్ కంటే స్పెషలిస్ట్ స్పిన్నర్ అవసరం ఎక్కువగా ఉంది. పైగా సుందర్ ను రీప్లేస్ చేసే స్పిన్ ఆల్ రౌండట జట్టులో లేడు. కృనాల్ పాండ్య అంతర్జాతీయర్ క్రికెట్ ఆడి నాలుగు సంవత్సరాలు దాటింది. నేరుగా వరల్డ్ కప్ కు తీసుకొని వచ్చి ఆడించడం రిస్క్ అవుతోంది. మరోవైపు రియాన్ పరాగ్ రూపంలో స్పిన్ ఆప్షన్ ఉన్నప్పటికీ ఈ యువ క్రికెటర్ పూర్తి ఫిట్ నెస్ తో లేడని తెలుస్తోంది. ఈ సంగతి పక్కన పెడితే వరల్డ్ కప్ స్క్వాడ్ లో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి రూపంలో ఇద్దరు స్పిన్నర్లు మాత్రమే ఉన్నారు. స్వదేశంలో స్పిన్ ట్రాక్స్ ఉండడంతో సెలక్టర్లు బిష్ణోయ్ వైపే మొగ్గు చూపారు.

**తొలి వన్డే ఆడుతూ సుందర్ కు గాయం:**

ఆదివారం (జనవరి 11) వడోదర వేదికగా జరిగిన తొలి వన్డేలో సుందర్ బౌలింగ్ చేస్తూ అసౌకర్యానికి గురయ్యాడు. 5 ఓవర్లు బౌలింగ్ చేసి 27 పరుగులు ఇచ్చి మ్యాచ్ మధ్యలోనే వైదొలిగాడు. ఆ తర్వాత బ్యాటింగ్ జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు 8వ స్థానంలో బ్యాటింగ్ చేయడానికి వచ్చాడు. మ్యాచ్ తర్వాత సుందర్ కు ఎడమ పక్కటెముకలు

గాయం అయినట్టు తేలింది. సుందర్ కు సైడ్ స్ట్రెయిన్ ఉందని మ్యాచ్ తర్వాత స్కాన్ కోసం వెళ్తాడని మ్యాచ్ తర్వాత కెప్టెన్ గిల్ తెలిపాడు. ఈ టూర్ లో టీమిండియా ప్లేయర్లకు గాయాల బెడద కొనసాగుతూనే ఉంది. తొలి వన్డేకు ముందు వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ గాయపడి సిరీస్ మొత్తానికి దూరమైన సంగతి తెలిసిందే. అంతకముందు తెలుగు కుర్రాడు తిలక్ వర్మ గజ్జల్లో గాయం కారణంగా కివీస్ తో జరగబోయే తొలి మూడు టీ20లకు దూరమయ్యాడు.

# RCB పట్టిందల్లా బంగారమే.. టీమిండియా యంగ్ ప్లేయర్ మ్యాచ్ విన్నింగ్ స్పెల్






**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు మరింత పటిష్ఠంగా మారనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ ఐపీఎల్ 2026 మెగా ఆక్షన్ లో కొనుగోలు చేసిన ఇండియన్ యంగ్ ప్లేయర్ ప్రస్తుతం జరుగుతున్న అండర్-19 వరల్డ్ కప్ లో అదరగొడుతున్నాడు. శనివారం (జనవరి 17) బంగ్లాదేశ్ తో జరిగిన మ్యాచ్ లో విహాన్ అద్భుతమైన స్పెల్ తో మ్యాచ్ ను గెలిపించాడు. ఛేజింగ్‌లో బంగ్లా 17.2 ఓవర్లకు 90/2తో పటిష్ట స్థితిలో నిలిచింది. ఈ టైమ్‌లో వర్షం వచ్చి గ్రౌండ్ చిత్తడిగా మారడంతో ఆట ఆగింది. దాంతో బంగ్లా టార్గెట్‌ను 29 ఓవర్లలో 165 రన్స్ గా సవరించారు. ఆట తిరిగి మొదలయ్యాక ఇండియా బౌలర్లు అద్భుత పెర్ఫామెన్స్ చేశారు. ఫిఫ్టీ పూర్తి చేసుకొని జోరు మీదున్న అజిజుల్ హకీం (51)ను ఔట్ చేసిన ఖిలాన్ పటేల్ కీలక బ్రేక్ ఇచ్చాడు. ఇక్కడ నుంచి విహాన్ మల్హోత్రా షో సాగింది. మల్హోత్రా ధాటికి సిద్దిఖీ (15), జిబాన్ (7) రిజాన్ (15), సమియున్ (2) పెవిలియన్ బాట పట్టడంతో బంగ్లా 28.3 ఓవర్లలో 146 రన్స్‌కు ఆలౌటై ఓడిపోయింది. మ్యాచ్ ను గెలిసిపించిన విహాన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఓవరాల్ గా ఈ మ్యాచ్ లో విహాన్ మల్హోత్రా 4 ఓవర్లలో 14 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్ లో 19 ఏళ్ళ విహాన్ ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బేస్ ప్రైస్ రూ. 30 లక్షలకు దక్కించుకుంది. గత సీజన్ లో జరిగిన మెగా ఆక్షన్ లో ఆర్సీబీ కొన్న ఆటగాళ్లు అందరూ అద్భుతంగా రాణించారు. ఈ సారి కూడా 2026 సీజన్ కు ముందు ఆర్సీబీ ప్లేయర్స్ ఆకట్టుకుంటున్నారు.

**బంగ్లాపై ఇండియా థ్రిల్లింగ్ విక్టరీ:**

అండర్-19 వరల్డ్ కప్‌లో యంగ్ ఇండియా వరుసగా రెండో విజయం సొంతం చేసుకుంది. ఓటమి ఖాయం అనుకున్న దశలో స్పిన్నర్ విహాన్ మల్హోత్రా (4/14) చేసిన మ్యాజిక్‌తో శనివారం జరిగిన గ్రూప్‌బి మ్యాచ్‌లో 18 రన్స్ తేడాతో (డక్‌వర్త్ లూయిస్) బంగ్లాదేశ్‌పై థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది. వర్షం అంతరాయం కలిగించడంతో 49 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇండియా 48.4 ఓవర్లలో 238 రన్స్‌కు ఆలౌటైంది. అభిజ్ఞాన్ కుందు (112 బాల్స్‌లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 80), యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ (67 బాల్స్‌లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 72) సత్తా చాటారు. బంగ్లాదేశ్ పేసర్ అల్ ఫహాద్ (5/38) ధాటికి కెప్టెన్ ఆయుష్ మాత్రే (6), వేదాంత్ (0), విహాన్ (7), హర్వాన్ష్ (2), అంబరీష్ (5) పెవిలియన్‌కు క్యూ కట్టినా.. వైభవ్, కుందు జట్టును ఆదుకున్నారు. అనంతరం ఛేజింగ్‌లో బంగ్లా 17.2 ఓవర్లకు 90/2తో పటిష్ట స్థితిలో నిలిచింది. ఈ టైమ్‌లో వర్షం వచ్చి గ్రౌండ్ చిత్తడిగా మారడంతో ఆట ఆగింది. దాంతో బంగ్లా టార్గెట్‌ను 29 ఓవర్లలో 165 రన్స్ గా సవరించారు. 165 పరుగుల టార్గెట్ లో బంగ్లాదేశ్ 146 పరుగులు ఆలౌటైంది.

# టీమిండియాకు ఛేజింగ్ టెన్షన్.. మిచెల్, ఫిలిప్స్ సెంచరీలతో న్యూజిలాండ్ భారీ స్కోర్







**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్ తో జరుగుతున్న మూడో వన్డేలో టీమిండియా బౌలర్లు విఫలమయ్యారు. పవర్ ప్లే లో బాగా రాణించినా ఆ తర్వాత పూర్తిగా తేలిపోయారు. ఆదివారం (జనవరి 18) ఇండోర్ వేదికగా హోల్కర్ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్ లో టీమిండియా ముందు ప్రత్యర్థి న్యూజిలాండ్ భారీ స్కోర్ సెట్ చేసింది. సూపర్ ఫామ్ లో డారిల్ మిచెల్ (137) సెంచరీతో చెలరేగగా.. గ్లెన్ ఫిలిప్స్ (106) కూడా శతకం బాదడంతో మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 337 పరుగులు చేసింది. మిచెల్ 137 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఇండియా బౌలర్లలో అర్షదీప్ సింగ్, హర్షిత్ రానా తలో మూడు వికెట్లు పడగొట్టారు. సిరాజ్, కుల్దీప్ తలో వికెట్ తీసుకున్నారు.

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ కు దిగిన న్యూజిలాండ్ ఊహించని ఆరంభం లభించింది. ఆ జట్టు 5 పరుగులకే ఓపెనర్ల వికెట్లను కోల్పోయింది. తొలి ఓవర్లో అర్షదీప్ సింగ్ నికోల్స్ (0) క్లీన్ బౌల్డ్ చేస్తే.. రెండో ఓవర్లో హర్షిత్ రానా.. కాన్వే (5)ను పెవిలియన్ కు పంపాడు. భారత పేసర్లు విజృంభించడంతో 5 పరుగులకే న్యూజిలాండ్ రెండు వికెట్ల కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో బ్యాటింగ్ కు దిగిన డారిల్ మిచెల్ జట్టును ముందుండి నడిపించాడు. మూడో వికెట్ కు విల్ యంగ్ తో కలిసి 53 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. 30 పరుగు చేసి క్రీజ్ లో సెట్ అయిన విల్ యంగ్ ను రానా ఔట్ చేయడంతో 58 పరుగుల వద్ద న్యూజిలాండ్ మూడో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత గ్లెన్ ఫిలిప్స్ తో కలిసి మిచెల్ టీమిండియా బౌలర్లకు చుక్కలు చూపించాడు. వీరిద్దరూ చాలా ఈజీగా టీమిండియా బౌలర్లను ఆడేశారు. ఓ వైపు మిచెల్, మరోవైపు ఫిలిప్స్ మొదట సింగిల్స్ తో స్ట్రైక్ రొటేట్ చేసినా క్రమంగా బౌండరీల వర్షం కురిపించారు. ఈ క్రమంలో మిచెల్ హాఫ్ సెంచరీతో పాటు సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆ తర్వాత మిచెల్ కూడా సెంచరీ చేసి సత్తా చాటాడు. వీరి జోడీ నాలుగో వికెట్ కు ఏకంగా 219 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టుకు భారీ అందించారు. స్వల్ప వ్యవధిలో వీరిద్దరూ ఔటైనా చివర్లో కెప్టెన్ బ్రేస్ వెల్ (28) వేగంగా ఆడి జట్టు స్కోర్ ను 330 పరుగులు దాటించాడు.




# చీరకట్టులో సంయుక్త అందాలు.. ఆ సోయగానికి ఫిదా!

సంయుక్త మీనన్.. పవన్ కళ్యాణ్ హీరోగా రానా కీలక పాత్రలో పోషిస్తూ వచ్చిన భీమ్లా నాయక్ సినిమాలో రానాకి జోడిగా.. తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఇకపోతే పలు చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించిన ఈమె గత ఏడాది బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన అఖండ సీక్వెల్ అఖండ 2 సినిమాలో నటించి తన అద్భుతమైన నటనతో ఆకట్టుకుంది. ఇక ఈ ఏడాది శర్వానంద్ హీరోగా వచ్చిన నారీ నారీ నడుమ మురారి సినిమాలో హీరోయిన్గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సంక్రాంతి సందర్భంగా వచ్చిన ఈ సినిమా మంచి కామెడీ ఎంటర్టైన్మెంట్ మూవీ అని చెప్పవచ్చు.

ఇకపోతే ప్రస్తుతం సంక్రాంతి సందర్భంగా థియేటర్లలోకి వచ్చిన నేపథ్యంలో మరొకవైపు తన అందంతో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది ఈ ముద్దుగుమ్మ. తాజాగా పట్టుచీర కట్టుకొని అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా భిన్నభిన్నమైన ఫోజులు ఇస్తూ ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది. సింపుల్ హెయిర్ స్టైల్ తో జడలో మల్లె పువ్వులు పెట్టుకొని చేతిలో తామర పువ్వు పట్టుకొని ఏదో ఆలోచిస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ముఖ్యంగా పెద్ద జుంకాలతో తన అందాన్ని రెట్టింపు చేసుకున్న ఈమె మెడలో ఏమీ లేకపోయినా తన అందంతో అభిమానులను ఆకట్టుకుంది..మొత్తానికైతే సంయుక్త మీనన్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్గా మారుతున్నాయి. 2016లో పాప్ కార్న్ అనే మలయాళం చిత్రంతో హీరోయిన్గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి.. తమిళ్, కన్నడ, తెలుగు సినిమాలలో నటిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకుంది. భీమ్లా నాయక్ సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఈమె.. కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన బింబిసారా సినిమాతో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. తర్వాత కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నేరుగా తెలుగులో చేసిన చిత్రం సార్. ఈ సినిమాలో టీచర్ పాత్రలో నటించి తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది.ఇక ఆ తర్వాత వచ్చిన విరూపాక్ష సినిమాలో మరోసారి తన నటనతో మంచి మార్కులు వేయించుకుందని చెప్పవచ్చు. హీరోయిన్గా ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె.. ఇందులో డెవిల్ పాత్రలో అందరిని భయపెట్టేసింది. అలా తన పర్ఫామెన్స్ తో మెప్పిస్తున్న ఈమె ఇప్పుడు నారి నారి నడుమ మురారి చిత్రంలో మరోసారి మెప్పించింది. ఇక ప్రస్తుత సినిమాల విషయానికి వస్తే.. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభు సినిమాలో నటిస్తోంది. ఇందులో మరో హీరోయిన్ నభా నటేష్ కూడా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇక తర్వాత మహారాగ్ని అనే హిందీ సినిమాలో నటిస్తోంది. అంతేకాకుండా రామ్ అనే మలయాళం చిత్రంలో నటిస్తున్న ఈమె.. బెంజ్ అనే తమిళ చిత్రంలో కూడా నటిస్తోంది. అంతేకాదు విజయ్ సేతుపతి, పూరీ జగన్నాథ్ కాంపినేషన్లో వస్తున్న స్లమ్ డాగ్ అనే సినిమాలో కూడా హీరోయిన్గా నటిస్తోంది.

# అనీల్ 10వ సినిమా కోసం 50 రోజులా!

డైరెక్టర్లలలో వేగంగా కథ రాసి సినిమా పూర్తి చేసే దర్శకుడు ఎవరు? అంటే మొన్నటి వరకూ అంతా డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ పేరు జపించేవారు. కానీ పూరి ఫెయిల్యూర్స్ లో ఉండటంతో పాటు, స్పీడ్ కూడా తగ్గించడంతో? ఇప్పుడా స్థానాన్ని కోల్పోయారు. ఆ స్థానంలో హిట్ మెషిన్ అనీల్ రావిపూడి ఆక్రమించాడు. అనీల్ ఇప్పటి వరకూ తొమ్మిది సినిమాలు డైరెక్ట్ చేసాడు. అవన్నీ బ్లాక్ బస్టర్లే. కమర్శియల్ గా మంచి వసూళ్లను సాధించాయి. ఈ సినిమాల షూటింగ్ అంతా కూడా వేగంగా పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాడు. దాదాపు అన్ని సినిమాలు నెలల వ్యవధిలోనే పూర్తి చేసి రిలీజ్ చేసాడు. ఈ సినిమాల స్టోరీలు సిద్దం చేయడం కోసం అనీల్ తీసుకున్నది చాలా తక్కువ సమయమే. ఒకే ఒక్క సినిమా స్టోరీ సిద్దం చేయడం కోసం మూడు నెలలు సమయం కేటాయించిగా, మిగతా ఎనిమిది సినిమాలకు నెలలోపే కేటాయించాడు. ఇటీవలే రిలీజ్ అయిన -మన శంకరవరప్రసాద్ గారు- కథకు అనీల్ తీసుకున్న సమయం కేవలం 25 రోజులే. వైజాగ్ పార్క్ హోటల్ లో సిట్టింగ్ వేసి 25 రోజుల్లోనే స్టోరీ సిద్దం చేసి హైదరాబాద్ వచ్చాడు. ఇప్పుడాసినిమా వందల కోట్ల వసూళ్ల దిశగా దూసుకుపోతుంది. 25 రోజుల్లోనే ఇంత గొప్ప కథ రాసిన అనీల్ ఇంకా ఎక్కువ సమయం కేటాయిస్తే ఇంకా మంచి కథ రాస్తాడు కదా? అన్న సందేహం చాలా మందిలో ఉంది.కానీ అనీల్ అందుకు వ్యతిరేకం. తాను నమ్మిన ఫార్మెట్ ని మాత్రం ఎప్పటికీ వదలనంటున్నాడు. స్టోరీ విషయంలో రోజుల్లోనూ పూర్తి చేయాలన్నది అతడి ప్లాన్. ఈ నేపథ్యంలో అనీల్ 10వ సినిమా స్టోరీ అప్ డేట్ కూడా తెరపైకి వస్తోంది. ఈ సినిమా కోసం అనీల్ 50 రోజులు సమయం కేటాయించాలనుకుంటున్నాడుట. 45 నుంచి 50 రోజుల మధ్యలో పూర్తయ్యే అవకాశం ఉందంటున్నారు. అదే పార్క్ హోటల్ బీచ్ ముందు కూర్చుని స్టోరీ సిద్దం చేయనున్నాడు. మరో రెండు వారాల తర్వాత అనీల్ నేరుగా వైజాగ్ చేరుకుంటాడని సన్నిహితుల నుంచి తెలిసింది. ఈసారి కూడా కథ పరంగా చాలా సింపుల్ గానే ఉంటుందని..హీరో ఇమేజ్ ఆధారంగా స్టోరీ సిద్దం చేసే అవకాశాలున్నాయంటున్నారు.హీరో ఎవరు? అన్నది అనీల్ కూడా ఫిక్స్ అయ్యాడన్నది తాజా అప్ డేట్. అయితే ఆ హీరో పేరు మాత్రం రివీల్ చేయలేదు. స్టోరీ పూర్తయిన తర్వాత ఆ హీరోకి నేరేట్ చేసే వరకూ ఆ వివరాలు గోప్యంగా ఉంటాయంటున్నారు. ఈ కథలో కూడా హీరో ఇన్వాల్వ్ మెంట్ ఉండదని అనీల్ పూర్తి స్వేచ్ఛతో చేసే మరో ఎంటర్ టైనింగ్ స్క్రిప్ట్ గానే ఉంటుందని అంటున్నారు. దీనికి సంబంధించి మరింత సమాచారం ఫిబ్రవరిలో బయటకు వచ్చే అవకాశం ఉంది. అయితే అనీల్ హీరోగా ఇప్పటికే కింగ్ నాగార్జునను ఫిక్సైనట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965